

ఆంధ్రసచిత్రవార
పత్రిక
26-2-65
కళలనీడన బ్రతుకుతెరువు



"చదువుకున్న భార్య" లో వాసంతి


రాంమోహన్
సుకన్య
ఈస్ట్‌మన్ కలర్‌లో నిర్మించిన తొలి తెలుగు సాంఘిక చిత్రం
అంతా కొత్తవారితో నటించిన సంచలన చిత్రం
బాబూ మూవీస్ వారు సగర్వంగా సమర్పించు
తేనెమనసులు
దర్శకుడు ఆదుర్తి సుబ్బారావు నిర్మాత సి. సుందరం
కోడైరెక్టర్ కె. విశ్వనాథ్ సంగీతం మహదేవన్
స్టూడియో శ్రీసారథి. శ్రీ ఫిలింస్ విడుదల
* కృష్ణ
NVKR



మా సింథాల్ సబ్బు కొనేవారికి ప్రత్యేక సదుపాయం:

సబ్బుపైన చుట్టబడివున్న పల్చని కాగితములోపున డిస్కౌంట్ కౌపన్ మీకు కనిపిస్తుంది. ఈ కౌపన్‌తో సింథాల్ టాయిలెట్ పౌడర్‌ను మీరు అసలు ధరలో 30 పైసలు తగ్గించి కొనవచ్చు.


DVS
PRODUCTIONS
డి.వి.ఎస్.ప్రొడక్షన్స్ వారి
మంగమ్మ శపథం
సంగీతం: టి.వి.రాజు
రచన: జూనియర్ సముద్రాల
దర్శకత్వం: బి.విఠలాచార్య ... కోడైరెక్టర్: ఎస్.డి.లాల్ .... నిర్మాత: డి.వి.ఎస్.రాజు
ఆంధ్ర: పూర్ణా....సీడెడ్: ఎస్.ఎ.డి....నైజాం: ఉషా....మైసూరు: సదరన్ మూవీస్....నార్త్ ఇండియా: వాణీ పిక్చర్సు.
VIJAYA

ఉత్తరాలు

దేశభాషలందు ఏది లెస్స?

ఆంధ్ర సచిత్ర వారపత్రిక 5—2—65 సంచికలో మీరు ప్రచురించిన దేశభాషలందు ఏది లెస్స అన్న శీర్షిక నన్నెంతో ఆకర్షించింది. హిందీని రాజభాషగా చేయడమే మేలు అని గొప్పలు చెప్పే మనవారి కళ్ళు తెరిపించే విధంగా విమర్శించినందుకు మీకు నా కృతజ్ఞతాభినందనలు. కేంద్రములో దక్షిణభారత మంత్రులుండి కూడా యిలాంటి ఇక్కట్ల పాలు చేయుట ఎంతో శోచనీయము. కనీసము ఈ వ్యాసాన్ని చదివైనా మనవారు కళ్ళు తెరుస్తారని ఆశిస్తున్నాను.

ఎస్. చంద్రశేఖరరెడ్డి, చాందా సిటీ (మహారాష్ట్ర)

* * *

మీరు "దేశభాషలందు ఏది లెస్స?" సందర్భ పారాంశాన్ని నూటికి నూరుపాళ్ళ నిజం అని చెప్పి నిరూపించారు.

"ఉద్యోగాల్లో చేరటానికి హిందీ వచ్చితీరాలని నిర్బంధం లేదు" అన్నటువంటి హామీలు ఎంతవరకు సమంజసమో, ప్రమోషన్లలో, ఇంక్రిమెంట్లు ఇవ్వటంలో అనుసరిస్తున్న విధానాన్ని ఒక్కసారి వివరంగ పరిశీలించిన తెలుస్తుందేమోమరి!

కొంతమంది ఆంధ్ర మిత్రులు (విశాఖపట్నం)

* * *

మా మనసులోని మాట వ్రాయగలిగినందుకు "దేశ భాషలలో ఏది లెస్స" రచయితగార్కి మా ప్రత్యేక అభివందనములు.

విజయచంద్ర (కాకినాడ)

వైజ్ఞానిక గాథాశతి

29—1—65 ఆంధ్ర సచిత్ర వారపత్రికలో వెలువడిన 'వైజ్ఞానిక గాథాశతి—3' లో డాక్టరుగారు 'సూర్యుడు కూడా భూమిలాగా, చంద్రుడిలాగా తన చుట్టు తాను తిరుగుతాడు' అని గెలిలియో నిర్ధారించుకున్నట్లు వ్రాసారు. ఇందు చంద్రుడు మినహాయింపు. తన చుట్టు తాను తిరుగనందువలననే ఆ గోళం యొక్క వెనుకభాగం (మనకు కంపించనిది) అతి శీతలం అనీ, తెలియనిది అనీ, కృత్రిమ గ్రహాలద్వారా ఛాయాచిత్రములు తీయుడానికి ప్రయత్నించారు.

కె. అప్పారావు (బొంబాయి)

న్యూఢిల్లీ లేఖ

శ్రీ కృష్ణగారు 'రిపబ్లిక్ డే' ను చీకటి రోజుగను, దురదృష్టకరమైన దినముగను వర్ణించినారు. ఇంత గొప్ప ప్రజాస్వామ్య దేశంలో రాజకీయ విభేదాలు, మనస్పర్థలు, అంతఃకలహాలు ఎప్పుడు ఉంటూనే ఉంటాయి. అట్లుండియు, చెమటోడ్చి, రక్తము చిందించి, కన్నీరు కార్చి కష్టపడి సంపాదించిన "రిపబ్లిక్ డే" ను చీకటి రోజు అనడం ఏం భావ్యం?

కుమారస్వామి (మద్రాసు)

కథలు

"లిఖితారేఖ" మానవుని మూఢాచారాలవలన కలిగే కష్టనష్టాలను కన్నులకు కట్టినట్లుగా విశదపరుస్తోంది.

బసవలింగేశ్వరరావు (శ్రీకాకుళం)

* * *

5—2—65 ఆంధ్ర సచిత్ర వారపత్రికలో ప్రచురితమైన 'లతిక' గారి 'క్షితిహాసం' నన్నెంతో ఆకర్షించింది. ఆంధ్రసచిత్ర వారపత్రికలోను, దినపత్రికలోను 'పేచు' కథ, 'తాళాధ్యాయం', 'బ్రహ్మాండమైన కథ', 'పత్ర భ్రమణం' మొదలైన వీరి రచనల్లో నవ్యత గోచరిస్తోంది. ఒకానొక పదాన్ని తీసుకొని, వివిధ కోణాల్లో ఆ పద ప్రయోగాన్ని ఎత్తి చూపుతూ, హాస్యం మిళితం చేస్తూ కొనసాగిస్తున్న వీరి రచనల్లో నవ్యత ఉంది. ఇంకా కృషిచేసి, ఇలాంటి రచనల్ని మా ఆంధ్ర సచిత్ర వారపత్రిక ద్వారా 'లతిక' గారు అందిస్తారని ఆశిస్తున్నా....

'చంద్రశేఖర్' (పాచిపెంట)

* * *

నన్ను మిక్కిలి ఆకర్షించిన కథ "రేఖాచిత్రం" ముఖ్యముగా ఇందలి పాత్రలు—"సుశీ, సుందర రామయ్య" నా హృదయానికి హత్తుకుపోయాం, కాని ముగింపు అంత బాగుండలేదని తెలుపుటకు చింతిస్తున్నాను.

తెలుగుల కృష్ణమూర్తి (పిట్టవలి)

ఫిలిం ఫెస్టివల్

ఈవారం 'శ్రీ వాశిరాజు ప్రకాశం' గారు సింహాళ చిత్రంపై వ్రాసిన విమర్శ నిజంగా మెచ్చుకోదగ్గదే. నేను ఆ చిత్రం చూడకపోయినా, ఆయన పరయిన విమర్శ వ్రాశారనిపిస్తోంది.

"అదే తెగువను, నిష్పక్షపాతాన్ని, మనిశిత దృష్టిని మన తెలుగు చిత్రాలపై వ్యాఖ్యలు రాసేప్పుడు ఎందుకు చూపరూ?" అన్నదే నా ప్రశ్న, సంశయం, ఆవేదన. సోదర పాఠకులు కూడా నాతో ఏకీభవిస్తారనే నా ఆశ.

గిరీశం (వాల్తేరు)

బాలెట్

ఈ సంవత్సరం నిర్వహించుమన్న ఫిలిం బాలెట్‌లో చిత్రాల పేర్లలో "మూగమనసులు", "అమరశిల్పి జక్కన్న" చిత్రాల పేర్లు చేర్చుట సమంజసముకాదు. ఈ రెండు చిత్రాలు 63 సం. పు నిర్మాణ చిత్రాలుగా ప్రభుత్వ ప్రశంసా పత్రాలుగా అందుకొన్నవి. కనుక వీటిని 64 చిత్రాల జాబితాలో చేర్చరాదు. అంతేకాక మూగమనసులు చిత్రం 63 డిశంబరు చివరి రోజులలో (30 లేక 31 న) విడుదల అయినది గాన అది 64 చిత్రాలలో చేర్చుట తెలిసితక్కువతనము. ఈ విషయము పాఠకలోకానికి (ప్రేక్షకలోకానికి) తెల్పి ఫిలిం బాలెట్ పూర్తి చేయించుట మీ విధి.

ప్రభాకర్ జి. (ఏలూరు)

వేల్పులకైనా మార్పులు తప్పవు

"వేల్పులకైనా మార్పులు తప్పవు" శీర్షికలోని శివునిమీద మహేష్‌గారి వ్యాసాలు చాలా బాగున్నాయి. నేటి సంఘంలో ఉన్న అనేక వివిధాభిప్రాయాలను విశితంగా విమర్శించిన మహేష్‌గారికి మా అభినందనలు.

డాక్టర్‌గారి "వైజ్ఞానిక గాథాశతి" నేటి యువప్రపంచానికి మిక్కిలి ఉపయోగకారి కాగలదు.

భారతీయ ప్రాచీన వైభవాన్ని చాటే కాంబోడియా మీది వ్యాసం మిక్కిలి కుతూహలంగా ఉంది. ఈమధ్య ప్రకటింపబడుచున్న ఇటువంటి వ్యాసాలు పత్రికకు క్రొత్త ఆకర్షణ నిస్తున్నాయి. ఈ మూడు శీర్షికలు పత్రికకు నూతన శోభలను సమకూరుస్తున్నవి.

భోగరాజు బలరామమూర్తి (బందరు)

సరోజాదేవి పరిచయం

ఉత్తర దక్షిణ చిత్రరంగాల రెండిటిలోనూ ప్రసిద్ధిచెందిన అందాలతార సరోజాదేవిని పరిచయం చేసినందుకు చాలా సంతోషం.

కాని, సరోజాదేవి ప్రభుత్వం నల్లధనం వెలపరుచు కున్న దానిపై వారి వ్యాఖ్య అంత సమంజసంగా లేదని చెప్పడానికి విచారిస్తున్నాను. కట్టవలసిన ఇన్‌కంటాక్సు కట్టేస్తే ప్రభుత్వానికి కూడా తారల డబ్బు వెలపరుచుకునే అవసరం ఉండదు కదా!

గోవిందరాజు నిర్మల (కలకత్తా) ★

ఇంటింటి పజ్యాలు

ఆరుద్ర

భర్త వాక్యం

ఈ గీతి నెంబరు చేశాక
ఇది చెప్పేదొక్కటే నీతి
"భార్యభర్త అవాలి పాలూ తేనె
వాళ్ళెప్పుడూ కాకూడదు పిల్లీ ఎలుకా"
ఈ ఇంటింటి పజ్యాలు ఇంతటితో సమాప్తం
ఇలాంటివి ఇంకా రాస్తాను ఉంటే ప్రాప్తం.

ఆంధ్రసచిత్ర వారపత్రిక

వ్యవస్థాపకులు :
దేశోద్ధారక కాశీనాథుని
నాగేశ్వరరావు పంతులుగారు

శుక్రవారం: 26-2-'65
(క్రోధినామ సం॥ మాఘ మాస బ॥ ఏకాదశి)
సంపుటము: 57 సంచిక 26
స్థాపితము:
1908

*

ముఖ్య సంపాదకుడు:
శివలెంక శంభుప్రసాద్

*

సంపాదకుడు:
శివలెంక రాధాకృష్ణ

*

ఒక సంవత్సరం చందా వివరాలు

ఇండియా రూ. 15.60. ఇతర దేశాలు ఓడమీద (Sea Mail) రూ. 28 60. విమానం ద్వారా (Air Mail) బ్రిటన్, జర్మనీ, ఇతర యూరోప్, ఆఫ్రికా దేశాలు రూ. 120 00. అమెరికా రూ. 176.80. ఆస్ట్రేలియా రూ. 148.20.

విడిప్రతి 30 పై.
సంవత్సర చందా 15.60 పై.
6 మాసాల చందా 7.80 పై.

*

ఆంధ్రపత్రిక కార్యాలయము
7, తంబుచెట్టి వీధి, మద్రాసు-1



హిందీ పుస్తకాలన్న భ్రమతో నా సైన్సు పుస్తకాన్నే తగులబెట్టా....

మనలోమాట

స్థలాభావం వల్ల కీ. శే. ప్రతాప్‌సింగ్ కైరాన్ హాస్య చిత్రాలు, వార్తలు వెయ్యలేక పోయాము! వీలయినట్లయితే వచ్చే వారం ప్రచురించగలము...

* * *

'అధికారభాష' విషయమై మద్రాసు రాష్ట్రంలో జరిగిన అల్లర్ల వంటివి ఈ మధ్య ఎప్పుడూ చూడలేదని ఎందరో అనుకుంటున్నారు. పై సంచికలో ఈ సమస్యని సాధ్యమయినంత సమగ్రంగా సమీక్షించటానికి ప్రయత్నిస్తాము...

* *

'కళల నీడన బ్రతుకుతెరువు' చూసినవారికి 'నిజంగా' ఎంత నీడ ఉందో చిత్రాలు చూసి, వ్యాసం చదివిన వారికి తెలియగలదు.

* * *

5-3-'65 ఆంధ్ర సచిత్ర వారపత్రికలో 'సర్కార్ గంగాధర్' పరిచయం పాఠకులకి లభిస్తుంది....

* *

త్వరలోనే చిన్న పిల్లల శీర్షిక ఒకటి ప్రారంభించబోతున్నాము. వివరాలకి ఎదురుచూడండి !.....

విషయానుక్రమణిక



హిందీ అల్లం
మీ మానసిక కారాగృహం వదలండి
పరువు నష్టం
కామరాజ్
భక్తవత్సలం
పలుకుబడి పెరిగింది
సి. సుబ్రహ్మణ్యం రాజీనామా తర్వాత
రాజీనామా మునుపు
హిందీ అల్లరి
ఉత్తర. దక్షిణ
ఇదంతా హిందీవాదుల పాపాల కోసమే అనుకుంటా
భలే! — కొంత గెలిచినట్లే
స్వతంత్ర
డి యం కె
OOMMEN

ఢిల్లీపాలనపై కేంద్రీకరించిన్న చూపు!

గత పదిహేనేళ్ళుగా కాంగ్రెస్ సాధించిన ఒకే ఒక పెద్ద ఘన కార్యం; ప్రజల్ని తమ ముఖ్యావసరాల్ని గూడా మరిపించి తన వైపు త్రిప్పుకోగలగటం చెప్పుకోదగ్గ విషయం. ఉదాహరణకి రెండు నెలలుగా ప్రభుత్వం ఆహార సమస్యను, నానాటికీ పెరిగిపోతున్న ధరలను అదుపులోకి తీసుకురావటానికి చేస్తున్న ప్రయత్నాలు యింకా అపరిష్కృతంగానే ఉన్నాయి. ఈ పరిస్థితి యిలా ఉండగానే జనవరి 26వ తారీఖున ఉన్నట్లుండి ప్రజాదృష్టి భాషా సమస్య పైకి మరలింది. ప్రజలంతా తమ ఆకలిని మరచిపోయి భాషా సమస్యను గురించి బొబ్బలు పెట్టటం మొదలు పెట్టారు.

ఇటువంటిదే కాస్త తక్కువ పరిధిలో ఢిల్లీ భవిష్యత్ పరిపాలనా నిర్మాణంపై స్థానిక కాంగ్రెస్ జనతా లేవదీసింది.

ఢిల్లీ సహకారసంస్థల్లోని అవకతవకలన్నీ ఎవరికీ పట్టకుండా పోయాయి. చౌధురి బ్రహ్మప్రకాష్, కాశ్మీరు ముస్లిమ్ మీర్ ముస్తాక్ అహమ్మద్, మలబార్‌హిందువు శ్రీ కృష్ణనాయర్ ఈ అలజడిని అంతమొందకుండా చేశారు. ఈ త్రయంతో. ముఖ్యంగా శ్రీ లాలా గుల్జారిలాల్‌నందా మంతనాలు జరుపుతున్నారని పత్రికలు తెలిపాయి.

స్వారాజ్యసిద్ధికి నిర్భయంగా పోరాటాన్ని సలిపిన శ్రీమతి అరుణా అసఫాలీ ఢిల్లీలో ముఖ్యమైన సమస్య పరిపాలనే కానీ రాజకీయాలుకావని ఒక స్టేట్‌మెంట్‌లో తెలియజేసింది. అయితే పైన చెప్పిన త్రయం మాత్రం అధికారాన్ని హస్తగతం చేసుకోడానికి శాయశక్తులా కృషి చేస్తున్నది. దీనికి తోడు ఢిల్లీ మునిసిపల్ కార్పోరేషన్ తన అసమర్థతను, చేతకానితనాన్ని ప్రజలకు బాహాటంగా ప్రదర్శిస్తున్నది.


సర్దార్ పటేల్ చేసినదాన్ని చేయకపోవటానికి లేక ఆసిద్ధాంతాలకి విరుద్ధంగా ఉండటానికి ఢిల్లీరాష్ట్రాన్ని శాసనసభ, కాబినెట్‌లతో రూపొందించారు. సంవత్సరం తిరక్కుండానే దానిపై దుమారం మొదలైంది. దీన్ని పరిశీలించడానికి కీర్తిశేషులైన పండిట్ నెహ్రూగారు తమ విలువైన కాలంలో రోజుకు ఓగంట చొప్పున నెలరోజులపాటు వినియోగించారు. కానీ ఫలితం దక్కలేదు. ఇంతలో కొన్ని మార్పులు జరిగాయి. ఢిల్లీశాసనసభ స్పీకర్ ముఖ్యమంత్రి కావాలనీ, ఆరోగ్యశాఖ మంత్రి తమ స్థానంనుంచి మారాలనీ చౌధురి బ్రహ్మప్రకాష్ ఢిల్లీ పరిపాలనను దృష్టిలో ఉంచుకుని మామూలు మంత్రి అయినారు.

ఈ అవకాశాన్ని ఆసరాగా తీసుకుని సర్దార్ హుకుంసింగ్ ప్రధానమంత్రి కావాలన్న తమ ఆశలను పెంచుకున్నారు.

స్టేట్స్ రీ ఆర్గనైజేషన్ బోర్డు దీన్నంతట్నీ నిర్మూలించింది.

దేశమంతటా భాషాసమస్య సంచలనం

పార్లమెంట్‌లోని ఒక శాసనం వల్ల ఢిల్లీ మునిసిపల్ కార్పొరేషన్ ఏర్పడింది. మొట్ట మొదట దాంట్లో ఢిల్లీ ఒక్కటే కాకుండా దాని చుట్టు ప్రక్కల ప్రాంతాలు కూడా ఉన్నాయి. ఉపన్యాసాలివ్వడానికి ఉపయోగపడే ఒక వేదికను, కొద్ది మంది ఉండటానికి ఆశ్రయం అందరి సొమ్ముతో నిర్మించగలగటం మినహా ఈ ప్రయోగం నిష్ఫలమైందనే చెప్పవచ్చు.



ఈ పరిస్థితికి శ్రీ నందా ఎంతవరకు బాధ్యులు?

అలా నిష్ఫలమవటానికి గల కారణమేమిటో కేంద్రప్రభుత్వం పరిశీలించనే లేదు. పైగా ఢిల్లీలోని కాంగ్రెస్ రూలింగ్ పార్టీ కేంద్రంలోని రూలింగ్‌పార్టీని నవ్వులపాలు చేయడానికి ఎంత వరకూ సహాయపడిందో కూడా యింతవరకూ తేలలేదు.

దీన్నొక వైపు పరిశీలిస్తూ, రెండోవైపు నుంచి ఢిల్లీ ప్రజల అవసరాల్ని తెలుసుకోడానికి లాలా గుల్జారీలాల్‌నందా ప్రయత్నిస్తే బాగుంటుంది కదా!

ఇక ఈ విషాదోపాఖ్యానంలో మూడో అంకం—

కీర్తిశేషులైన నెహ్రూగారు తమ దృష్టిని ఎక్కువగా ఢిల్లీపైనే కేంద్రీకరించారనిపిస్తుంది. ఆయన ఢిల్లీ కేబినేట్ తీసేసిన తర్వాత ఢిల్లీ పార్లమెంటుకి ఎక్కువ ప్రాధాన్యత నిచ్చారు. ఢిల్లీ ప్రతినిధులు రాజ్యసభలో ముగ్గురూ, లోక్ సభలో అయిదుగురూ ఉన్నారు. వీళ్ళంతా కాక మంత్రి మెహర్‌చాంద్ ఖన్నా, ఉపమంత్రి లాలాశామ్ నాథ్ కూడ ఉన్నారు. షాజహాన్ తర్వాత తనే చరిత్ర ప్రసిద్ధిగాంచాలంటాడు శ్రీ ఖన్నా. ఆయన చేసిన ఘనకార్యం ఏమంటే— సెక్రటేరియట్‌లోని ఉత్తర దక్షిణ బ్లాకులను మార్చటమే.

కేంద్ర సచివాలయ సంరక్షణకు సంవత్సరానికి కొన్ని కోట్ల రూపాయలు ఖర్చవుతున్నాయి. బ్రిటిష్ వాళ్ళు నిర్మించిన సెక్రటేరియట్ భవనం అపరిశుభ్రంగా కాంట్లా ఓడ రేవును గుర్తుకు తెచ్చేట్లు నాలుగో ప్రణాళికా కాలంలో దాన్ని అభివృద్ధి చేయాలని ఖన్నా సంకల్పం.

సమాచారశాఖ ఉపమంత్రిగా ఉన్నప్పుడు లాలాశామ్ నాథ్ దక్షిణ భారతాన్నంతా సతీసమేతంగా చుట్టి వచ్చారు. అంతకు పూర్వం యావద్భారతాన్ని కూడా యింకో సందర్భంలో ప్రభుత్వఖర్చులపై భార్యా సమేతంగా పర్యటించి వచ్చారు.

మిగతా ఆరుగురిలో - లోక్ సభలో ఉన్న నావల్ ప్రభాకర్

రచయితలకు విజ్ఞప్తి

తమ రచనలతో కాక విడిగా స్టాంపులు పంపే వారి రచనలు తిప్పి పంపడం సాధ్యం కాదు. ఈ విషయంలో ఉత్తర ప్రత్యుత్తరాలు జరిపే అవకాశం కూడా లేదని గుర్తించ ప్రార్థనం॥

న్యూఢిల్లీ లేఖ

రాజ్యసభలోని ఐ. కె. గుజ్రాల్ మినహా తక్కినవాళ్ళు పన్నుల రూపంలో భారత ప్రజలు చెల్లించే కష్టార్జితాన్ని పెన్షన్‌గా పుచ్చుకొంటున్న వారే ననవచ్చు.

ఢిల్లీలోని ఈ అవకతవకల్ని అక్కడివాళ్ళు కాక బయటవాళ్ళే ఎక్కువగా శ్రద్ధగా పట్టించుకొంటున్నారు. విద్యుచ్ఛక్తి, నీరు, ఆహార సమస్యల్నిగూర్చి ప్రశ్నల్ని లేవదీసింది కూడా బయటివాళ్ళే. ఢిల్లీలోని పెద్దలంతా దాదాపు దేశంలోనో, విదేశంలోనో పర్యటనలని చేస్తూనే ఉంటారు. ఈ సమస్యల్ని గూర్చి ఆలోచించడానికెక్కడ తీరుతుంది వాళ్ళకి? ఢిల్లీలో సుస్థిరమైన అభివృద్ధి రావాలంటే కాంగ్రెస్ హైకమాండ్‌గానీ, కేంద్ర ప్రభుత్వంగానీ ఢిల్లీ ప్రతినిధులు తమ విధులని సరిగా నిర్వహిస్తున్నారో లేదో తెలుసుకోవాలి. ఉన్నదున్నట్టు చెప్పాలంటే ఢిల్లీ పార్లమెంటులో కాంగ్రెస్ సభ్యులు ప్రజావసరాల్ని గమనించటంలో విఫలులై, తమకు కావలసిన వాటిని మాత్రం చక్కగా అమర్చుకోడంలో సఫలీకృతులైనారనవచ్చు.

చౌధురి బ్రహ్మప్రకాష్, వారి అనుయాయులు చెప్పేవాటిల్లో రెండు మాత్రం సరైనవనొచ్చు. మొదటిది—ఢిల్లీ ప్రతినిధుల సంఖ్య పార్లమెంటులో ఎంత తక్కువగా ఉంటే అంత మంచిది. మంత్రుల సమావేశాల్లో పాల్గొనే అవసరం వాళ్ళ కసలు లేనేలేదు. రెండోది — ఆగస్టు 15, 1947న ఉన్న ఆస్తులకీ యిప్పుడున్న వాటికీ గల తేడాను తెలియజేసి ఆ తేడా ఎలా వచ్చిందో సక్రమంగా రుజువు పర్చడం. వీటి తర్వాత కొత్త పరిపాలనా పద్ధతి ప్రవేశపెట్టడం. కొద్దికాలమే ఉన్న ఢిల్లీ కాబినేట్‌లో తుఫాను సృష్టించిన ఆహారధాన్యాల వ్యవస్థ లెక్కల్ని కూడా బహిరంగ పరచటం. అదేవిధంగా సహకారసంఘాల (ముఖ్యంగా యినుము మొదలగు వాటితో సంబంధం కలవి) లెక్కలను కూడా బయట పెట్టటం అవసరం.

ఇవన్నీ చెప్పడం దేనికంటే రాబోయే ఢిల్లీ నూతన పరిపాలనలో ఏ విధమైన లోటుపాట్లు లేకుండా ఉండటం కోసమే!

చౌధురి బ్రహ్మప్రకాష్ అభిప్రాయాలకి విరుద్ధంగా పత్రికలు వెలిబుచ్చిన అభిప్రాయాన్ని ప్రభుత్వం పట్టించుకోలేదు. తమ కార్యాలయాల్ని వదిలి పోతారో లేదో అనే విషయమైనా ప్రభుత్వం మెహర్ చాంద్ ఖన్నా, శామ్‌నాధ్‌లను అడగాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

—శ్రీ కృష్ణ ★

కలహాలు - కారణాలు

రాధ

కలహాలు సాధారణంగా మనలో వస్తూనే వుంటాయి. కలహమంటే చిన్న తగాదా కావచ్చు పెద్ద తగాదా కావచ్చు. అసలు కలహాలు ఎందుకు వస్తాయి? అదే మనం ముఖ్యంగా తెలుసుకో వలసిన విషయం. కలతలే కలహానికి కారణం, కలతలకు కారణం మనలో వున్న బలహీనత. బలహీనత అనంగానే శారీరకంగా అనుకునేరు. కాదు కాదు అది మానసిక బలహీనత.


ఇక మన కుటుంబాలలో జరిగే కలహాల సంగతి చూద్దాం. కొన్ని యిళ్ళల్లో భార్యాభర్తలిద్దరు ఎప్పుడు కీచులాడుకుంటూనే వుంటారు. ఇవి ప్రణయ కలహాలు కావు సుమండీ! అలాంటివి ఈ కాలంలో జరుగుట బహు అరుదు. ఇప్పుడు భార్యా భర్తలిద్దరు కలహించు కోవడానికి కారణం ఒకరి మనసు ఒకరు సరిగా అర్థం చేసుకోక పోవటమే. అసలు తెలుసుకుందామనే ప్రయత్నం చెయ్యరు. భర్త అంతర్యమేమిటో భార్య, భార్య అంతర్య మేమిటో భర్త తెలుసు కోవాలి. భర్త మీద గౌరవం, అభిమానం వున్న స్త్రీ ఆయనకు అనుకూలంగా ప్రవర్తించడం జరుగుతుంది. భర్త మీద ఎవరికి గౌరవం అభిమానం వుండదంటారేమో, వుంటే వుండవచ్చు కాని ఈ కాలంలో చదువుకున్న స్త్రీలు కొందరు ఆశయాలు, ఆదర్శాలు అంటూ కుటుంబంలో సుఖశాంతులు లేకుండ చేసుకోవటం మనం చూస్తూనే వున్నాము, పుస్తకాలల్లో చదువుతునే వున్నాము. ఒకరి నొకరు అర్థం చేసుకుని జీవించే వారిదే ధన్య జీవితం.

ఒక ఇల్లాలు ఇంట్లో కూర్చుని చదువుకుంటున్న భర్తతో అంటుందిగదా "ఏమండోయ్ నేనలా పక్కింటి పిన్నిగారింటిదాకా వెళ్లొస్తాను" అని అంటు గుమ్మం దాటుతూ "కాస్త చంటి పిల్లాడిని చూస్తూ ఉండండి" అని వెళ్ళిపోతుంది. 'భర్తంటే భయంగల గృహిణి అయితే అలా వెళ్ళిపోతుందా? పసివాడిని భర్తకు అప్పగించి అలా పెత్తనానికి వెళ్ళకపోతే ఏం? ఇంట్లో కూర్చుని పనులు చేసుకుంటుంటే ప్రొద్దు గడువదా?' ఆవిడ విషయంలో ఆమె భర్త బాధ పడవచ్చు. తన భార్య అందరి ఇళ్ళకు అలా తిరగట్టం ఇష్టం ఉండదు. అలాగని ఆమెతో అంటే ఆమెకు ఎంతో కోపము వస్తుంది. ఒక ఇల్లాలు భర్తతో "బియ్యం అయి పోయినాయండీ!" అంటుంది. మొన్ననేగా అర బస్తా బియ్యం తెచ్చింది అంటాడు, ఆయన. ఆమాట విని ఆమె అపార్థం చేసుకుంటుంది. "నేను తింటున్నానా బియ్యాన్ని? కట్టుకున్న భార్య మీద ఇంత నమ్మకం లేకపోతే ఎట్లా" అంటూ కన్నీరు కారుస్తుంది. ఆమె భర్త కొంచెం పొదుపరి. ఆమేది కొంచెం దుబారా చెయ్యి. భర్తని ఆమె ఏమాత్రమయినా అర్థం చేసుకుందేమో చూడండి. ఇలాంటి వెన్నో మన ఇళ్లల్లో జరుగుతునే ఉన్నాయి.

ఇక మన అజ్ఞానాన్ని, అసూయకల్పాన్ని కని పెట్టి ఎదటివారి కాపురాన్ని కొందరు విచ్ఛిన్నం చేస్తారు. రాక రాక ఒక కలహభోజని ఇంటికి ఒక నవ దంపతులు అద్దెకు వచ్చారనుకోండి. వాళ్ళ హాయిగా కులాసాగా కబుర్లు చెప్పుకోవడం జంటగా సినిమాలకు షికార్లకు వెళ్ళడం ఒకరి మీద ఒకరు 'జోక్సు' వేసుకొని నవ్వుకోవటం, ఇలాంటివన్నీ చూస్తు ఆ ఇంటావిడ ఓర్వలేక పోతుంది. వాళ్ళ నవ్వులు ఆమె పాలిట శూలాలు అవుతాయి. ఎందుకంటే అంత మధురమైన నవ్వు ఆమె భర్తనుండి ఎప్పుడు పొందలేదు. గనుక ఆ ఇంటాయనకు ఆమె పద్ధతులు, ఆమె వైఖరి నచ్చదు. ఆమె తనకు భర్తతోపాటు జంటగా సినిమాకు పోదామని కోరిక ఉంటుంది. అదే విషయం ఆయన్ని అడిగితే ఆయనకు ఇష్టం ఉండదు. అందుకని వెంటనే 'డబ్బులు లేవనో, లేక తల నొప్పి అనో' ఏదో ఒక వంకతో సినిమా ప్రోగ్రాం కాన్సిల్ చేస్తాడు. అందుకనే తను పొందలేని సుఖాన్ని ఎదుటివారు పొందుతుంటే ఆమె చూడ లేదు. విశేషంగా ఆడువారికి అసూయ ఎక్కువ. ఆఫీసులో తన భర్త ఒక అమ్మాయితో మాట్లాడాడని ఇంటికి రాగానే భర్తమీదకి ఒంటికాలిమీద దండెత్తుతుంది. ఆయన ఆమెతో ఏం మాట్లాడాడు. ఒక ఆఫీసులో పని చేస్తుంటే మాట్లాడకుండ ఎలా ఉంటారు అని ఆమె అనుకోదు.

ఆమె భర్త మనసు అర్థం చేసుకుంటే అలా మాట్లాడుతుందా? దీనిమీదనే వారిద్దరు వాదించుకొని సుఖశాంతులు లేకుండ చేసుకుంటారు.

ఆ కలహభోజని ఇంట్లో అద్దెకువున్న అమ్మాయి భర్త ఆఫీసు పనిమీద కాంపు వెళ్ళాడనుకోండి. ఆ మరునాడు ప్రొద్దునే కలహభోజని ఆ అమ్మాయికి "ఏమ్మా రాత్రి మీఆయన ఇంటికి రాలేదేం" అని అడుగుతుంది. "కాంపు వెళ్ళారని" ఆమె జవాబిస్తుంది. "ఈకాలం వాళ్ళని నమ్మటానికి వీలులేదు. ఆఫీసు పనులంటూ రాత్రిళ్ళు ఆఫీసు పనులేంటి నా మొహం, అయినా ఎక్కడికి పోతే నా కేందుకులే" అంటు అక్కడినుండి వెళ్ళి పోతుంది. ఆ చివరి మాటలోనే ఆమె అర్థం గ్రహించేస్తుంది. ఇక తరువాత మామూలే. కాంపు నుండి ఇంటికి రాగానే ఆమె ఆయన్ని అడుగుతుంది "రాత్రి మీరు ఎక్కడకు వెళ్ళారూ" అంటూ. "ఆఫీసు పనిమీద వెళ్ళానని చెప్పానుగా" అంటాడు. "నాకు తెలుసులెండి మీరు ఎక్కడకు వెళ్ళారో" అంటూ కన్నీరు కారుస్తుంది.




పొరిగింటావిడ మాటలు బాగా పని చేసాయి ఆమె చాలా నిదానపు మనిషి. అయితే తగాదా రాకపోను. ఆమె ఆలోచించగల శక్తి గలదేకాని అప్పుడు ఆమె ఆలోచించలేకపోయింది. గతరాత్రి భర్త ఎక్కడకు వెళ్ళాడనే ఆలోచిస్తుంది కాని పొరిగింటావిడ మాటల్లో ఎంత నిజమనేది ఆలోచించదు. ఎందుకని ఆలోచించదు అంటే అది ఆమెలోవున్న మానసిక బలహీనత. అంతకుముందు లేని అనుమానం ఆమె చెప్పగానే ఎందుకు వచ్చింది అంటే అది ఆమె అజ్ఞానం

నారదుడులాంటి మహానుభావుడే తగాదాలు పెడితే మనం పెడితే ఏమిలే అన్నట్లు మాట్లాడతారు కొందరు. నారదుడు లోక కల్యాణార్థం పెట్టాడు. మనవాళ్ళు ఐక్య విచ్ఛినంకోసం తగాదాలు పెడుతున్నారు.

మనవాళ్ళు నలుగురు ఒకచోటచేరి ఒక గాలి వార్తను పట్టుకొని తర్జన భర్జనచేసి చివరకు ఆ గాలి వార్తను యదార్థవార్తగా చేస్తారు. అదే మరలా వాళ్ళల్లో కలహాలు రేపుతుంది. కొందరు చెప్పుడు మాటలవల్ల కలహాలు పెంచుకొంటారు. ఆ కలహాలకు మనమే కారణము. ఎందువల్లనంటే చెప్పుడు మాటలు విన్నప్పుడు అవి ఎంతవరకు నిజము అనేది తేల్చుకోవాలి.

ఎవరితోనైనా తగాదా వచ్చినప్పుడు మనమే సర్దుకుపోవాలి. మనము మాట్లాడకుండ ఉండిన ఎడల ఎదుటివారు పోట్లాడుట ఆపి వేస్తారు. అలా కాకుండ వాళ్ళతోబాటు బిగ్గరగా మనము పోట్లాడితే అప్పటి పరిస్థితి ఎలా ఉంటుందో కాస్త ఆలోచించుకోండి. కనుక ప్రతివారికి సహన శక్తి, ఆలోచనాశక్తి అవసరము. మితంగా మాటాడే వ్యక్తికి ఎంతో గౌరవం ఉంటుంది. అలాంటి వారికి కలహాలతో పనిలేదు. కలహాలకు సగం కారణం చుట్టు ప్రక్కల పరిస్థితులు. ఆ పరిసరములో ఎవరైనా ఇద్దరుగాని, ఒకరుగాని కలహభోజులు ఉన్నారంటే ఆ ప్రదేశం నిత్యం తగాదాలతో ఉంటుంది. నైతికంగా ప్రతివారు బాగుంటే సంఘంలో పలుగురు బాగుంటారు. ★


అమ్మా, నేను, నా బొమ్మల నన్నిటిని సరిగా పెట్టాను...
Cadbury's
MILK
CHOCOLATE
100 g
అల్లాగ! అయితే. ఆమెకు ఒక చాక్‌లెట్
ఇవ్వాలి—
పాల యొక్క గుణములు
గలిగిన క్యాడ్‌బరీస్ చాక్‌లెట్!
Cadbury's క్యాడ్‌బరీస్ చాక్‌లెట్
మిఠాయిని మించినది... ఆహారము!

ఫొటోలు: ప్రభాకర్

మనచుట్టూ ప్రపంచం

కళల నీడన బ్రతుకుతెరువు



వయస్సుకు పసివాడే కాని, చక్కని బొమ్మలు తయారుచేస్తాడు.

'కళ కళ కొరకే' అన్నది పాశ్చాత్యుని నిర్వచనమే అయినా, అదే కళ జీవనానికి కూడా ఎంతగానో ఉపకరిస్తుందన్నది జీవితసత్యం. కళల నీడననే, అజ్ఞాతంగా, బ్రతుకుదెరువును కూడగట్టుకొనే పారిశ్రామికులు, చేతిపనివారే అందుకు తార్కాణం. వీరంతా రూపొందించే వస్తువులే దైవదత్తమైన వీరి ప్రతిభకు ప్రత్యక్ష నిదర్శనం.

జార్జిటౌన్‌లో బస్సుదిగి రెండడుగులు ముందుకు వేయగానే, అందమైన ఓ ఇంగ్లీషుబ్యాంకు, ఆ బ్యాంకు ఎదుట అంతకంటె ఎన్నో వందలరెట్లు అందమైన బొమ్మలనుచేసే కళాకారులు కనిపిస్తారు. మద్రాసు నగరంలో యిలాంటి దృశ్యాలు ఇదొక్కటే కాకపోయినా, వేళ్లమీద లెక్కించ దగినంత కొద్దిగానే వున్నాయని నిస్సందేహంగా చెప్పవచ్చును.

అవి రకరకాల బొమ్మలు; కొంగలు, హంసలు ఎంతో అందంగా ఉంటాయి. కొంగ ఒకటి చేపపిల్లల నొకదానిని నోటికి కరుచుకొని మనవైపే చూస్తున్నట్లుండే దృశ్యం ఎంతో రమ్యంగా ఉంటుంది. అలాంటివి ఎన్నెన్నో కొంగలు, మరెన్నో రకాల బొమ్మలు.

ఎంతో బావున్నాయి

'ఆ బొమ్మలు చూడు, ఎంత బావున్నాయో' అన్నాడు ప్రభాకర్, కెమెరాను సర్దుకొంటూ. చాలా బావున్నాయని నాకూ అనిపించింది. ఎందుకు బావున్నాయో, ఎంతెంత అవుతాయో, ఎలా తయారవు

వాశిరాజు ప్రకాశం

తాయీ తెలుసుకోవాలి, తెలుసుకున్నదొ అందరికీ చెప్పాలని అనిపించింది.

మరుక్షణమే అక్కడ ఉన్న దాదాపు అరడజను మంది పనివారిని కలిసి, రకరకాలైన ప్రశ్నలు వేశాను. ప్రభాకర్ కూడా తన 'కెమెరా' కు పని కల్పిస్తూనే ఉన్నాడు. వాటి ఫలితమే యీ వ్యాసం !

అడవుల్లో తిరిగే అందమైన దుప్పి కొమ్ములు విడిగా చూస్తే సామాన్యంగా ఉంటాయి. ఎద్దుల, గేదెల కొమ్ములు కూడా ఎవరికీ పనికిరావు. కాని ఎవ్వరికీ పనికిరాని ఆ కొమ్ములనే కూడగట్టుకొని, వాటిని అందరినీ ఆకర్షించే బొమ్మల్లోకి మలుచుకోవటంలోనే ఆ కళాకారుల ప్రతిభ వ్యక్తమవుతుంది.

నలుగురూ నడిచే 'పేవ్‌మెంటు' మీద కాస్త విశాలంగా ఉన్నచోట కూర్చొని, జనసామాన్యంతో పని లేకుండా, బొమ్మల లోకంలో మునిగిపోతారు వీళ్ళు. దాదాపు అరడజను మంది ఉంటారు. జార్జి టౌన్‌లో ఎప్పుడూ 'ఛార్టర్డ్ బ్యాంకు' ఎదురుగానే కూర్చొంటారు. ఒక్కో కొమ్ములోనుంచి రెండు, మూడు బొమ్మలు సులభంగా చేయవచ్చు. ముందు నమూనాను తయారు చేసుకోవటం, ఆ తరువాత దానికి రూపం పోయటం, రంగుల కొరత కూడా తీరిందన్నట్టు, తెల్లగా మెరిసే 'పౌడర్' ను అద్దటంతో ఆ బొమ్మకు జీవం వస్తుంది. సాధ్యమైనంత వరకు బొమ్మనంతా అతుకులు లేకుండా తయారు చేస్తుంటారు.

తక్కువ ఖర్చు...

వీటికి అయ్యే ఖర్చు కూడా చాలా తక్కువ. పని వారికి ఒక్కో బొమ్మ ఖరీదు రెండు రూపాయలు అయితే, దానిని వాళ్ళు రెండున్నరకు గాని, మూడు న్నరకు గాని విక్రయిస్తారు.

ఈ బొమ్మలనే ఎక్కడైనా ఎగ్జిబిషన్‌లో గాని, పెద్ద మార్కెట్‌లో గాని పెడితే కనీసం ఒక్కోదానిని పది రూపాయలకు లేదా పదిహేను రూపాయలకు విక్రయించవచ్చు. ఆ సంగతి యీ పనివారికిక్కడా తెలియకపోలేదు.

"మీరూ ఎందుకలా చేయరు" అని అడగ్గా, "అదంతా మాకు వద్దు బాబూ, యీ బ్రతుకే హాయిగా ఉంది. సాయంత్రానికల్లా నాలుగు డబ్బులు చేతికి వస్తాయి" అన్నారు.

తెలుగువారే


అంతకన్నా నన్ను ఆకర్షించిన మరో సంగతేమంటే మద్రాసులో ఈనాడున్న 9 లక్షల మంది తెలుగు వాళ్ళలో వీరూ కొందరు. చెప్పిన సమాధానాల నన్నిటినీ స్ఫుటంగా తెలుగులో చెప్పారు.

ఈ బొమ్మలను తయారుచేయటానికి వీళ్ళకు గురువుగాని, మరో పాఠశాలగాని లేవు. అంతా స్వయంకృతం. వాళ్ళ మాటల్లో చెప్పాలంటే "దేవుడు నేర్పిన విద్య" అది.

తరచు యీ మహానగరాన్ని సందర్శించే విదేశీయులను యీ బొమ్మలు బాగా ఆకర్షించాయి. చాలా మందికి ఇవి నచ్చాయి. అందువల్లనే కాబోలు, బొమ్మ ఖరీదు రెండు రూపాయలయినా, కొందరు ఐదు, పది—ఇచ్చి పోతుంటారు

'సో లవ్‌లీ'

మా ఎదుటే ఒక విదేశీయు డొచ్చాడు. వీటిని పాలరాతితో చేశారన్న భ్రమ కలిగిందతనికి. కాని అసలు సంగతి చెప్పగానే 'సో లవ్‌లీ' అంటూ [illegible] బొమ్మలు కొనుక్కుని



శ్రమజీవుల కళారాధన...

వెళ్ళాడు. ఇలా ఉంటాయి వాటి ఆకర్షణ.

ఆధునికంగా గృహాలను అలంకరించుకోవటానికి ఇది ఎంతో అందంగా కనిపిస్తాయి. చౌకలోనూ వస్తాయి.

ఈ బొమ్మల తయారీ కార్యక్రమంలో ఆడవాళ్ళు, పిల్లలు కూడా నిమగ్నులై ఉంటారు.

సాయంత్రం ఆరు గంటల వరకూ అక్కడే పనిచేస్తూ కూర్చుంటారు. లోకమంతా వీరి ముందుగానే నడిచిపోతున్నా, అవన్నీ వీళ్లకు పట్టవు. దగ్గరికెళ్ళి కదిపి, పలకరిస్తే మాట్లాడుతారు. లేకపోతే, మౌనం వహిస్తారు.

జోడు గుర్రాలపై సవారీ

ఇంత చక్కటి బొమ్మలను చేయగలిగిన వీరి ప్రతిభ ఇంతకన్నా చక్కని రీతిలో వినియోగం అయితే ఎంతో బావుంటుం దనిపిస్తుంది. ప్రభుత్వాల ఆధ్వర్యాన అమలుజరిగే 'కళాపోషణ' పథకాలు వీరికి వర్తించవు కాబోలు !

మొత్తంమీద, కళల నీడన బ్రతుకుదెరువు సంపాదించుకొంటూ ఉండే వీరిని చూస్తుంటే, కళ, వృత్తి జోడు గుర్రాల్లాగా, జీవితమనే రథాన్ని లాక్కుంటూ పోతున్న ట్లనిపిస్తుంది. అదే జీవిత సత్యం. అజ్ఞాతమూ అదే ! ★



బొమ్మల తయారీలో ఒక శ్రామికునికి అతని భార్యతోడ్పడుతున్న దృశ్యం.



అవ్యక్తరాగం

రామలక్ష్మి

చంద్రం జీవితోద్యోగాన్ని కొన్నాళ్ళు సస్పెన్షన్‌లో ఉంచాలని బుద్ధి పుట్టింది భగవంతుడికి. అందుకే చంద్రం సస్పెన్షన్ ఫూల్ అయ్యాడు. ఆ సాయంకాలంవేళ అన్యాయంగా కళ్ళనీళ్ళు పెట్టుకుంది మధుర.

జీవిత మధ్యమాకాశం ప్రాక్పశ్చిమాల్లో చంద్ర సూర్యులను ధరించి శూన్యంగా చూస్తున్నది ఏవంకకో. బహుశ వీరిద్దరి జీవితాన్నే కాబోలు! ఈ దంపతుల విచిత్ర సంఘర్షణనే తిలకిస్తోంది. స్త్రీ పురుష సహజమైన సంఘర్షణ అది.

మధుర కళ్ళు అశ్రువుల్ని వర్షిస్తున్నాయి. దించిన కనురెప్పలకు ఉత్తరంలోని అక్షరాలు మసక మసగ్గా కనిపిస్తున్నా విస్పష్టంగా నిలుచుండిపోయింది. ఉత్తరాన్ని చదివీ చదవటంతో మధుర గుండెలమీద బలంగా సుత్తి దెబ్బలుపడి మనస్సుని మూర్ఛపోయేలా చేశాయి. ఇక ఆవిడకి చైతన్యం ఎక్కణ్నించి సరఫరా అవుతుంది?

మధురకి ఎదురుగా పాంటుజేబుల్లో చేతులుంచి రెప్పవాల్చకుండా తీవ్రంగా చూస్తున్నాడు చంద్రం, ఉచ్ఛ్వాస నిశ్వాస వేగాన్ని ఆపలేని అతని విశాల వక్షస్థలం తెల్లని షర్టు బటన్‌లను వూడబెరికేసేటంతగా ఉద్రేకపడుతుంది. మనస్సుని చీల్చి నగ్న సత్యాన్ని తెలుసుకుని మనశ్శాంతిని పొందుదామని ఉరక వేస్తున్న యువక రక్తపు వేడి ఆవేశంతో మధురవైపే తీక్షణంగా చూస్తున్నాడతను. కాని నిజం ఎలా తెలుస్తుంది? నిజా నిజాల్ని గ్రహించే ఘటన ఎలా ఏర్పడుతుంది? ఎక్కడుంటాడోగాని ఆత్మలన్నీ ఐక్యమై సంపూజించే సర్వేశ్వరుడికే అంతఃకరణాల సూక్ష్మ సత్యా సత్యాలు విదితమౌతాయి. అందుకే అతను పరమాత్ముడైనాడు. ఒక దొంగను శిక్షించి ఒక దొంగను రక్షిస్తున్నాడు. ఒక ధర్మాత్ముణ్ణి రక్షించి మరొక ధర్మాత్ముణ్ణి శిక్షిస్తున్నాడు. ఈ సూక్ష్మ గ్రహణం, మనసులవల్లనూ, ప్రవర్తనలవల్లనూ ఏదో గ్రహించాలని తాపత్రయపడే మానవ మాత్రులకి అసాధ్యం.

ఉత్తరంలోని సంగతేమిటంటే అది చదవాలే గాని వేరే వివరించి చెప్పటం వృథా కాలయాపనే.

ప్రియమైన అత్తయ్యకు నమస్కరిస్తూ

దుఃఖంతో మధుర మీనాక్షి వ్రాయులేఖ. మామయ్యకు నా నమస్కారములు చెప్పు. ఇంతకీ నా నుదుటి గీత బాగులేదత్తయ్యా! నాన్నే ఉంటే నా కింత అన్యాయం చేసేవాడా? వెంకట్రావు మామయ్యా, నువ్వు నన్నెంత ప్రాణంగా చూసుకుంటారో తెలిసికనే అమ్మ ఇంత మొండి పట్టు పడుతోంది. నిజానికి చిన్న మామయ్యనే నాన్న అస్తమానం దరిద్రుడంటూ తిట్టేవాడు. అదలా ఉంచి నాకు రవి బావ దగ్గరున్న చనువు చంద్రం దగ్గర ఎలా వస్తుంది? రవి బావనే నేను మన సారా ప్రేమించానని నీకు తప్ప మరెవరికి తెలుస్తుంది? నా హృదయ ఘోష నీకూ, భగవంతుడికీ తెలుసు. నా మనస్సు ఎవర్ని కోరుతున్నదో, ఎవర్ని మనస్ఫూర్తిగా పూజిస్తున్నదో ఈ క్షణాన చెప్పినా ఇక అమ్మ ఉద్దేశ్యం మారదు. ఆమె మార్చుకోదు. వివాహం దాదాపు నెల రోజుల్లో ఉంది. ముహూర్త నిర్ణయం కూడా జరిగిపోయింది. ఇక మిమ్మల్ని నేను కోరే దొక్కటే. ఇష్టమున్నా లేకపోయినా ఈ వివాహ ముహూర్త సమయాని కొక సారివచ్చి దీవించి వెళ్లిపొండి. ఇక మీకూ, రవి బావకీ నేను పరాయిదాన్నే అయిపోయాను. ఎంత అయిష్టంగా ఉన్నా చంద్రంకీ, ఆ చిన్న మామయ్య వాళ్ళకే సన్నిహితురాల్నవుతున్నాను. అమ్మను ఇంకా ఒప్పించాలని ప్రయత్నం చేయటం వృధా ప్రయాస అని నేను వ్రాసినట్టు మామయ్యతో చెప్పు. అత్తయ్యా! లేకపోతే అన్ని విధాల నాకే ప్రమాదం సంభవించొచ్చు. నా బాధనంతా నీ కడుపులో దాచుకో. పెళ్ళి రోజులు దగ్గరౌతున్నకొద్దీ నా మనసులో మంటలు మరీ పైకిలేస్తున్నాయి. కాని నువ్వు కంగారుపడకు. నేనేమీ అఘాయిత్యపు పని చేయనులే. ఇంతే సంగతులు. బావని మరీ మరీ అడిగినట్టు చెప్పు.

నీ కోడలు
మధుర.

ఆ ఉత్తరంలోని సంగతులు గుర్తు వస్తున్న కొద్దీ మధుర గుండెలు భయంతో జలదరించి పోతున్నాయి.

ఆ ఉత్తరంలోని సంగతులు గుర్తు చేసుకుంటున్నకొద్దీ చంద్రం మనస్సు భగ భగ మండి పోతున్నది.

"ఊఁ—నిజం చెప్పు! ఇది నువ్వు మనస్ఫూర్తిగా రాసిన ఉత్తరమేనా?" అని గర్జించాడు చంద్రం గంభీరంగా. ఎంత అణుచుకుందామన్నా అతని ఆవేశం అణగడంలేదు. ఎంత క్రూరమైన స్త్రీ?! ఈ సుకుమారమైన పెదవుల్లోనుంచేనా ప్రణయామృత వచనాలు ప్రవహించగా తను విన్నాడు? ఈ మనోహరమైన నేత్రాల్లో నే నా తను లజ్జాన్విత రేఖల్ని చూశాడు? ఈ సౌందర్యరాణికి మరో పేరు విషధారిణి అని గుర్తించలేకపోయాడు తను! అవును—రాక్షస స్త్రీలు కూడా దేవతా స్త్రీల రూపాలు ధరిస్తారు. దేవతల్ని అనుకరిస్తారు.

మధుర అనుకున్నది అదే సమయంలో ఈ ఉత్తరం తన అంతాన్నే, తన జీవితపు అంతాన్నే చూసేలాగే ఉంది. భారతదేశంలోని స్త్రీ జీవితానికి ఇటువంటి ఉత్తరం ఒక్కటే చాలు గొడ్డలి పెట్టు పెట్టడానికి. ఈ ఉత్తరం చంద్రాని కెలా వచ్చింది? ఇప్పటి కిప్పుడు ఇతని కెక్కడ దొరికింది? ఇంతలో ఇంత దురదృష్ట సంఘటన వెన్నాడి వస్తుందని తను అనుకుందా? చిత్రమైంది కర్మ. ఎన్ని ప్రశాంతానందతరంగానుభూతులైనా ఒక విషాదపు వెల్లువతోసరి! అతని కేమనిచెప్తే నమ్మగల డిప్పుడు? ఏమని చెప్తుంది తను?—

"ఏం? సమాధానం చెప్పవేం? నే నడిగేది వినిపిస్తోందా?"

మధుర ఉలిక్కిపడ్డది. అతని కళ్లల్లోకి చూడలేకపోయింది సరిగ్గా. ఏ చిన్న సంఘటనకేనా తట్టుకునే ధీర గుణం కాదామెది.

నిలువెల్లా ఒణికిపోతూ, "నా కేమీ తెలీదు..... నిజంగానే నేను......" అంటుండగానే కంఠం అణిగిపోయి రెండు కన్నీటి బొట్లు కపోలాల మీదకి జాలువారాయి.

కొందరు పురుషులు స్త్రీల కన్నీటిలోనే 'నటన'ను చూస్తారు. సంఘటనల ప్రాబల్యమే కావచ్చు. అదేవిధంగా చంద్రం ఈసడింపుతో, అనుమానంతో, అపనమ్మకంతో చూశాడు మధుర దుఃఖించటాన్ని.

తృణీకారంగా చూస్తూ, "ఇంతమాత్రానికి ఏడుపెందుకు? నిజం చెప్పి నీ ఇష్టంవచ్చిన చోటుకు వెళ్లొచ్చు" అన్నాడు కటువుగా.

"ఇంతకంటె ఏం నిజం చెప్పాలి?" రెండు సార్లు ప్రయత్నించి గద్గదకంగా ఈ ఒక్కముక్క అనగలిగింది మధుర.

"హు!" అని ఒక్క విరసపు నవ్వు నవ్వాడు చంద్రం. ఇద్దరి పరిస్థితీ అతిశయ స్థితిలో వస్తున్నది క్రమేణా.

వివాహానంతరం హనీమూన్ మధుర బృందావనాది పుణ్యలాభ పవిత్ర ప్రాంతాల్లో దివ్యంగా గడిపి, ఆ తోవనే తిరుగుదలలో తన పెద్ద తండ్రి ఆహ్వానాన్ని పురస్కరించుకొని వారింట దిగిన చంద్రానికి ఊహించని దుస్థితి తటస్థించింది. అతడి మనస్సు పూర్తిగా విరిగిపోయింది క్షణాల వ్యవధానంలోనే.

"నిజం చెప్పు మధురానువ్వు రవిని ప్రేమించావా? మాటిగా చెప్పటం మనిద్దరికీ మేలు!"

మధుర అలాంటి ప్రశ్న భర్త నోటినుండి విని సిగ్గుతో కుంచించుకుపోయింది. అతని మాటలకు గుండెల గోడలు ప్రతిధ్వనించి ఆ ధ్వనులు చెవులకు కఠినంగా వినిపించాయి. 'ఛీ' అనబోయి ఆగిపోయింది. ఆ ఒక్క ఉచ్చారణవల్లనూ అతని అనుమానం ధృవపడుతుందేకాని తగ్గదు.

చివరికి తడి ఆరిన పెదాలు కదిలాయి అతి కష్టంగా:

"మీరు నమ్మినా నమ్మకపోయినా చెప్తున్నా. వివాహానికిముందు మీ ఇద్దర్నీ సమానంగానే అభిమానించేదాన్ని నేను. జ్ఞాన మున్నదాన్ని కనుక మీలో ఏ ఒక్కరిపైనా అమితమైన మమతల్ని పెంచుకోలేదు. నా అదృష్టంవల్ల మీతో నా అభిమానబంధం గట్టిపడింది .....నిజంగానే నా కా ఉత్తరం సంగతి ఈ క్షణమ్మాత్రం కూడా తెలీదండీ!" అంది మధుర తగ్గిపోతున్న స్వరంతో

చంద్రం సిద్ధంగా ఉన్నాడు. "నామీద ఒట్టు వేసి చెప్పగలవా?"

కంటికొనల్లోంచి చంద్రం చూస్తుంటే కత్తుల బోనులో ఇరుక్కున్నట్టు బాధపడింది.

"మీ సాక్షిగా, నా ఆత్మసాక్షిగా నే నీ ఉత్తరం రాయనేలేదు."

"అవునుమరి. నేను చస్తేమాత్రం నీ కొచ్చే నష్టమేముందిలే?"

మధుర కళ్ళల్లో నీళ్ళు సుళ్ళు తిరిగాయి. అయినా ప్రయత్నంమీద ఆపు చేసుకుంది. ఇంకా ఆశాదీపం రెపరెపలాడుతూంది ఆ గాలి హోరులోనే.

"మీరిలా అంటారని నాకు తెలుసు. అందుకే మీమీదే కాకుండా నామీద కూడా ఒట్టువేసుకున్నాను. మీకన్నా నాకు మరో ఆశ ఉంటే అబద్ధం చెప్పి నశించి పోవడానికి భయపడనా చెప్పండి?"

ఆమె ఉద్రేకాన్ని గమనిస్తూనే అన్నాడు చంద్రం, వ్యంగ్యంగా నవ్వి. "నువ్వు ఒట్టు బాగా నమ్ముతావన్నమాట?"

మధుర తెల్లబోయింది.

"ఊ సరే నీ రైటింగు పరీక్ష చెయ్యాలి! ఇదిగో పెన్ను. కాయితం తీసుకురా!"

యాంత్రికంగా కాయితం తెచ్చింది. వ్రాయమని హెచ్చరించాడు చంద్రం. విధిలేక వ్రాసింది.

"మధుర మీనాక్షీ చంద్రశేఖర్"

"నా పేరు వ్రాసేం లాభం? ఆ రవిగాడి పేరు రాయ్!"

"నేను రాయను"

"ఏం? ఎందుకని?"

"నా కిష్టంలేదు."

"అతనిష్టమైనా అతని పేరు ఇష్టం లేదన్నమాట!'

"సరే చూసుకోండి!" గద్గదికంగా అనికాగితం ముక్కమీద రవి పేరు వ్రాసి చూపించింది. ఆ వ్రాతకీ ఈ వ్రాతకీ చాలా భేదం కనిపించింది.

"ఏమో నేను నమ్మలేను! చేతి వ్రాతలు మార్చి రాసే వాళ్లెందరులేరు? దీనికి నీ సమాధానం?"

మధుర రెండు చేతుల్తో ముఖం కప్పుకుని ఏడవ సాగింది. అంతవరకు ఆగిన దుఃఖం అవిరళాశ్రు ధారల రూపంలో బయల్వెడలుతోంది.

"నీ ఏడ్పులూ, నా మొరలూ ఇవేవీ నాకు మనశ్శాంతి నివ్వలేవు. పెట్టె సర్దుకో నిన్ను మీ వాళ్ళింట్లో దిగవిడిచి నా దారిన పోతాను— ఆలస్యం చెయ్యక తయారుకా!"

మధుర వినిపించుకునే స్థితిలో లేదు నా ఒక్కింతయులేదు అని హృదయం ఘోషిస్తున్నట్లుంది.

ఇంతలో ఇంట్లో ఏదో పెద్ద అలజడే లేచింది. ఆ గొడవ హాలుపైరకూ రావడంతో అక్కడ అందరూ గుమిగూడారు. చంద్రమూ, అతని వెనుక మధురా కూడా తమకు కేటాయించిన గదిలోంచి బయటపడి నిర్జీవ ప్రతిమలా నిలుచున్నారు

ఇంతకీ అది బయటి వాళ్ళకి చిన్న విషయంగాను, ఇంట్లో వాళ్లకు పెద్ద విషయంగాను ఉంది. ఇంట్లో పనిమనిషి ఎందుకో యజమానురాల్నే ధిక్కరించి పెద్ద గొంతుకతో దెబ్బలాడుతున్నది.

చంద్రాన్ని చూచి అతని పెద్ద తండ్రి పెళ్లాం కాంతమ్మ ముందుకొచ్చి ఏదో చెప్పబోయింది.

అప్పుడే గుమ్మంలో అడుగు పెట్టిన రవి

అవ్యక్తరాగం

"సొమ్మిడమ్మా అదా రాద్ధాంతం?" అన్నాడు ఆ సంఘర్షణ సంఘంలో తానొక మెంబరవుతూ.

చంద్రంతో చెప్పబోతున్న కాంతమ్మ ఇటు తిరిగింది రవి వైపుకి. "చూడురా నాన్నా! దీని కెంత పొగరో చూడు! తలంటుకుంటూ గూట్లో పెట్టిన ఉంగరం, అచ్చమైన స్వచ్ఛమైన బంగారు ఉంగరంరా! పొద్దున్న తీసుకోడం మరిచి పోయి ఇప్పుడు ఒక్క అదటునవెళ్ళి చూద్దును కదా అక్కడ మరి కనిపించలేదు. ఉంగరం చూశావా అని దీన్ని ఇట్లా ఒక మాట అడిగేనో లేదో అప్పుడే దీని కింత పౌరుషం ముంచుకొచ్చింది. విలువైన వస్తువు పోయిందన్న ఇంగితం ఏమన్నా ఉండదంటావా దీనికి? మళ్ళా పది సంవత్సరాలుగా జీతమూ, బత్తెమూ మస్తుగా పుచ్చుకుంటూనే ఉన్నది. ఇంట్లో మనిషిలా చూసుకుంటోన్న దీని కేమన్నా ఆలోచన ఉందా అంటాను. ఒక వంక ఉంగరం పోయిందనే గుండెలు బాదుకోనా? దీని అభిజాత్యానికే మండిపడనా? ఇంతకీ ఈ ముండని నేనేమీ అనలేదు. ఉంగరంగాని చూశావా అన్నాను అంతే!"

కాంతమ్మ ఆగీ ఆగటంతోనే అంతవరకు రొప్పుతున్న మంగి గల గల్లాడుతూ ఆమెను ఎదుర్కొంది.

"అబద్ధమాడకమ్మా! ఇందాకిందాక ఏమంటివి? ఉంగరం తీశావా అని మొగ మెదటే అనెయ్యాలా? పదేళ్ళుగా మీ ఇంటబడి అడ్డమైన చాకిరీచేసి చులకనై పోయినాము. లేకుంటే ఒక్క మాట అనిపించుకుంటినా ఇన్నాళ్ళూ......" అంది మంగి.

ఆపైన కాంతమ్మ తారాజువ్వలా లేచింది. రాను రాను తగువు చినికి చినికి గాలి వాన అయి వట్టయింది అంతరంగంలో తుఫాను, అవతల గాలివాన అన్నట్టు చంద్రమూ, మధుర బెంబేలెత్తిపోయారు. చివరికి రవి మంగిని గట్టిగా తిట్టి పొమ్మన్నాడు.

"ఎల్తానెల్తాను. ఈపాడింట్లో ఎవడుంటాడు! ఈమంగను దొంగన్న ఎదవ నోరు పడిపోను!" అంది మంగి మెటికలు విరిచి వెళ్ళిపోతూ.

"నోరు మూసుకుని పోవే దొంగముండా! నువ్వు కాకపోతే సీతాతలాంటి దాన్ని తెచ్చుకుంటాం!" అంది కాంతమ్మ నిప్పులు కక్కుతూ.

మంగి మళ్ళీ కోపంతో వెనక్కొచ్చింది. ఈసారి దానికి బాగా ధైర్యం వచ్చింది.

"ఏటమ్మా! నీ అరుపులకి దడిసిపోతాననుకున్నావా? పదిసంవత్సరాలుగా మీయింట్లో నేసేసినంత సాకిరి, దానమ్మకడుపుకాల ఎవత్తి సెయ్యగల్దో నేసూడనూ, మీనాటి దగుల్బాజీ మనుసులకాడ ఎవత్తి మసులుకో గల్దో నే సూడనూ?"

"ఏయ్! నోరుమూసుకుని ఇక్కణ్ణించి కదుల్తావా? పోలీసుల్ని తెప్పించమంటావా?" గర్జించాడు రవి.

మంగి చలించకుండా కాంతమ్మవైపే గుడ్లెర్ర చేసి చూస్తున్నది.

"మెక్కినన్నాళ్ళా పీకల్దాకా మెక్కి ఉన్నింటికే ఎంతలేసి మాటలంటున్నావే పాడూ!—ఫో ఫో—నువ్వెంత తొరగా పోతే అంత తొరగా శని విరగడౌద్ది" అంది కాంతమ్మ.

వెటకారంగా చేతులు తిప్పుతూ "అవునమ్మా. అవునవును. మంచి మాట సెప్పావు నాతల్లే! మీకని కాదు నాకనే ఇవ్వాల ఇరగడవుతున్నాది. మీయింట్లో పనిసెయ్యడమే నా పాపం. మీబుద్దు లెట్లాంటివో నాకు మాబాగా తెలిసినా, పదేళ్ళుగా విశ్వాసం కొద్దీ పడున్నాను. మీ ఎవహారాలుతెలిస్తే ఎవడుంటాడు ఈ కొంపలో? మీబాబు లంచాలు మింగడం ఎరగనా? మీరు బ్రేరలు కొట్టి లాగే డబ్బుసంగతి ఎరగనా? మీ [illegible] గగా సేను ఎవహారం ఎరగనా? మేస్త్రీ బాం [illegible] లు లచ్చలు లంచాలు ఎరపెట్టి మీ అబ్బాయి [illegible] పేసు సేయించడం నాకు తెలవదా? ఇదిగో ఈ సెంద్రంబాబుగారికి మధురమ్మగార్ని దక్కనివ్వకుండా సెయ్యాలని, ఆస్తికోసం మధురమ్మని రవి బాబు సేసుకోవాలని మీరు పన్నిన పన్నాగాలు, మీ రాడిన అబద్దాలు, మీ రాసిన దొంగుత్తరాలు నాకు తెలవ్వనుకున్నారా? ధూ! ఇలాంటి ఇంట్లో నే నొక్క నిమిసం కూడా ఉండనింక. నా జీతం డబ్బులు మీకాడే ఉంచుకోండి!" గుక్క తిప్పుకోకుండానే పూడిన కొప్పు ముడేసుకుంటూ చర చరా వెళ్ళిపోయింది మంగి.

కాంతమ్మతో సహా అక్కడున్న వాళ్ళంతా స్థాణువులైపోయారు. మధుర, చంద్రం ఇద్దరూ కూడా తమకు వినిపించిన వాక్యాలు వాస్తవంగా వినబడ్డాయా అనే భ్రాంతిలో కొన్ని క్షణాలు ఉండిపోయి ఒకేసరి ఉనికిని గుర్తు తెచ్చుకున్నారు.

మధుర చంద్రంవైపు చూసింది ఇంకా అయోమయంగా. చంద్రానికంతా అర్థమైపోయింది. ఇందాక తను చూసిన ఉత్తరం ఎవ్వడో కల్పించి వ్రాయబడినది. మధుర కళ్ళల్లోకి అదే క్షణాన చూస్తూ సిగ్గుతో పశ్చాత్తాపంతో కరిగిపోయి.

"మధూ!" అన్నాడు గద్గదికంగా — ఆమె దగ్గరకు నడుస్తూ. సరిగ్గా అప్పుడే ఉప్పెనలా ఉద్రేకం అతన్ని ఆవహించింది. చటుక్కున మధుర చెయ్యి పట్టుకుని, "పద మధూ! ఇక్కడ మనం ఒక్క క్షణం ఉండొద్దు! వీళ్ళు మనుషులుకారు రాక్షసులు! పెద్ద తల్లి తండ్రుల రూపంలోఉన్న కిరాతకులు!" అన్నాడు క్రోధంతో, ఆవేశంతో.

* * *


ఇక్కడ ఒక సంగతి చెప్పాలి. రవి తండ్రి వెంకట్రావూ, చంద్రం తండ్రి శ్రీనివాసరావు ఏకోదరులైనా అభిప్రాయ భేదాలవల్లనూ, విరుద్ధ స్వభావాలవల్లనూ ఆస్తులు పంచుకుని ఏనాడో విడిపోయారు. వాళ్ళిద్దరికీ కూడా చెల్లెలు సుశీ లమ్మమీద అమిత మమకారం ఉంది. మధురని కోడలుగా చేసుకోవాలని ఇద్దరూ ఉబలాటపడ్డారు. రవికన్న చంద్రం పెద్దవాడని మధురను అతనికి కివ్వడానికే నిశ్చయించుకుని, ఆ ఉద్దేశాన్ని మరి మార్చుకోలేదు సుశీలమ్మ. మధుర ఆస్తిమీద కూడా ఒక కన్నువేసి ఉంచిన వెంకట్రావు ఎన్ని ఎత్తులు వేసినా ఫలించకపోవటంవల్ల నిరాశ చెందాడు. కడుపులో ఉక్రోషమున్నా బంధువర్గంలో మంచివాడనిపించుకోవాలని చంద్రాన్ని, మధురను వివాహానంతరం తమ ఇంటికి ఆహ్వానించాడు. పర్యవసానంగా చంద్రం సందేహంలో కొట్టుమిట్టాడవలసి వచ్చింది కొన్ని గంటలు. అదృష్టవశాత్తు అనుమాన మేఘాలు చెదిరిపోయి జీవితాకాశం వినిర్మలంగా భాసించింది.

సామానుతో రిక్షా ఎక్కి వెళ్ళిపోతున్న నవ దంపతుల్ని చూస్తూ దిక్కూచిలా నిలబడిపోయింది కాంతమ్మ.

ఆకాశంలో అవ్యక్తరాగం అలుముకుంది. జీవితంలో వినిపించే సంధ్యా గీతాలన్నీ మధుర గీతాలే అనిపించాయి మధురకి. ★



విచిత్రకథలు—5



ప్రమాదాల్ని సృజించే వింత బొమ్మలు

ఆర్. టి. కూపర్

ప్రాచ్య నాగరికతకు చిహ్నమైన బొమ్మొకటి దాదాపు అర్ధశతాబ్దం క్రింద విలియమ్స్ కుటుంబానికి సంక్రమించింది. ఆ బొమ్మలోని విచిత్రమేమిటి? అది కూడా దుష్టశక్తుల్ని తనలో దాచుకుందా? అనే ప్రశ్నలు మన మస్తిష్కంలో ఉత్పన్నం కావటం సహజం! దాన్నికొన్న వెంటనే కలిగిన విషాద సన్నివేశాల్ని బట్టి చూస్తే మాత్రం అది ఆ జాతికి సంబంధించిందేనని రూఢిగా రుజువవుతుంది.

ఆ వంశానికి సంబంధించిన అయిదుగురి జీవితాలు యిరవై సంవత్సరాల వ్యవధిలో అంతమైనయి. ఒక్కొక్కప్పుడు చావు తన ప్రతిభను తీవ్రంగానూ, వేగంగానూ చూపిస్తుంటుంది. అయితే విలియమ్స్ కుటుంబానికి సంబంధించినంత వరకూ అది చాలా నెమ్మదిగానూ, ఎక్కువ తీవ్రంగానూ సంభవించటం మన వూహాకందని ఉదంతం!

సర్ విలియమ్స్ అత్తగారొకామె యీ అభిప్రాయాన్ని ధృవపరిచింది. "ఆబొమ్మ ఒక దుష్టశక్తి" ఆమె తన ఆవేదనని వెలిబుచ్చింది. "దాన్నెలాగైనా వదిలించుకోండి."

ఆ హెచ్చరికను పాటించకుండా పెడచెవికి పెట్టారు. తర్వాత కొన్ని సంవత్సరాలకు తన కుటుంబానికి సంభవించిన దురదృష్టంతోగానీ సర్ విలియమ్స్‌కి ఆ హెచ్చరిక జ్ఞాపకానికి రాక తప్పలేదు. దీనికంతటికీ కారణం ఆ బొమ్మే అయివుంటుందా? దేవుడంటే భయభక్తులువున్న సర్ విలియమ్స్‌కి యీమానవాతీత శక్తిని గూర్చి ఆలోచించటం కన్నా దాన్ని వదిలించుకోడం ఉత్తమంగా కనిపించింది.

బ్రాన్‌టన్, డివోన్, పారిస్ కవున్సిల్‌లకి దాన్ని అమ్మకానికి పెట్టాడు విలియమ్స్. అందంగా, ఆకర్షణీయంగా ఉన్న ఆ బొమ్మను కొనటానికి వాళ్ళు కూడా ఆసక్తి చూపారు, కానీ అది వాళ్ళ చేతికి మాత్రం రాలేదు. పైగా అదృశ్యం అయింది! సర్ విలియమ్స్ ఆ బొమ్మ కోసం శాయశక్తులా గాలించాడు గానీ ఫలితం శూన్యమైంది.

కొన్నాళ్ళకి ఆ బొమ్మమళ్ళీ ప్రత్యక్షమైంది. ఆ వంశంలోని వేరొకరు ఒకానొక ప్రదేశంలో దాన్ని చూడటం జరిగింది. బహుశ దాన్ని దొంగిలించినవానికి కూడా అది తన ప్రభావాన్ని రుచి చూపి ఉండవచ్చు. అందుకనే అతడు దాన్నిక్కడ పారేసివుంటాడు.

ఆ బొమ్మ కనిపించినరోజే లేడీవిలియమ్స్ సవతి తండ్రి స్వర్గానికి ప్రయాణంకట్టాడు. ఆ మర్నాడే సర్ విలియమ్స్ బంధువొకామె మెట్లపైనుంచి పడి తీవ్రంగా గాయపడ్డది. మిగతా దురదృష్టాలకంటే ముఖ్యంగా చెప్పుకోదగ్గవిరెండూ, దుశ్శకునాలకు నిదర్శనాల్లాంటివి. పునర్దర్శన మిచ్చినబొమ్మ మళ్ళీ తన విపరీతచేష్టల్ని చూపడం మొదలెట్టింది. ఈ సంఘటనలతో పారిస్ కవున్సిల్ మేల్కొని ఆ బొమ్మను కొనాలన్న ఉద్దేశాన్ని మార్చుకుని, "అది మా కనవసరం" అని చెప్పారు సర్ విలియమ్స్‌తో.

నిస్సందేహంగా ఆబొమ్మ దుష్టశక్తికి ప్రతిబింబమేనని నమ్మిన సర్ విలియమ్స్ ఇండియాలో ఉన్న, యిటువంటి వాటిని గురించి ఎక్కువగా చదివిన ఒక స్నేహితునితో యీ విషయాన్ని గూర్చి చర్చించాడు. ఆ సందర్భంలోనే ఈ కథంతా పత్రికల ద్వారా పలువురికి తెలిసింది. దాని ఫలితం ఆశాజనకమూ ఆశక్తి కారకమూ అనొచ్చు. ఇండియాలోని బౌద్ధ సన్యాసుల నుంచి వూరటను కలిగించే ఉత్తరాలొచ్చాయి సర్ విలియమ్స్‌కి. "ఆ బొమ్మని ఎప్పుడూ నేలమీద, నీటికి దగ్గరగా ఉంచవద్దు. ఓ ఎత్తయిన ప్రదేశంలో దాని ముఖం తూర్పు దిక్కుగా ఉండేట్లుగా ఉంచ" మని వాళ్ళు సలహా యిచ్చారు.

బౌద్ధసన్యాసుల సలహా పాటించదలిచాడు సర్ విలియమ్స్. దాన్నొక పుస్తకాల బీరువాపైన ఎత్తుగా, తూర్పుముఖంగా ఉండేట్లు అమర్చాడు.

అలా చేసినందువల్ల అతనికి ఆశించిన ఫలితం కంటే ఎక్కువ ప్రతిఫలమే వచ్చింది. వారి కుటుంబానికి చెందినటువంటి విలువైన భూభాగ మొకటి అతనికి సంక్రమించినట్లు తెలిసింది. తర్వాత విలియమ్స్ కుటుంబ పరిస్థితి ప్రశాంతంగానే ఉంది.

ఇదిగాక ఇంకా యిలాంటి బొమ్మలు, నగిషీలు చెక్కిన ఆభరణాల్లాంటి వాటికి సంబంధించిన కథలెన్నో ఉన్నాయి.

ఒకప్పుడు సఫోక్‌కి సంబంధించిన ఒకతను ముచ్చటైన బొమ్మ నొకదానిని కైరో బజార్లో చూశాడు. బహుశః అదొక పురాతన ఈజిప్టు దేవుని దై ఉండొచ్చు. కానీ అదేనని నిరూపించే సాక్ష్యాలు దానిమీదేమీ కనబడలేదు. "దీని విషయం సరదాగా ఆలోచించవచ్చు" అనుకొని అతడు దాన్ని కొన్నాడు. కొనేముందు అమ్మిన వ్యక్తి చెప్పిన మాటలు కూడా గమనించదగ్గవే. "ఈ బొమ్మ యిప్పటివరకూ మతంపై నమ్మకం లేనివారి అధీనంలోకి వెళ్ళలేదు." అన్నాడు.

కొన్న వ్యక్తి ఆ హెచ్చరికను కొద్ది కాలానికే జ్ఞప్తికి తెచ్చుకోవాల్సి వచ్చింది. అతడు దాన్ని కొన్న వెంటనే యింటికి తెచ్చుకున్నాడు. దాదాపు వెంటనే దుస్సంఘటనలు జరగటం మొదలయినయి. అతని పెంపుడు కుక్క పిచ్చెక్కి ఎటో పారిపోయింది—దాన్నెవరో చంపేశారు. అతని కుమార్తె గుర్రంమీద నుంచి పడి గాయపడింది. "మొదటి రెండు సంఘటనలకంటే విచిత్రమైంది" అతను నిస్పృహతో చెప్పాడు, "నేను పుస్తకం కోసం నిచ్చెన ఎక్కుతున్నాను. అనుకోకుండా, అకారణంగా అది మడత బడిపోయి అక్కడ్నించి క్రింద పడ్డాను—కాలు విరిగింది."

ఇవన్నీ కాకతాళీయంగా జరిగిన సంఘటనలనుకోకూడదా ? బహుశ కావచ్చు. కానీ అతడు నిచ్చెనపై నుంచి కింద పడంగానే ఆ బొమ్మలోని కీలకాన్ని గుర్తించాడు. దాని కళ్ళు అతనివైపే తీక్షణంగా చూస్తూండటం గమనించాడు.

అంతకన్నా తీవ్రమైన ప్రమాదాలేమీ అతనికి ఆ తర్వాత జరగలేదు. దాన్ని అమ్మెయ్యాలని నిశ్చయించుకున్నాడు. పురాతన వస్తువుల వ్యాపారొకడు దాన్ని కొన్నాడు. కొని దాన్నింటికి తీసుకువెళ్తుండగా దార్లో అతని కారు టెలిఫోన్ స్తంభానికి గుద్దుకొని ప్రమాదానికి లోనైంది.

ఆ బొమ్మ కథ అంతటితో అంతమవలేదు. కొన్ని రోజుల తర్వాత ఆ వ్యాపారి మరొకనికా బొమ్మని అమ్మేశాడు. కొద్ది రోజులకే ఆ కొన్న వ్యక్తి దగ్గర్నుంచి టెలిఫోన్ వచ్చింది. "నా క్షేమం కోసం ఆ బొమ్మని తిరిగి తీసుకోండి. అది మాకు పిచ్చెక్కించేట్టుంది." అని అతను ఆత్రంగా, హృదయవిదారకంగా మొరబెట్టుకున్నాడు.

జరిగిందేమిటంటే—అతను దాన్నొక బీరువాపై పెట్టాడు. మర్నాడు చూసేసరికి అది నేలమీద దిగి కూర్చొని ఉంది. పొరపాటున క్రింద పడిందేమోనని మళ్ళీ దాన్ని యథాప్రకారం అమర్చాడు. ఆ రాత్రికి మళ్ళీ అదేవిధంగా జరిగింది. ఈసారి మాత్రం అతని కందులో విచిత్రం ఏదో ఉందనిపించింది. అలా వూహించి అతను తన డెస్కులో దాన్ని భద్రంగా పెట్టాడు. మర్నాడు అతనికి కనపడ్డది చిత్రాతి విచిత్రం! అది లోపల్లేదు! బైటికొచ్చి డెస్కుమీద ఎక్కి కూర్చుని ఉంది!

ఇలా జరిగే వాటికి తర్కం ప్రయోజన శూన్యం! ఇల్‌ఫర్డ్‌లోని ఓ గుమాస్తా వింత అనుభవాల్ని చూస్తే ఎవ్వరూ కారణం వూహించలేరు. ఆ గుమాస్తాకి వేలంలో వస్తువులను కొనే సరదా ఉండేది. ఒకసారి వేలంలో ఒక బొమ్మను కొన్నాడు. అందులో కొన్ని వేటకుక్కలు నక్కనొకదాన్ని వేటాడుతున్నట్లు మలచబడి ఉంది దాన్నతడు తన గదిలో అమర్చాడు. ఆ రాత్రే తనను వేటకుక్కలు తరుముతున్నట్లు భయంకరమైన కలొకటి వచ్చిందతనికి. భయంతో వణికిపోతూ నిద్ర లేచాడు— కానీ కల!

తెల్లవారి వెలుగును చూచిన తర్వాతగానీ అతనికి భయం పోలేదు. అప్పుడు రాత్రి తను అకారణంగా భయపడినదానికి నవ్వుకున్నాడు. అయితే మళ్ళీ రెండోరాత్రి అదే కల రావటం జరిగింది.

మూడో రాత్రి కూడా ఆ కల అతన్ని వదల్లేదు. కానీ, మొదటి రెండు రాత్రులకంటే యిది చాలా విపరీతంగా ఉంది. ఆ వేటకుక్కలు అతన్ని వెంటాడటమే గాకుండా అందులో భయంకరంగా ఉన్న దొకటి అతన్ని తరుముకుంటూ అన్నింటికంటే ముందు వచ్చి మీద పడింది. అది అతని మెడను పటే కొరకసాగింది దాని పదునైన కోరలు కర్కశంగా, బాధాకరంగా మెడలోపలికి దిగబడుతున్నట్లు అతనికనిపించింది. వెంటనే అతడు స్పృహని కోల్పోయాడు

మర్నాడు అతను నిద్ర లేచేసరికి ఎండాకాలపు సూర్యుని వేడికిరణాలు వాడిగా కిటికీలోనించి దూసుకొచ్చి మీద పడుతున్నాయి నీరసంగానే అతను పక్కమీద నుంచి లేచాడు. అద్దంలో తన ప్రతిబింబాన్నొకసారి చూచుకున్నాడు

అతని మెడమీద అసహ్యకరంగా, చిక్కిరి బిక్కిరిగా గాయాలున్నాయి— పంటిగాట్లు !!!

అలా కల రావటం గురించి అంత పట్టించుకోవాల్సిన అవసరం లేదేమో అనిపించొచ్చు! ఎందుకంటే అతనా బొమ్మను కొన్న విషయం అతని మనస్సులో ఏ మూల ఎక్కడో లీలగా జ్ఞాపకం ఉండి ఉండవచ్చు. నిద్రలో ఉన్నప్పుడది పైకి వచ్చి కలగా గోచరించవచ్చు. బహుశః ఆ కలలోని దృశ్యాని కతడు భయ భ్రాంతుడై భయావేశంలో తన చేతుల్తోనే మెడను గాయపరచుకొని ఉండొచ్చన్న దాకా ఈ సమర్థనలని పొడిగించవచ్చు. అయితే ఆ గుర్తులు మాత్రం కోరలు దిగబడినవేగానీ గోళ్ల గుర్తులు కావు. దానికి తోడుగా అతని మెడమీద రక్తపు మరకలు! కానీ చేతివేళ్ళు మాత్రం ఏ మాలిన్యమూ లేకుండా శుభ్రంగా ఉన్నయ్!

(ఆఖరి కథ వచ్చేవారం)

ఎవరి ఆదాయం ఎక్కువ?

"ది నేషనల్ కౌన్సిల్ ఫర్ ఎప్లయిడ్ ఎకనామిక్ రిసర్చ్" అనే సంస్థ ఇటీవల కొంత ఆర్థిక సమాచారం ప్రచురించింది. దీని ప్రకారం ఢిల్లీలో వ్యక్తిగత సాంవత్సరిక ఆదాయం భారతదేశంలో కెల్లా ఎక్కువ. తర్వాత మహారాష్ట్ర, పశ్చిమబెంగాల్, పంజాబులు వస్తాయి.

పంజాబు తర్వాత గుజరాత్, ఆ తర్వాత మద్రాసు అధిక వ్యక్తిగత ఆదాయాలు కల రాష్ట్రాలు.

ఆంధ్రప్రదేశ్ 14 వదిగా మాత్రమే వస్తుంది.

ఈ సమాచారం 1960-61 కి సంబంధించినది; వెలువడటానికి నాలుగు సంవత్సరాలు పట్టిందన్నమాట.

భారతదేశం సగటు వ్యక్తిగత ఆదాయం	రు. 333 40
ఆంధ్రప్రదేశ్ వ్యక్తిగత ఆదాయం	రు. 287.00
మద్రాసు వ్యక్తిగత ఆదాయం	రు. 334.10

క్రింది పట్టీ తక్కిన రాష్ట్రాల ఆదాయాలు తెలుపుతుంది

ఢిల్లీ ………	రు.	871.60
మహారాష్ట్ర…	రు.	468.50
ప. బెంగాల్ …	రు.	464.60
పంజాబు……	రు.	451.30
గుజరాత్ ……	రు	393.40
మద్రాసు….	రు.	334.10
అస్సాం……	రు.	333.30
త్రిపుర…….	రు.	329.90
హిమాచల ప్రదేశ్ …	రు.	328.40
కేరళ ……	రు.	314.90
మైసూరు…	రు.	304.70
ఉత్తర ప్రదేశ్ …	రు.	297.40
జమ్ము, కాశ్మీర్ …	రు.	289.00
* ఆంధ్రప్రదేశ్ …	రు.	287.00
మధ్యప్రదేశ్ …	రు.	285.40
ఒరిస్సా…	రు.	276.20
రాజస్థాన్…	రు.	267.40
బీహార్ …	రు	220.70
ఇతర రాష్ట్రాలు…	రు.	371.20

పై లెక్కలను బట్టి ఆంధ్రరాష్ట్రం ఎంత వెనుకబడి ఉందో ఊహించవచ్చు.

సంపెంగలూ సన్నజాజులూ

అవసరాల రామకృష్ణారావు



జరిగిన కథ

మంజుల వివాహకారణంగా, ఆర్థిక అవసరాల దృష్ట్యా కొడుకుని కట్నం తీసుకొని పెళ్ళి చేసుకోమంటాడు తండ్రి; మొదట నిరాకరించినా చెల్లెలి పైగల ప్రేమతో తర్వాత సరే నంటాడు. తర్వాత మంజుల వివాహ మవుతుంది. ఆరేళ్ళు గడిచాయి. మంజు యిాలోగా బియ్యే పట్టాతోబాటు నాలుగేళ్ళ మధురిమను కూడా పొందింది. భర్తతో కాశీవెళ్ళి ఎం. ఏ. పరీక్షలు బాగా రాశానన్న తృప్తితో తిరిగివస్తూ అన్నయ్య సంసారం ఆందోళనకరంగా ఉండటం గమనిస్తుంది. భర్త పరీక్ష పాస్ కాలేకపోయినందుకు బాధపడుతుంది మంజు. వాళ్ళ సంసారంలో అపార్థాలు చెలరేగి వ్యక్తి వర్ధుకుంటాయి. ఎం ఏ. ఫైనల్‌కి వెళ్ళాలని ఉబలాటపడుతున్న మంజుకు ఆశాభంగం కలిగేలా ప్రవర్తిస్తాడామె భర్త. చివరికెలాగైతేనేం ఎమ్మే పాసైనా ఉద్యోగం చెయ్యననే షరతుపై భర్తని ఒప్పిస్తుంది. కలతలతో కుంటుపడ్డ నారాయణ నిర్మలల సంసారాన్ని ఒకదారికి తెస్తుంది మంజు. మంజు, మధుర కలసి పరీక్షలకు కాశీ వెళతారు. అక్కడ మురళీ కృష్ణమూర్తి అనే అతను తటస్థపడి తన కథని చెప్పటం ప్రారంభిస్తాడు.

10

“ఏం చెప్పమన్నారు, కళాసేవ” ధన దాహానికి దాసోహమో ఈ రెండూ తేల్చుకోలేని వాళ్ళందరూ ఎక్కడ చేరాలో అక్కడే చేరింది. మొదట్లో అక్కణ్ణుంచి వచ్చిన వార్తలు నాన్నగారే కాదు, నేనే నమ్మలేదు. నెలా పదిహేను రోజులు చూసి నాన్నగారే బయలుదేరి వెళ్ళేరు. తిరిగి వచ్చినప్పుడు సర్వస్వం కోల్పోయిన వ్యక్తిలా తయారయారు. ఏం జరిగిందంటే మాటాడరు. ఎలాగో కష్టపడి ఆయన దగ్గిర నేను సేకరించిన సమాచారం ఏమిటంటే ప్రభ అప్పుడు ఒక అసిస్టెంటు డైరెక్టరుతో ఉంటున్నదట. విడుదల అవబోయే ఒక సినిమాలో ఆమెకు మంచి పాత్ర లభించే అవకాశ మున్నదట.

‘నాన్నా, జరిగిందంతా మరచిపొండి. వీలయితే నన్నే మరచిపొండి. తీరా యిక్కడికి వచ్చాక వెను దిరగటం దేనికీ, నా అదృష్టం ఎలా ఉంటుందో నన్ను పరీక్షించుకోనివ్వండి. నా అవకాశాలకు అడ్డు రాకండి’ అన్నదట.

‘మా అమ్మ నన్ను కాదన్నది’ అని దానికోసం చంటి పిల్లవాడు తల్లికోసం ఏడ్చినట్టు ఏడ్చాడు. చెల్లిని పల్లెత్తుముక్క అనలేదు. ‘భగవంతుడా! మా అమ్మ చెయ్యరాని అపరాధమేమీ చేసేదికాదు. ఎక్కడున్నా దాన్ని రక్షించు’ అని ప్రార్థించారు.

ఆ సమయంలో నేనేం చేయాలో నాకేం తోచలేదు. మరొక పదిహేను రోజుల్లో మద్రాసు వెళ్ళేను. దాన్ని కలుసుకోడమే కష్టమయింది. కథానాయిక చెలికత్తెగా అది నటిస్తున్నప్పుడు చూడవలసి రావడం నా పూర్వజన్మ దుష్కృతం. పమిట ఎలా సర్దుకోవాలో చెబుతూ దాని భుజాలమీద మాటి మాటికీ దర్శకుడి వేళ్ళు నాట్యం చేస్తున్నప్పుడు నా ఒంటిమీద తేళ్ళూ, జెర్రులూ పాకినట్టయింది. ఈ ప్రపంచమంతా మిథ్యా, మాయా, కృత్రిమమూ అని తెలియజేయడానికి ఏ వేదాంత గ్రంథాలూ చదువ నక్కరలేదు. ఒక్క సినిమా షూటింగు చూస్తే చాలు. అక్కణ్ణుంచే అలా స్టేషనుకు వచ్చేశాను. ఇది జరిగి ఆరేళ్ళయింది. అంతే. అది మళ్ళీ ఇంటికి రాలేదు.’ కృష్ణమూర్తి కళ్ళ నీళ్ళు తుడుచుకుని పది నిముషాల దాకా అలా మౌనంగా కూర్చుండిపోయాడు. నేను వూరుకోలేకపోయాను.

‘మీ బాధ్యత మీరు సక్రమంగా నిర్వర్తించ లేదండీ కృష్ణమూర్తిగారూ, మీరూ అందరి మొగాళ్ళలాగే చేశారు.’

‘మీరు సరిగ్గా చెప్పేరు. పనికిమాలిన జాలీ, శుష్కమైన విచారమూ ఇవే నాకు మిగిలాయి. అంతే’ అన్నా డతడు, మరింత విచారంగా.

‘మళ్ళీ మీ రామెను కలుసుకోలేదా ?’

‘రెండేళ్ళ క్రిందట మా నాన్నగారికి చాలా జబ్బు చేసింది. ఒక్కణ్ణే దుఃఖం పంచుకోలేక పోయాను. చెల్లెల్ని చూసి వీలయితే తీసుకొద్దామనిపించింది. స్కూలు పనిమీద వెడుతున్నానని మా ఆవిడతో చెప్పి ....’

‘మీకు ?’

‘అవును. పెళ్ళయింది. మేనరికం. ముగ్గురు కూతుళ్ళు కూడా. సరే, ఇది వినండి. అప్పుడు మద్రాసు వెళ్ళేను. ఈసారి ఏమయినా దానితో మాట్లాడి ఏమాత్రం అవకాశమున్నా తీసుకొద్దామని బయలుదేరాను. మాంబళంలో రెండు రూంలు అద్దెకు తీసుకుని ఉంటున్నదట. రెండు రోజుల అతి ప్రయత్నంమీద గాని అదెక్కడ ఉన్నదో నాకు తెలియనే లేదు. అదీ, దాని అవతారమూ చూడగానే నా ఆత్మ ఆవురుమని ఏడ్చింది. ఇంతింత బుగ్గలూ అంతంత కన్నులూ—ఈ చెల్లెలే నాకు గుర్తుంది. ఆకాశానికి నిచ్చెనలు వేసి, అందుకోలేక వెల్లకిలా పడి లేచి దులుపుకుని పగిలిన హృదయాన్నీ, తగిలిన గాయాల్నీ బహిరంగపరిచే ధైర్యంలేక తల వంచుకు కూచున్న చెల్లెమ్మ మాత్రం కాదు. అసహ్యంకన్నా అభిమానమూ, ద్వేషంకన్న కారుణ్యమూ నాలో కట్టలు తెగి ప్రవహించాయి. అరచేతిలో స్వర్గం చూపించి అన్నివిధాలా నాశనం చేశారుట ఆమెను. అయిదేళ్ళ సినిమా అనుభవంలో ఆమె పాత్ర ఎక్స్‌ట్రానీ మించలేదుట. ఆరు నెలలై అటువైపు వెళ్ళటం పూర్తిగా మానుకుందట. ఇద్దరికి ట్యూషన్లు చెప్పి ఎలాగో బ్రతుకుతున్నదట. నేను ఎన్నివిధాల చెప్పినా ఇంటికి రానన్నది.

‘అన్నయ్యా! లోకంలో ఎందరు బ్రతకడం లేదు! వాళ్ళతోపాటు నేనూ ఒక్కర్తిని. నేనేమీ అయిపోను. మానాభిమానాలు అమ్ముకుని ప్రపంచంలో గొప్పవాళ్ళు అయినవాళ్ళు కొందరున్నారు. అన్నీ అమ్ముకుని ఎప్పటికీ, ఏవిధంగానూ గొప్పవాళ్ళు కాలేని నిర్భాగ్యులు కూడా కొందరున్నారు. ప్రపంచంలో నదులే పవిత్రమైనవి అయితే అంతకన్న విశాలహృదయం కల భూదేవి అన్ని రకాలవారికీ చోటు యిచ్చే కరుణామయి నాకింత చోటు యివ్వకపోదు. ఇంతకీ నాయీ పరిస్థితి నేను చేజేతులా చేసుకున్నది. నాలాంటి వాళ్ళను ఎవరూ సంస్కరించలేరు.’

కళ్ళలో ఒక్క కన్నీటిచుక్క లేకుండా ప్రభ చెప్పిన ఈ మాటలవలన పరిస్థితులు ఆమెకు ఎంతగా పాఠాలు చెప్పేయో అనిపించింది.

‘చెల్లీ జరిగిందేదో జరిగింది.—నాన్నగారి ఒంట్లో ఏం బాగులేదు. వచ్చెయ్యవే’ అన్నాను ఆఖరిసారిగా.

‘నీ కేదో అన్నీ తెలుసనుకున్నాను. ఏం తెలీదు, పో!’

ప్రభ అలా ఎందుకందో యింటి కొచ్చాకగాని తెలియలేదు. నేను మద్రాసు వెళ్ళేనని ఎలా తెలిసిందో యింట్లో తెలిసిపోయింది. రాగానే మా ఆవిడ నన్ను నిలదీసింది.

‘ఏదీ, మీ వెనక ఆ వగలాడి ఏదీ ?’

‘ఎవరూ ?’

‘ఇంకెవరు, మహా పతివ్రతా తిలకం—మీ ముద్దుల చెల్లెమ్మ! ఇంకా నయం వచ్చిందికాదు, గుమ్మంలో పెట్టి కడిగేద్దును.’

‘ఎందు కలా నోరు పారేసుకుంటావ్ ? నే నెక్కడికి వెళ్ళేననీ ?’

‘ఇంకా ఎందుకు నా కన్ను కప్పుతారు ? పంపించిన ఆ పెద్దాయనకి లేకపోతే పోయింది, మీ బుద్ధి ఏమయిందీ అంట! అయిదేళ్ళుగా అడ్డమైనవాళ్ళ దగ్గర పడి ఏడుస్తోందే, దాన్ని యిక్కడికి తీసుకు రాడానికి నాతో చెప్పకుండా బయల్దేరడానికి ఎంత ధైర్యం మీకు! ఇదేం సానికొంపనుకున్నారా, సంసారి కొంపనుకున్నారా ?’

‘ఇక చాలు ఊరుకో’

‘నన్ను కాదు వూరుని వూరుకోబెట్టండి మీకు చేతనయితే, రేపొద్దుట ఎదిగి కూచుంటారుసి మీ అమ్మాయిలకి చెప్పండి సమాధానం. తెలిం. తెలిసి యిలాంటి నీతిలేని కొంపలో పడేసి నా గొంతు

ఎలాగా కోశాడు మా నాన్న. ఇంతింత పిల్లలు, వీళ్ల మొహమేనా చూడండి'.

గాయపడిన నా హృదయం అర్థంలేని ఆమెమాటలకు ఏం సమాధానం చెప్పగలదు ? చెడిపోయిన చెల్లెలికి నా లాంటివాడు ఏం సహాయం చెయ్యగలడు, చాటుగా, మాటుగా దాని పేర ఏదో పాతిక మనియార్డరు చెయ్యడం తప్ప !

కృష్ణమూర్తి చెప్పడం పూర్తిచేశాడు. అతి పవిత్రమైన అతని హృదయాన్ని అర్థం చేసుకోక తక్కువగా వూహించుకున్నందుకు నేనే సిగ్గుపడ్డాను.

'అప్పట్నుంచి ఏమాత్రం కలసి మెలసి తిరిగిన వడుచువాళ్ళను చూసినా అపాయాన్ని శంకిస్తూ వూహించడం నాకు అలవాటై పోయిందండీ. అది మనోదౌర్బల్యమేమో అని చాలాసార్లు అనుకుంటాను గాని అణచుకోలేక పోతున్నాను. ఆ కారణం చేతే అనుకుంటాను, క్లాసులో నేను చెప్పే పాఠాలలో నీతి పాఠలే ఎక్కువ'.

'మీరు హైస్కూల్లో పనిచేస్తున్నారా ?'

'అవునండీ. తక్కినవాళ్లిద్దరూ కూడా అంతే. మేం ముగ్గురం ఒక్కచోటే పని చేస్తున్నాం. నా అభిప్రాయాలూ, ఆందోళనలూ వాళ్లకు నచ్చవు. నన్నేదోవిధంగా నెప్పించడమే వాళ్ల ఉద్దేశంలా కనపడుతుంది. వాళ్లతో ఎందుకు వచ్చానా అనిపిస్తోంది !'

'ఏం ? ఏమంటా రేం ?'

'ఆఁ, అదంతా అదోరకం. ఎన్నిసార్లు గంగలో మునిగితే అంత భక్తి అని వాళ్ల ఉద్దేశం. జలుబుగా ఉండి మొన్న మూడ్రోజుల క్రితం ఒకసారి వాళ్లతో స్నానానికి రాలేదని 'నాయనా, నాస్తికా!' అని నన్ను పిలుస్తున్నారు. మనుషులు చూస్తే కొబ్బరి బోండాల్లా ఉంటారుగాని ఒలిచి చూస్తే అంతా డొలక. ఆ గల్లీల్లో మధ్యని ఏ ఎనుబోతేనా అడ్డంగా నిలబడితే అంతటి మహావీరులూ నన్ను ముందుకి తోస్తారు. ఒక్కసారి పడవెక్కి అలా గంగలో షికారు తిరిగొద్దాం రండి అంటే పడవ వాడు మధ్యకి తీసుకెళ్లి ఏ రిస్టువాచీ అయినా అక్కడ పెట్టమంటేనో అంటారు. ఏం చెప్పను ఖర్మ ! ఇంక ఆ మధురగారిని ఎన్నెన్ని మాటలంటున్నారో నేను చెప్పలేను, మీరు వినలేరు !'

'అక్కర్లేదు. నేను వూహించగలను. మీ ఆవేదన అర్థంచేసుకునే అక్క ఒకర్తి ఉందనే విషయం మాత్రం ఎప్పుడూ మరచిపోవద్దు. మీరింత పవిత్రమైన ఆశయంతో నాకు హెచ్చరిక ఎరిగించిన విషయం కూడా నే నెప్పుడూ మరచిపోను.'

'అంతకన్న నాకు కావలసిం దేముంది ? ఆరోజు మా చెల్లి నాతో మాటాడుతున్నప్పుడు 'అమ్మ ఎలాగా లేదు. అక్క అయినా ఉంటే నే నిలా అయేదాన్ని కాదేమో' అనడం మరచిపోలేను. పొద్దుట కేశవరావుగారూ, మధురగారూ ఒకే రిక్షాలో నాకు ఎదుట పడినప్పుడు ఆవిడకేమీ తెలియదా, తెలిసే యిలా వూరుకుంటున్నారా అనిపించింది. నా మనసులో మాట మీకు చెప్పుకునే దాకా నాకు తోచలేదు. పుస్తకం తీసి చదువుదామని కూచుంటే మా ప్రభే గుర్తుకొచ్చేది. ఏమీ తోచక యిలా పరిగెత్తుకొచ్చాను.'

'నేను తప్పకుండా కనుక్కుని తగిన చర్య వెంటనే తీసుకుంటానులెండి. మీ సహాయానికి అన్నివిధాలా కృతజ్ఞురాలిని' అన్నాను.


'అలాగే, నా అవసరం ఏమున్నా కబురంపడానికి వెనుకాడకండి.'

అతను వెళ్లిపోతూఉంటే వాళ్ల ఫ్రెండ్సు తిరిగొచ్చారు. వాళ్ల మాటలు కొద్ది కొద్దిగా వినబడుతూనే ఉన్నాయి.

'చాలాసేపు వేసినట్టున్నావే మకాం ? ఏమిటీ ఆ అనుబంధం ?'







సంపెంగలూ సన్నజాజులూ

'మీకూ్కడా అక్కచెల్లెళ్లున్నారుగా, వాళ్లకూ మీకు ఎలాంటిదో అలాంటి సంబంధమే' కృష్ణమూర్తి గబగబ వెళ్ళిపోయాడు. నాకు చాలా అసహ్యం వేసింది. ఏ లోపమూ లేకుండానే ఎంత నీచంగా మాటాడుతున్నారు! వేలెట్టి చూపించడానికి అవకాశం యివ్వని మధురను దుయ్యబట్టడానికి ఎందుకు సందేహిస్తారు?

పగలల్లా ఎక్కడెక్కడ తిరిగి వచ్చినా మధుర రాత్రుళ్లు మాత్రం మాతోపాటు డాబామీద కూచుని చదివేది. ఎప్పటికప్పుడు మరింత ఉత్సాహంగానూ, సరదాగానూ కనపడుతున్న ఆ అమ్మాయిని పనిగట్టుకు నిందించడం కూడా నాకు కష్టంగానే కనిపించేది. ఇలాంటి ఆలోచనలు ఎక్కువగా పెట్టుకుని తర్జనభర్జనలు చెయ్యడానికి నాకు తగినంత కాల వ్యవధి లేకపోయింది. పరీక్షలు అయిపోయేదాకా ఆమెను ఒక కంట కనిపెట్టి ఉండడం తప్ప మరేమీ చెయ్యలేకపోయాను

ఆఖరు పేపరు అయిపోగానే నాలో కలిగిన ఆనందం పరకాయ ప్రవేశం చాతనయిన వాళ్లకి గాని తెలీదు. అందులో నేను వూహించిన 'పొయెటిక్ డిక్షన్' ఆఖరి ఎస్సే పేపరులో పడడంచేత నాకు మరీ ఆనందంగా ఉంది. 'తండ్రీ విశ్వనాథా! నన్ను కృతార్థురాల్ని చెయ్యి. మళ్లీ వచ్చి నీ దర్శనం చేసుకుంటాను. ఈ జన్మకి ఇదే ఆఖరి పరీక్ష చెయ్యి' అనుకున్నాను కాని ఈ జన్మకి పరీక్ష అనేది ఆ నిముషంనుండే ప్రారంభించబడిందని నాకు తెలీదు!

నేను సామాన్లు సర్దుతూంటే మధుర అక్కడికి నాతో ఏదో చెప్పడానికి వచ్చినట్టు వచ్చి అటూ యిటూ తిరుగుతోంది.

"ఏం కావాలి మధురా, నీ సామాన్లు కట్టడం పూర్తయిందా?'

'ఇవాళ మేం అలహాబాదు వెడదామనుకుంటున్నామండీ మీరూ రాకూడదూ, సరదాగా అన్నీ చూడొచ్చు?'

'నేను కిందటేడు చూశాను. నువ్వు ముందేడు చూడొచ్చు. లే, బయల్దేరు.'

'లేదండీ, మాట యిచ్చేశాను, అతనే మను కుంటాడో.'

'నీ యిష్టమొచ్చినట్టు మాటలూ, మనసులూ యిచ్చేస్తే ఇవతలవాళ్లేమనుకుంటారో, లోకం ఏమనుకుంటుందో ఆలోచించావా? ఇప్పటికే మితి మీరిపోయావు. పరాయి పురుషుడితో ఒంటరిగా మరో వూరు వెళ్లడానికి కూడా ఏమాత్రమూ సందేహించడంలేదు నువ్వు ఇందుకేనా నువ్వు ఇక్కడికి వచ్చిందీ, ఇందుకేనా మీవాళ్లు నిన్ను యిక్కడికి పంపిందీ?'

'మీరు తొందరపడుతున్నారండీ'

'ఇప్పటికే ఆలశ్యం చేశాననుకుంటున్నాను ఇంక వూరుకోదల్చుకోలేదు. నువ్వు వూరు విడిచి వెళ్లడానికి ఎంతమాత్రం వీల్లేదు. ఆ మురళీకృష్ణమూర్తిగారిని పంపి సాయంకాలం రైలుకి రెండు టికెట్లు రిజర్వు చేయించి అప్పుడే తెప్పించాను. నా బాధ్యత నన్ను సక్రమంగా నిర్వర్తించనీ. వచ్చే ఏడు అలహాబాదే వెడతారో ఆలిండియా టూర్‌కే బయల్దేరుతారో నాకు తెలీదు. ఇప్పటిమటుకు నాతో ఎత్తుకున్నైనా సరే తీసుకుపోతాను. ఇంకా అలా చూస్తావేం, వెంటనే సామాన్లు సర్దుతావా, నన్ను సర్దమన్నావా?'

మధుర అంతసేపూ ఆగి ఒక్కసారి ఫకాలుమని నవ్వేసింది. ఏం మనిషి బాబూ యిది!

* * *

బాగా చీకటి పడేవేళకు రైలు పాట్నా చేరుకుంది. మేము తెచ్చుకున్న పూరీలు తిని అమ్మకానికి వచ్చిన 'చాయ్' కొనుక్కు తాగేం. చాలా రోజుల్నుంచి నిద్ర లేదేమో నా కళ్ళు కూరుకుపోతున్నవి. 'సరే మీరు నిద్రకి ఉపక్రమిస్తున్నారు కాబోలు! రేప్పొద్దున చెబుతాలెండి' అంది మధుర. నే నొకసారి రైలుపెట్టెలో చూశాను. చాలావరకు హిందీవాళ్లు. దూరంగా అక్కడక్కడ పరీక్షలకని వచ్చిన తెలుగువాళ్లు ఒళ్లు తెలియకుండా నిద్రిస్తూ ఉన్నారు. మధురనుండి ఏమైనా వినాలనుంటే ఇదే మంచి తరుణం. ఏంచేత ఆమె గొంతుక మరీ పెద్దది. ఆమె స్వరూపంతోపాటు స్వరమూ పలువుర్నీ ఆకర్షించడం నా కిష్టంలేదు. అందుకే బలవంతాన నిద్ర ఆపుకుని మరో కప్పు 'చా' సేవించి 'అక్కర్లేదు, ఇప్పుడే చెప్పు' అన్నాను

'మీరు తొందరపడి నన్ను లాక్కొచ్చారు పాపం కేశవ ఏమనుకున్నాడో అయినా అపార్థం చేసుకునే మనిషేం కాదులెండి అతని ఎడ్రసుకి కవరు రాసి పడేసి మరీ రైలెక్కేను. పాపం బాగా ఆశాభంగం పొందుతాడు. నాకు మాత్రం ఒక్క విషయం వూహా కందకుండా ఉంది బాగా చదువుకున్నవారు మీరు నన్నెందుకు అందరితోపాటు అంత తక్కువగా వూహించారు?' ఇందులో బాగా చదువుకున్నవారు అన్నమాట నాకు ఎత్తిపొడుపుగా కనిపించింది ఇంకా దేశంలో ప్రతి ఒక్కరూ చదువుకున్న ఆడదాన్ని ప్రత్యేకంగా చూడ్డమూ అది ఒక సహజమైన విషయంగా భావించక పోవడమూ నాకు విచారాన్ని కలుగజేసింది.

'చదువుకున్న ఆడది కాపురం చేస్తుందా? ఉద్యోగం చేస్తున్నది చెప్పినట్టు వింటుందా?' అనే మాటలు యిప్పటికి కూడా ఏం తక్కువ వినపడ్డంలేదు. ఈ విషయంలో సాటి స్త్రీలోకం చేసే విమర్శ మరీ కర్ణకఠోరంగా ఉంటుంది

ఈనాటికి కూడా చదువు విషయంలో స్త్రీలకు తగిన అవకాశాలు లేవు. చాలాచోట్ల మగవాళ్లతో కలిసి చదవవలసి రావడమే మన దేశంలో ఆడపిల్లలకున్న ముఖ్య దురదృష్టం. క్లాసుకి నలభైమంది మగపిల్లలుంటే పదిమంది కూడా ఆడపిల్లలుండరు. పాఠాలు చెప్పే గురువుల్లో కూడా నూటికి తొంభైమంది పుల్లింగమే. చాలావరకు హైస్కూళ్లలో బాలికలకు ప్రత్యేక సదుపాయాలు ఉండవు. తల్లిదండ్రులూ, ఉపాధ్యాయులూ ఒకరిమీద మరొకరు బాధ్యతలు వేసి ఆడపిల్లల అవసరాలు గమనించరు క్రమశిక్షణకు క్రమక్రమంగా శిక్ష జరుగుతున్న ఈ రోజుల్లో ఏదైనా ఫంక్షన్ నాడు గాని వర్షం వచ్చి గొడుగు తెచ్చుకోనినాడు గాని ఆడపిల్లలు పడే అవస్థ అనుభవించినవాళ్లకి గాని తెలీదు. ఇటువంటి నిస్సహాయతనుండి నిబ్బరంగా పైకి రావాలంటే అదనపు సాహసం అవసరం. ఇన్నివిధాల యిబ్బంది పడినా కళాశాలల్లో చేరడానికి ప్రతి నిముషం ముందంజవేసే అమ్మాయిల గుండె నిబ్బరం మెచ్చుకోదగ్గది. అగ్గానసాలమా ఆకాశ

అలా తిరస్కరించే అదృష్టానికి ఆడవాళ్లు కూడా నోచుకున్నారంటే అది అన్నివిధాలా ఆనందించవలసిన విషయమే. కాని, అదే పరిస్థితిలో ఆడపిల్లల చదువు అంతంతమాత్రంగానే ఉండడం అన్నివిధాలా విచారించవలసిన విషయం.

'మీరు నామాట వింటున్నట్టు లేదు. నిద్రా, ఆలోచనాముద్రా ?'

'బాగా చదువుకున్నవారు' అని నువ్వు ఎందు కన్నావా అని ఆలోచిస్తున్నాను. నాకేం రెండు కొమ్ములు మొలవలేదుగా ? అలా అయితే ప్రీవియస్ అయిపోయిందిగా యీపాటికి నీకొక కొమ్ము మొల వాలిగా ? అయినా అలా జరిగినా మొగాళ్లు వూరు కుంటారా, వెంటనే శృంగభంగం చేసెయ్యరూ?'

"అయ్య బాబోయ్, మీతో మాట్లాడలేమండి బాబూ—నే నేదో తెలివితక్కువగా మాట్లాడే స్తుంటాను."

'ఆ కేశవరావు గురించి ఏదో చెప్పబోతున్నావ్‌గా .. ... చెప్పూ'

'ఏదీ మీరు సరిగ్గా వినందే .... అతనిమీద మీకు ముందే దురభిప్రాయం ఉన్నట్టుంది. ఎవరేం చెప్పేరో ఏమో.'

'ఎవరూ ఏం చెప్పక్కర్లేదు. తన చుట్టూ తిరిగే ప్రతి మొగాడిమీదా ఆడది వీలైనంత వరకు దురభిప్రాయం కలిగిఉండడమే మంచిది. తప్పుడు అంచనాలవల్ల కలిగిన సదభిప్రాయంతో కాలు జారితే తరువాత విచారించి లాభం ఉండదు మరి. మన యూనివర్శిటీలో మనకు తగిన అవకాశాలు లేక అక్కణ్ణుంచి యిక్కడికి ఇన్ని వందల మైళ్ల దూరం వచ్చాం. దేనికి ? బుద్ధిగా చదువుకోడానికా, హద్దుమీరి తిరగడానికా ? ఏళ్ల తరబడి కష్టపడి వేలకివేలు ఖర్చుపెట్టి ఎందు కింత దూరం వచ్చాం మధురా, యోగ్యత పెంచుకోడానికా, తగ్గించుకోడానికా ?'

ఈసారి కలకలలాడే ఆమె మొహంలో కన్నీరు ఉబికింది.

'మేము ఒక్క పొరబాటువని కూడా చెయ్య లేదు. పైగా నేను వెళ్ళిందగ్గర్నుంచీ వచ్చేదాకా ఆ కేశవ ఒక్కలా సహాయం చేశారు. హాస్టలులో స్టూడెంట్సుతో పరిచయం చేశాడు! ముఖ్యమైన ప్రశ్నలన్నీ ముందుగానే చర్చించుకునే అవకాశం కల్పించాడు. ఎక్కడా దొరకని నోట్సూ, లైబ్రరీ పుస్తకాలూ తెచ్చిపెట్టేడు. నాకు దొరకని ముందు టేడు ప్రశ్నా పత్రాలన్నీ ఎవరి దగ్గరో సంపాదించి యిచ్చేడు. ఎన్నివిధాలో ప్రోత్సహించి ప్రతి పరీక్షకూ సాగనంపేవాడు. నిజం చెప్పవలసి వస్తే అతనే లేకపోతే ఇప్పుడు ఆన్సరు చేసిందానిలో సగమైనా ఆన్సరు చెయ్యలేకపోయేదాన్ని. అతని కెంతో యిబ్బందయ్యేది. వేళకి రాలేదని వాళ్ల గైడు తిట్టిపోసేవాడట. నాతో తిరుగుతున్నానని వాళ్ల ఫ్రెండ్సందరూ అనేక రకాలుగా ఏడిపించే వారట. ఇదంతా భరించి ఆయన నాకు ఇంత ఉత్సాహమూ, ప్రోత్సాహమూ ఇవ్వడం ఎందుకు ?'

'ఎందుకు, అదే నిన్ను అడగబోతున్నాను.'

'ఆగండి, అదే మీకు చెప్పబోతున్నాను.'

(సశేషం)

ఆల్బో-సాంగ్



అన్ని వయసుల
వారికీ ఆదర్శక బలవర్ధకం

మీరు అన్నివిధాల ఆరోగ్యంగా వుండాలంటే మీకు ఆల్బో-సాంగ్ అవసరం. వృద్ధులకు, యువకులకు కూడా పుష్టికరమైన శరీరాన్ని ఆరోగ్యాన్ని సంపాదించుటకు ప్రత్యేకమైన పదార్థాలు ఆల్బో-సాంగ్‌లో చేర్చబడ్డాయి. ఈ రోజు ప్రతి రోజూకూడా ఆల్బో-సాంగ్ తీసుకోండి. సర్వదా మీరు ఆరోగ్యంగా వుంటారు



జె. అండ్ జె. డీషేన్
హైదరాబాదు (దక్కన్)

1964-65
బోనసు వత్సరం!

ఎల్ఐసి వారి ఆస్తుల ఐదవ మదింపు 1965 మార్చి 31వ తేదీకి జరుగుతుంది. ఆ మదింపు తేదీనాడు పూర్తి బీమా మొత్తానికి అమలులో వున్న లాభాలతోగల పట్టాలన్నీ లాభాలలో భాగం పంచుకొనుటకు అర్హత కలిగి వుంటాయి

1963 మార్చి 31వ తేదీకి జరిగిన నాల్గవ మదింపువల్ల ప్రకటించిన హెచ్చు బోనసు రేట్లు యీ క్రింది విధంగా వున్నాయి.

పూర్తి జీవిత బీమా:	ఎండోమెంటు బీమా:
రు 17.50 వెయ్యికి సాలుకి	రు 14.00 వెయ్యికి సాలుకి

1965 మార్చి 31వ తేదీనాడు పూర్తి బీమా మొత్తానికి మీ పట్టా అమలులో వుండేలా చూడడం మీకే లాభదాయకం. ఆ తేదీకి ముందుగానే లాభాలతోగల పట్టాను తీసుకొనడంకూడా ప్రయోజనకరం. ఎందువల్లనంటే, యీ క్రొత్త పట్టా ఒక సంవత్సరం బోనసుకు అర్హత కలిగి వుంటుంది.

మీరు బీమా చేసిననాడే మీకు రక్షణ

లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా

26-2-1965 శుక్రవారం మొదలు 4-3-1965 గురువారం వరకు.

మేషం :

(అశ్వని, భరణి, కృత్తిక 1 పా.)

గడిచిన రెండు మూడు వారాలకంటే ఈవారం అనుకూలంగా ఉంటుంది. ఇంతవరకు మీరు ఎంత ప్రయత్నం చేసినా నెరవేరని వ్యవహారాలు కూడా యిప్పుడు నెరవేరతాయి. భాగస్వాములతో కలిసి చేసే వ్యాపారాలకంటె మీరు స్వంతంగా చేసే వ్యాపారాలు ప్రోత్సాహకరంగా ఉంటాయి. సాహసముతో కూడిన వ్యవహారాలు కూడా లాభిస్తాయి. వృత్తిలో ఇతరుల జోక్యంవల్ల చికాకులు రావచ్చును. ఉద్యోగంలో అనుకూలత లభిస్తుంది. ఆర్థిక వ్యవహారాలు సంతృప్తికరంగా ఉంటాయి సాంఘిక కార్యక్రమాల్లో మీ ప్రాముఖ్యత పెరుగుతుంది.

స్త్రీలకు—కుటుంబ కార్యక్రమాలు సామాన్యంగా ఉంటాయి. వారాంతంలో సంతానానికి అనారోగ్య సూచనలు ఉన్నాయి.

వృషభం :

(కృత్తిక 2, 3, 4 పా, రోహిణి మృగ 1, 2 పా)

వృత్తి వ్యాపారాల్లో వారం ప్రారంభంలోనే కొన్ని చికాకులు ఏర్పడినా తరువాత అనుకూలత లభిస్తుంది. వ్యాపారంలో ఆదాయం అంతగా పెరగకపోయినా, వడావుడి మాత్రం అధికంగా ఉంటుంది. వ్యాపారంలో ముమ్ముందు మీకు లాభించగల వ్యవహారాల్లో అభివృద్ధిని సాధించగలరు. మీ ఎదుట స్తోత్రం చేస్తూ చాటున ద్రోహంచేసే వ్యక్తులతో ఉద్యోగంలో వ్యవహరించవలసి వస్తుంది. ముఖ్యమైన వ్యవహారాలు మీరు స్వయంగా చూడడం మంచిది. రాజకీయ వ్యవహారాలు ప్రోత్సాహకరంగా ఉంటాయి. ఆరోగ్యం ప్రస్తుతం బాగా ఉన్నా శరీర శ్రమతో కూడిన కార్యక్రమం పనికిరాదు.

స్త్రీలకు— ఆరోగ్యం సామాన్యంగా ఉంటుంది. కుటుంబ వ్యవహారాల్లో అధిక వ్యయం జరుగుతుంది. బంధుమిత్రులను కలుసుకొంటారు.

మిథునం :

(మృగశిర 3, 4 పా, ఆరుద్ర, పునర్వసు, 1, 2, 3 పా)

వృత్తి వ్యాపారాల్లో ప్రోత్సాహకరమైన పరిస్థితి లేకయినా మీ సమయస్ఫూర్తి వలన మిత్రుల సహకారం వలన కొన్ని వ్యవహారాల్లో తగినంత ప్రయోజనాన్ని పొందగలరు. అధికారుల వలన జరుగవలసిన వ్యవహారాల్లో ఆఖరు క్షణంలో ఆటంకాలు రావచ్చును. వృత్తిలో గౌరవం బాగా ఉంటుంది. మీరు ఇదివరకు చేసిన వాగ్దానాలవల్ల ఆర్థికంగా కొంచెం ఒత్తిడి రావచ్చును. వారం మధ్యలో మీ తాలూకు వస్తువులు పోయే ప్రమాదము ఉంది. కోర్టు వ్యవహారాల్లో యిదివరకు ఏర్పడిన వ్యతిరేకత చాలావరకు తొలగిపోతుంది. ఆరోగ్యం బాగానే ఉంటుంది.

స్త్రీలకు— బంధువుల వ్యవహారాల్లో భేదాభి

మీ	మే	వృ	మి
	గు	రా	
ర బు శు	వారఫలం		
	మహేష్		
చం	కే		శు

ప్రాయాలు రావచ్చును. ప్రయాణాలు వాయిదా వేయడం మంచిది. విలాస వస్తువులు కొంటారు.

కర్కాటకం :

(పునర్వసు 4 పా, పుష్యమి, ఆశ్లేష.)

ఈ వారం కూడా బాగా ఉంటుందని ఆశించడానికి అవకాశం లేదు. వారం ప్రారంభంలో సామాన్యంగా ఉన్నా రానురాను వ్యతిరేక వాతావరణం ఏర్పడుతుంది. వృత్తి వ్యాపారాల్లో మీవల్ల ఉపకారం పొందినవారే అపకారం చేయడానికి పూనుకొంటారు. భారీ యెత్తున చేసే వ్యాపారాల్లో నష్టం రాగల సూచనలు ఉన్నాయి. ఉద్యోగంలో అధికారులతో భేదాభిప్రాయాలు వస్తాయి. ప్రయాణాల్లో ప్రయాసకు తగిన ప్రయోజనం లభించదు. ఆరోగ్యం బాగానే ఉన్నా మానసికాందోళన కలుగుతుంది. శుభకార్యాల విషయంలో మీరు ఇదివరకు చేసిన వ్యవహారాలు ఫలించవచ్చును.

స్త్రీలకు— కుటుంబ కార్యక్రమాలు అంత సంతృప్తికరంగా ఉండవు. సాంఘిక కార్యక్రమాల్లో మెప్పుకురాని బాధ్యత వహించవలసి వస్తుంది.

సింహం :

(మఖ, పుబ్బ, ఉత్తర 1 పా.)

ఈ వారం మీరు వృత్తి వ్యాపారాల్లో విశేషమైన ఫలితాన్ని సాధించలేక పోయినా, ఇదివరకు పాటివారితో ఏర్పడిన భేదాభిప్రాయాలు తొలగిపోవడం వలన సంతృప్తికరంగా ఉంటుంది. వ్యాపారంలో కొన్ని అవకాశాలు యింద్రధనుస్సువలె ఆకర్షణీయంగా కన్పిస్తాయి. కాని వాటికోసం ప్రయత్నించడంవలన అనవసరమైన వ్యయప్రయాసలకు గురికాగలరు. వృత్తిలో సామాన్యమైన ఫలితంతో సంతృప్తి పొందడం మంచిది. రాజకీయ వ్యవహారాల్లో మీరు అశ్రద్ధ చేయడంవలన చేజిక్కిన అవకాశాలు కొన్ని జారిపోవచ్చును.

స్త్రీలకు—ఆరోగ్యం సామాన్యంగా ఉంటుంది. దైవకార్యాలు నెరవేరతాయి. సాహిత్య కళారంగాల్లో మీ కృషి అంతగా రాణించదు.

కన్య :

(ఉత్తర 2, 3, 4 పా, హస్త, చిత్త 1, 2 పా)

ఈవారంకూడా మీరు అన్ని వ్యవహారాల్లోను జాగ్రత్తగా వ్యవహరించడం అవసరం. వ్యాపారంలో మీరు యిప్పుడు చేసే ప్రయత్నాలు కొన్ని

> **ఈవారం ధరలు**
>
> అపరాలధరలు నిలకడగా ఉండి కొంచెం తగ్గుతాయి. బెల్లం ధరలో పెద్దమార్పులు రాగల సూచనలు లేవు. నూనె గుప్పుల ధరలు వారం ప్రారంభంలో కొంచెం తగ్గి వారాంతానికి మరల పెరుగుతాయి. పసుపు ధర పెరుగుతుంది.

వ్యర్థమై పోయినట్లు కన్పిస్తాయి గాని వాటివల్ల ముమ్ముందు మీరు తగిన ప్రయోజనాన్ని పొందగలరు భాగస్వాములతో కలిసి చేసే వ్యాపారాలు మాత్రం అనుకూలంగా ఉంటాయి. వృత్తిలో వారాంతంలో అనవసరమైన వ్యయం జరుగుతుంది. ఉద్యోగంలో మీ పరిస్థితి గతవారంలో కంటె కొంచెం బాగానే ఉంటుంది. స్థిరాస్థి వ్యవహారాల్లో మీకు అనుకూలమైన మార్పులు వస్తాయి. సాంఘికంగా ప్రయోజనం గల పరిచయాలు ఏర్పడతాయి.

స్త్రీలకు—ఆరోగ్యం బాగానే ఉన్నా కొంచెం బలహీనత కన్పిస్తుంది. సంతోషకరమైన వార్తలను వింటారు.

తుల :

(చిత్త 3,4 పాదాలు, స్వాతి, విశాఖ, 1,2,3 పా)

ఒకప్పుడు మీరు నిరాశ చెందిన వ్యవహారాలు కూడా యిప్పుడు అనుకూలించగల సూచనలు ఉన్నాయి. వృత్తి వ్యాపారాల్లో మీరు యిప్పుడు అజాగ్రత్తగా వ్యవహరించడంవలన కొంత డబ్బు చిక్కుల్లో బడిపోయే ప్రమాదం ఉంది. వ్యాపారంలో ముమ్ముందు మీకు లాభించగల సంభాషణలను జరుపుతారు. ఆర్థిక వ్యవహారాల్లో మీరు మొహమాటాలకు లొంగిపోవడంవలన పశ్చాత్తాప పడవలసిన పరిస్థితి ఏర్పడుతుంది. వృత్తిరీత్యా చేసే ప్రయత్నాలు ప్రోత్సాహకరంగా ఉంటాయి. సంతానానికి సౌఖ్య సంతోషాలు లభిస్తాయి నటీనటులకు, వస్త్ర వ్యాపారులకు అనుకూలమైన సమయం.

స్త్రీలకు— కుటుంబ కార్యక్రమాలు కొన్ని మార్పులతో నెరవేరతాయి సాంఘిక కార్యక్రమాల్లో మీ ప్రాముఖ్యత పెరుగుతుంది.

వృశ్చికం :

(విశాఖ 4—వ పాదం, అనూరాధ, జ్యేష్ఠ)

ఆర్థిక వ్యవహారాల్లో అనుకూలమైన పరిణామాలు ఏర్పడుతాయి. వ్యాపార విస్తరణ ప్రయత్నాలు ప్రోత్సాహకరంగా ఉంటాయి. అధికారుల వలన జరగవలసిన వ్యవహారాల్లో మీకు కొంతమంది ప్రముఖుల సహాయం లభించడంవలన మీ కార్యక్రమాలు చురుకుగా సాగుతాయి. వృత్తిలో కొత్తవారితో పోటీ కలగవచ్చును గాని దానివల్ల మీరు పొందే వ్యయప్రయాసలు ఏమీ ఉండవు. ఉద్యోగంలో అధికారుల గౌరవాన్ని పొందగలరు. స్థిరాస్థి వ్యవహారాల్లో కొత్త సమస్యలు తలయెత్త

వచ్చును. విశాఖా నక్షత్ర జాతకులకు మిగిలినవారి కంటే బాగా ఉంటుంది.

స్త్రీలకు—ఆరోగ్యం బాగానే ఉంటుంది. పాటి వారిలో గౌరవం లభిస్తుంది. ఉద్యోగినులకు యోగవంతమైన సమయం.

ధనుస్సు :

(మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1 పా.)

వృత్తి వ్యాపారాల్లో మీ భవిష్యదభివృద్ధికి తోడ్పడే దీర్ఘకాలిక ప్రణాళికలు అమలు జరప డానికి అనుకూలమైన సమయం. వ్యాపారంలో మీ అంచనాలు సరియైనవని రుజువు కావడంవలన ఆదాయంతోపాటు హోదా కూడా పెరుగుతుంది. ఇంతవరకు మీపట్ల ఉదాసీనంగా ఉన్నవారు కూడా యిప్పుడు మిమ్మల్ని గౌరవిస్తారు. వృత్తిరీత్యా చేసే ప్రయాణాలు ఫలిస్తాయి. ఆర్థిక వ్యవహారాలు బాగానే ఉన్నా వారాంతంలో కొంచెం ఒత్తిడి రావచ్చును. రాజకీయ వ్యవహారాల్లో నూతన పరిచయాలు ఏర్పడతాయి. కంట్రాక్టర్లకు, వైద్యులకు అనుకూలమైన సమయం.

స్త్రీలకు— కుటుంబ కార్యక్రమాలు నిరాటంకంగా నెరవేరతాయి. అలంకార వస్తువులు కొంటారు.

మకరం :

(ఉషా 2, 3, 4 పా, శ్రవణం, ధనిష్ఠ 1,2 పా.)

వృత్తి వ్యాపారాల్లో కొన్ని వ్యవహారాల్లో ఫలితం చేతికి అందే సమయంలో చికాకులు రావడం వలన మీరు నిరాశ నిస్పృహలకు గురికాగలరు. కాని వారం రెండవ భాగంలో అన్నివిధాలా అనుకూల పరిస్థితి యేర్పడుతుంది. ఆదాయం మామూలుగానే ఉన్నా రావలసిన డబ్బు సమయానికి అందక పోవడం వలన చికాకులు కలుగుతాయి. వృత్తిలో భారీవ్యవహారాలు వాయిదా వేయడం మంచిది. ఉద్యోగంలో మీ పరిస్థితి సామాన్యంగా ఉంటుంది. కోర్టు వ్యవహారాల్లో ప్రతిపక్షుల సంచలనం పెరుగ గల సూచనలు ఉన్నాయి. ఆరోగ్యం సామాన్యంగా ఉంటుంది.

స్త్రీలకు—వారాంతంలో ఆరోగ్య విషయంలో జాగ్రత్త అవసరం. పుణ్యకార్యాలు చేస్తారు. మోద కాలక్షేపాల్లో పాల్గొంటారు.

కుంభం :

(ధనిష్ఠ 3, 4 పా, శతభిషం, పూ. భా. 1, 2, 3పా)

వృత్తి వ్యాపారాల్లో యేవ్యవహారమూ మీరు అనుకొన్నట్లుగా జరగక పోవచ్చును కాని వ్యతిరేకమైన సంఘటనలు యేమీ జరగకపోవడం వలన అదే సంతృప్తికరంగా ఉంటుంది. రావలసిన డబ్బు మీద ఆధారపడి నూతన వ్యవహారాలు ప్రారంభించడం మంచిది కాదు. వ్యాపారంలో అనుకూల వార్తలను వింటారు. సాహసముతో కూడిన వ్యవహారాలు కొంతవరకు లాభిస్తాయి. వారం ప్రారంభంలో అనవసరమైన వ్యయం జరుగుతుంది. ఉద్యోగంలో కొంచెం కార్యభారం పెరగ వచ్చును. పూర్వాభాద్రా నక్షత్ర జాతకులకు వారాంతంలో చాలా అనుకూలంగా ఉంటుంది.

వారఫలాలు

స్త్రీలకు—కుటుంబ కార్యక్రమాలు సులువుగా నెరవేరుతాయి. అధిక వ్యయం జరుగుతుంది. ఎవరితోను వాదప్రతివాదలకు దిగడం మంచిది కాదు.

మీనం :

(పూ. భాద్ర, 4 పా, ఉ. భా. రేవతి.)

వృత్తి వ్యాపారాల్లో సామాన్య వ్యవహారాలకు కూడా విశేషమైన ప్రయత్నం చేయవలసిన పరిస్థితి యేర్పడుతుంది. మీరు స్వంతంగా చేసే వ్యాపారాలు బాగా ఉంటాయి. వృత్తి రీత్యా చేసే ప్రయాణాలు అంతగా ఫలించక పోవచ్చును. వారాంతంలో మీ తాలుకు వస్తువులు పోయే ప్రమాదం ఉంది. ఉద్యోగంలో గౌరవం బాగా ఉంటుంది. రాజకీయ వ్యవహారాల్లో నూతనోద్యమాలు వాయిదా వేయడం మంచిది. ఆరోగ్యం ప్రస్తుతం బాగా ఉన్నా, నిర్లక్ష్యం చేయతగదు. పుణ్యకార్యాలు చేస్తారు.

స్త్రీలకు— ఆరోగ్యం యిదివరకటి కంటే బాగా ఉంటుంది. శుభకార్యాల విషయంలో అనుకూలమైన సంఘటనలు జరుగుతాయి. ★

జన్మదినఫలం

ఫిబ్రవరి-26

ఈ సంవత్సరం వృత్తి వ్యాపారాల్లో ఆడంబరం ఎక్కువ, అనుభవం తక్కువ అనే పరిస్థితి ఏర్పడ వచ్చును. వ్యాపారంలో మీ ఆలోచనలు సిద్ధాంత రీత్యా బాగానే ఉంటాయికాని ఆచరణలో వాటి వల్ల మీకు ప్రయోజనం ఉండదు. వృత్తి వ్యాపారాల్లో గౌరవం బాగా ఉంటుంది. మీకంటే పెద్ద వారు కూడా మిమ్మల్ని గౌరవిస్తారు. వృత్తిలో మీ స్వంత వ్యవహారాలకంటే ఇతరుల పనుల్లో శ్రమ పొందవలసి వస్తుంది. ఉద్యోగంలో మీ పరిస్థితి సామాన్యంగా ఉంటుంది. మీరు ఇదివరకు చేసిన నిర్ణయాలవల్ల ఇప్పుడు కొంత ఆందోళన కలగవచ్చునుకాని మీకు నష్టం ఏమీ కలగదు. సాంఘిక వ్యవహారాల్లో ప్రయోజనం కల పరిచయాలు ఏర్పడతాయి. ఆరోగ్యం బాగానే ఉంటుంది. కుటుంబ వ్యవహారాలు సామాన్యంగా ఉంటాయి. సంతానానికి సౌఖ్య సంతోషాలు లభిస్తాయి. విద్యార్థులు కొంచెం శ్రమమీద కృతార్థులు కాగలరు.

ఫిబ్రవరి-27

ప్రతి క్షణమూ మీరు హోరా హోరీగా పోరాడితేనేగాని వృత్తి వ్యాపారాల్లో ఏ వ్యవహారాన్నీ సాధించలేరు. వ్యాపారంలో పాటివారితో పోటీ తీవ్రం కావడంవలన మీరు పొందవలసినంత ప్రయోజనాన్ని పొందలేక పోవచ్చును. భారీ ఎత్తున చేసే వ్యాపారాలు అంతగా ఫలించగల సూచనలు లేవు. వృత్తిలో చాలా శ్రమమీద కొంత అభివృద్ధిని సాధించగలరు. ఉద్యోగంలో మీకు వ్యతిరేకంగా ఒక ఉద్యమంవంటిది రాగల సూచనలు ఉన్నాయి. సాహసముతో కూడిన వ్యవహారాల్లో నష్టం రావచ్చును. రావలసిన డబ్బు కూడా చేతికి వచ్చేవరకు నమ్మడానికి అవకాశంలేదు. రాజకీయ వ్యవహారాల్లో ప్రతిపక్షాల సంచలనం అధికం కావడంవలన మీ కార్యక్రమాలను పునరాలోచించవలసి ఉంటుంది. ఆరోగ్యం సామాన్యంగా ఉంటుంది. విద్యార్థులు శ్రమమీద కృతార్థులు కాగల సూచనలు ఉన్నాయి.

ఫిబ్రవరి-28

ఈ సంవత్సరం వృత్తి వ్యాపారాల్లో ఫలితం తక్కువైనా చేతినిండా పని మాత్రం ఉంటుంది. మీరు ఇదివరకు జరిపిన వ్యవహారాల్లో ఏర్పడిన చికాకులను తొలగించడంలో నిమగ్నం కావడం వలన ప్రస్తుతపు వ్యవహారాల్లో శ్రద్ధ వహించడానికి అవకాశం లభించకపోవచ్చును. వృత్తిలో మీరు ఎంత జాగ్రత్తగా ఉన్నా కొన్ని అనవసరమైన వ్యవహారాల్లో చిక్కుకోగల ప్రమాదం ఉంది. ఉద్యోగంలో గౌరవం బాగా ఉంటుంది. ఉన్నత స్థానంకోసం చేసే ప్రయత్నాలు సంవత్సరాంతంలో అనుకూలించగల సూచనలు ఉన్నాయి. సాంఘిక కార్యక్రమాల్లో ప్రయోజనంలేని బాధ్యత పెరుగుతుంది. ఆరోగ్యం బాగా ఉన్నా శరీర శ్రమతో కూడిన కార్యక్రమాలు పనికిరావు. శుభ కార్యాల విషయంలో మీ ఆలోచనలు ఫలిస్తాయి. తీర్థయాత్రలు చేస్తారు. విద్యార్థులు సాధారణంగా కృతార్థులు కావచ్చును.

ఫిబ్రవరి-29

ఈ సంవత్సరం వృత్తి వ్యాపారాల్లో ఆదాయం మాట ఎలాగఉన్నా, గౌరవ ప్రాబల్యాలుమాత్రం బాగా ఉంటాయి. మీ ఆలోచనలో మీ స్వంత వ్యవహారాల్లోకంటే ఇతరుల వ్యవహారాల్లో బాగా పని చేస్తూ ఉంటాయి. కొంతమంది వ్యక్తులు మిమ్మల్ని పొగడుతూ మీ ద్వారా తమ కార్యాల్ని సాధించుకొనడానికి ప్రయత్నం చేస్తారు. వృత్తిలో దూరప్రయాణాలుచేసి కార్యసాధన చేయుగల సూచనలు ఉన్నాయి. ఉద్యోగంలో మీ పరిస్థితి సంతృప్తికరంగా ఉంటుంది. సమయానికి ఏదో ఒక విధంగా డబ్బు అందుతూ ఉండడంవలన అన్ని వ్యవహారాలు ఒడుదుడుకులు లేకుండా నెరవేరగలవు. ఆరోగ్యం బాగా ఉంటుంది. కుటుంబ వ్యవహారాల్లో కార్యభారం పెరిగినా మొత్తం మీద సంతృప్తికరంగా నెరవేరతాయి. విద్యార్థులు సామాన్యంగా కృతార్థులు కావచ్చును.

మార్చి-1

వృత్తి వ్యాపారాల్లో సామాన్య వ్యవహారాలకు కూడా విశేషమైన ప్రయత్నం చేయవలసిన అవసరం ఏర్పడడంవలన ఆదాయం కొద్దిగా పెరిగినా కూడా ఈ సంవత్సరం అంత సంతృప్తికరంగా ఉండక పోవచ్చును. మీరు స్వంతంగాచేసే వ్యాపారాలకంటే భాగస్వాములతో కలిసి చేసే వ్యాపారాలు ప్రోత్సాహకరంగా ఉంటాయి. వృత్తిలో ఇంతవరకు మీతో

వహకరిస్తున్నవారికి కొన్ని చికాకులు రావడంవలన మీరు కూడా ఇబ్బందికి గురి కాగల సూచనలు ఉన్నాయి. ఉద్యోగంలో మీ పరిస్థితి ఇదివరకటి కంటే కొంచెం బాగా ఉంటుంది. కోర్టు వ్యవహారాల్లో ఇదివరకు ఏర్పడిన వ్యతిరేకత చాలవరకు తగ్గిపోయినా, పూర్తిగా అనుకూలతను ఆశించడానికి అవకాశంలేదు. ఆరోగ్యం బాగా ఉన్నా అప్పుడప్పుడు బలహీనత చేస్తుంది. సంతోషకరమైన వార్తలను వింటారు. విద్యార్థులు సామాన్యంగా కృతార్థులు కాగలరు.

మార్చి-2

ఈ సంవత్సరం వృత్తి వ్యాపారాలు ఒడుదుడుకులు లేకుండా జరిగిపోతాయి. గత సంవత్సరమే ప్రారంభించినా, ఏవో ఆటంకాలు రావడంవలన నిలిచిపోయిన వ్యవహారాలను ఇప్పుడు పూర్తి చేయగల సూచనలు ఉన్నాయి. వ్యాపార విస్తరణ ప్రయత్నాలు మొదట్లో అంత బాగా లేకపోయినా, రాను రాను ప్రోత్సాహకరంగా ఉంటాయి. అధికారుల వలన జరగవలసిన పనులు ఆలస్యం కావడంవల్ల మీరు లాభం రావలసిన వ్యవహారాలను కూడా వదలుకోవలసి వస్తుంది. సాహసముతో కూడిన వ్యవహారాల్లో నష్టం రావచ్చును. ఉద్యోగంలో మీరు అందరికీ మంచిగా ఉండడానికి ప్రయత్నం చేయడంవలన అనవసరమైన శ్రమకు గురి కాగలరు. సాంఘిక కార్యక్రమాలు సంతృప్తికరంగానే ఉంటుంది. కుటుంబ వ్యవహారాలు సామాన్యంగా ఉంటాయి. విద్యార్థులు శ్రమమీద కృతార్థులు కావచ్చును.


మార్చి-3

ఈ సంవత్సరం మీ జీవితరంగంలో ప్రముఖ పాత్రను నిర్వహించగల సూచనలు ఉన్నాయి. ఇప్పుడు మీరు జరిపే వ్యవహారాల ప్రభావం రాబోయే సంవత్సరాలమీద కూడా ఉంటుంది కాబట్టి ప్రతి వ్యవహారములోను చాలా జాగ్రత్తగా వ్యవహరించడం మంచిది. వృత్తి వ్యాపారాల్లో మీ ఆలోచనలకు తగిన అవకాశాలు లభిస్తాయి. వ్యాపారస్తులకు ఆకస్మిక ధనలాభం కలగగల సూచనలు ఉన్నాయి. వృత్తిలో నూతన మార్గాల ద్వారా ఆదాయం లాభిస్తుంది. ఉద్యోగంలో ఉన్నత స్థానం కోసం మీరు చేసే ప్రయత్నాలు ఫలిస్తాయి. రాజకీయ వ్యవహారాలో బాధ్యతగల పదవిని నిర్వహిస్తారు. సాహిత్య కళారంగంలో ఖ్యాతి లభిస్తుంది. ఆరోగ్యం సంతృప్తికరంగా ఉంటుంది. కుటుంబ వ్యవహారాలు సామాన్యంగా ఉంటాయి. సంతానానికి సౌఖ్యసంతోషాలు లాభిస్తాయి. విద్యార్థులకు జ్ఞాను రాగల సూచనలు ఉన్నాయి.

మార్చి-4

ఇతరుల దృష్టిలో యీ సంవత్సరం మీకు యోగవంతమైనదే కావచ్చును కాని మీకు మాత్రం అంత సంతృప్తికరంగా కన్పించదు. ఎప్పుడూ ఏదోమందితో తిరుగుతూ ఉంటారు. మీ కంటే పెద్దలు కూడా మీ అభిప్రాయాలను [illegible] తుంటారు కాని వీటివల్ల మీరు ఆర్థికంగా పొందే ప్రయోజనం యేమీ ఉండక పోవచ్చును. భాగస్వాములతో కలసి చేసే వ్యాపారాల్లో యిది వరకు యేర్పడిన చికాకులు తొలగి పోతాయి. వృత్తిలో మీ పరిస్థితి ఆర్థికంగా సామాన్యంగా ఉంటుంది. ఉద్యోగంలో పై అధికారుల ఆదరాభి [illegible]. మీరు యిదివరకు చేసిన వాగ్దానాల వల్ల అప్పుడప్పుడు ఆర్థికంగా ఒత్తిడి రావచ్చును. ఆరోగ్యం బాగానే ఉంటుంది. కుటుంబ వ్యవహారాల్లో అనుకూలత ఉంటుంది. బంధు వ్యవహారాల్లో జోక్యం కలిగించు కొని విజయం సాధిస్తారు. విద్యార్థులు సాధారణంగా కృతార్థులు కాగలరు. ★





ఎన్. టి. రామారావు

వైజ్ఞానిక గాథాశతి

7


డాక్టర్



"ఏమోడు బంగారంతో వెండిని కలిపేడా? అది నేను కనిపెట్టి చెప్పాలా? దీనికోసం కావలిస్తే కిరీటాన్ని నేను ఇంటికి తీసుకెళ్ల వచ్చునా? ఈ భారము నా నెత్తికెందుకు అంటే నేను తెలివి గలవాడిననా? ఏల నాకీ శిక్ష?" అనుకుంటూ ఆర్కిమిడీసు తన ఇంటి వైపు అడుగులు వేశాడు. అతడు గ్రీసు దేశంలోని సైరాక్యూసు నగరంలో క్రీ.పూ. మూడో శతాబ్దంలో జీవించిన వాడు. గణిత శాస్త్రములో అతనికి అమిత ప్రీతి. ఎవరికీ సాధ్యము కాని లెక్కలు అతడు అవలీలగా సాధించేవాడట. ఆతని కాలంలో రాజరికము చేస్తుండిన హీరో మహారాజు బంగారంతో కిరీటం చేయమని ఒక స్వర్ణకారునికి పురమాయించాడు. తీరా తయారైన కిరీటం చూచేసరికి—అది కొంత వెలవెల పోవడము వల్ల కాబోలు— అచ్చంగా బంగారము వాడకుండా కొంత తస్కరించడానికి వెండిని కలిపి కిరీటం చేసి తూకము కిట్టించాడని రాజుగారికి అనుమానము కలిగింది. 'పిలవండి ఆర్కిమిడీసుని' అన్నాడు, 'నిజము కనిపెట్టి చెప్పు'మని ఆజ్ఞాపించారు. తనకీ బరువెందుకో తెలుసుకోలేక ఆర్కిమిడీసు చింత పడ్డాడు.

అయితే అదేమేనా తప్పేది కనకనా? నిండు సభలో రాజుగారు చెప్పారాయెను. చెయ్యక పోతే తనకు లేనిపిలే. ఇది తనకు శిక్ష కాదు సవాలు. తనక మొట్ట మొదట బంగారము, వెండి, లోహాల్ని పరిశీలించి వాటి ధర్మాల్ని తెలుసుకోడము ప్రారంభించాడు. ఒక అంగుళము పొడవూ అంగుళము ఎత్తు అంగుళము వెడల్పూ గల బంగారపు ముక్కనూ, సరిగ్గా అలాంటిదే వెండిముక్కనూ తెల్చాడు. రెండింటి పరిమాణము (Volume) ఒక్కటే, బరువులు తేడాగా వున్నాయి. అంతే పరిమాణమున్న ఇతర లోహాలూ చూచాడు. వాటికన్నిటికీ పరిమాణము సమము, బరువుల్ల తేడా. కనక పరిమాణాలు సమంగా ఉంచితే, లోహాల భేదము బరువుల్లో తెలిసి పోతుంది. ఒక ఘనసెంటీమీటరు పరిమాణము గల బంగారము బరువు 19.00 గ్రాములు, అంతే పాదరసము 13.5 గ్రాములు, ఇనుము 7 5 గ్రాములు. అయితే రాజుగారి కిరీటము అచ్చంగా బంగారపు దేనా, ఆ కిరీట లోహము ప్రతి ఘనసెంటీమీటరుకీ 19 గ్రాముల చొప్పున తూగేటిదేనా? అని ప్రశ్నకలిగింది. కిరీటము తూచితే దాని బరువు ఎన్ని గ్రాములో తెలుస్తుంది. దాని పరిమాణము తెలిస్తే, బరువుని పరిమాణముతో భాగిస్తే కిరీటలోహపు సాంద్రత (అనగా ఒక ఘనసెంటీమీటరు బరువు) తెలుస్తుంది. అది 19. గ్రాములైతే, అది అచ్చు బంగారమే నన్న మాట. తగ్గితే కలితీ ఉన్నదన్న మాట. ఆలోచన సరిపోయింది కాని, కిరీటము పరిమాణము తెలుసుకోడమెలాగా?

పొడవు వెడల్పు ఎత్తులు వస్తువంతటా మారకుండా ఉండే సమరూప (Regular) వస్తువులలో అడ్డుకోత (Cross - section) వైశాల్యాన్ని ఎత్తుతో హెచ్చవేస్తే ఆ వస్తువు ఘనపరిమాణము వస్తుంది. వంకరటింకరలతో ఉన్న కిరీటము పరిమాణము కనుక్కోడము ఎలాగ? అదే పెద్ద చిక్కు అయింది. ఎంత ఆలోచించినా తెగలేదు.



ఒకనాడు స్నానము చెయ్యడానికని ఆర్కిమిడీసు తన వీధిలో వున్న (స్నానాల) హోటలుకి వెళ్లాడు. పొడుగాటి తొట్టినిండా నీరు నింపివుంటుంది, ఆ నీటిలో పడుక్కుని స్నానము చేసినంత సేపూ చేసి, హోటలు యజమానికి స్నానము చార్జీ ఇచ్చేసి వెళ్ళి పోతారు ఎవరేనా. ఆ నాడు తొట్టిని పూర్తిగా నింపి ఉండినారు. ఆ నీళ్లలో కాలు నెమ్మదిగా దింపుతూంటే నీరు తొట్టె అంచుల మీదనుంచి పొర్లిపోయి కారిపోతోంది. కాలు నీటిలో ప్రవేశిస్తున్నంత సేపూ నీరుపొర్లి పోతూనే వుండింది. 'ఎంత నీరు పొర్లిపోతుంది?' అన్న ప్రశ్నా, 'నీరు ప్రవేశించిన కాలు పరిమాణానికి సమానమైనంత' అన్న జవాబూ ఒక్కమారు ఆతని మేధస్సులో మెరిసినది. కాలు, కిరీటమువలెనే వంకరటింకరలతో ఉన్న ఘనపదార్థము. దారము కట్టి కిరీటాన్నే ఆ నీటిలో ముంచితే, పొర్లిపోయే నీటి పరిమాణాన్ని—కొలపాత్రలతో కొలిచి—కనుక్కోవచ్చునూ, అంటే కిరీటపు పరిమాణము తెలిసి పోతుంది అన్నమాట. ఉత్సాహంతో ఆర్కిమిడీసు "కనుక్కున్నాను, కనుక్కున్నాను" అని అరుస్తూ ఇంటికి పరుగెత్తినాడట! కిరీటమును, పటములో చూపిన కొమ్ముపాత్రలో దింపి, పొర్లిపోయి కొలపాత్రలో పడిన నీటి పరిమాణాన్ని కనుక్కున్నాడు ఆర్కిమిడీసు.

తరువాత కిరీటపు బరువుని పరిమాణముతో భాగించి ఒక ఘనసెంటీ మీటరు కిరీటలోహము బరువు లెక్కగట్టాడు. అది బంగారము సాంద్రతతో సరిపోలేదు, తక్కువగా ఉంది. స్వర్ణకారుడు బంగారంలో దానికంటె తక్కువ సాంద్రత గలిగిన లోహము— వెండే కావచ్చును—కలిపేడన్నమాటే. కిరీటపు పరిమాణములో ఎన్నిపాళ్లు బంగారముతో మరెన్ని పాళ్ల వెండి కలిపితే కిరీటానికి ఈ బరువు తేలగలదూ అని ఆలోచించాడు ఆర్కిమిడీసు. ఇది లెక్కగట్టే తెలుసుకో వచ్చును, బంగారాన్నీ వెండినీ వేరే వేరే పాళ్లలో కలిపి కరిగించి, ఆ ముద్దల సాంద్రత కనుక్కుని ఆ సాంద్రతకీ పాళ్ళ నిష్పత్తికీ గ్రాఫుగీసి కిరీట సాంద్రతను బట్టి పాళ్లను కనుక్కోవచ్చును. ఆర్కిమిడీసు ఆ పాళ్లను లెక్కగట్ట సమర్థుడే. ఆపద్ధతిలోనే కనుక్కున్నాడు. ★


Brooke Bond
Family Brand
pure
coffee
BROOKE BOND INDIA PRIVATE LIMITED
CALCUTTA
B2/BBC-7C TEL
ఉత్సాహం, ఉల్లాసం కలిగించేది అంటేనే కాఫీ,
దానిలో ఎన్నుకునేది
బ్రూక్ బాండ్ కాఫీ
ఇతరమైన వాటికంటే బ్రూక్ బాండ్ విశేషమైనదనడానికి కారణాలేమిటి? బ్రూక్ బాండ్ కాఫీ పొడి పొట్లం విప్పండి. మీకే తెలుస్తుంది. కాఫీ విత్తులను అప్పటికప్పుడే వేయించి తయారుచేసినట్టి కమ్మని మంచివాసన వేస్తుంది.
ఏరికోరి కూర్చిన మేలిరకం కాఫీ విత్తులే బ్రూక్ బాండ్ కాఫీ పొడి తయారులో ఉపయోగించబడుతున్నవి....తర్వాత ఆ కమ్మని వాసన తగ్గకుండా గాలి చొరని పెలిఫొన్ సంచులలో శాస్త్రీయ పద్ధతులపై ప్యాక్ చేయబడుతుంది. ఇప్పుడే బ్రూక్ బాండ్ కాఫీని ప్రారంభించండి....ఆ తాజా, కమ్మని వాసనే శాశ్వతం చేసుకోండి.
మీరూ, బ్రూక్ బాండ్ కలిసి కప్పు మంచి కాఫీ తయారు చేయగలరు.
ఎల్లప్పుడూ తాజాగావుండి కమ్మనివాసన కలిగి ఉండేదానిని రుచిచూడండి.



అర్ధాంతరన్యాస

గొల్లపూడి రాధాకృష్ణమూర్తి

అప్పుడే స్కూలు వదిలారు. పుస్తకాల సంచి చంకకు తగిలించుకొని పరుగెత్తుతూ వచ్చి వేణుకంటే ముందర ఆస్పత్రి గేటు చేరాను. రోజూ మాకిదే పంతు—స్కూలు వదలగానే ఆస్పత్రి గేటు ముందు ఎవరు చేరుతారో నని. అక్కడికి చేరగానే పరుగు ఆపి ఆస్పత్రి వెనక మొండి గోడ దాకా నిదానంగా నడుస్తాం—ఆయాసం తీర్చుకుంటూ. వెనకవైపు మొండి గోడ దాటగానే వేణు ఎడంవైపు మునసబు కోర్టు దారిని వెడతాడు. మునసబు కోర్టు వెనకే ఉన్న బంగళా వాళ్ళ ఇల్లు. నేనేమో ఆస్పత్రి వెనకున్న కాలవ దాటి నేరుగా సినిమా హాలుకేసి నడుస్తాను—మింటి దారిని.

మొండిగోడ దాటగానే వేణు ఎడంవైపు తిరిగాడు. నేను కాలవలోకి దిగాను.

అది పేరుకు మాత్రమే కాలవ. సంవత్సరంలో చినుకులుపడ్డ ఏ నాలుగు రోజులో తప్ప—మిగతా రోజుల్లో అది ఎండిపోయి వుంటుంది—నెల మొదటి తారీకున చిరునవ్వు నవ్వి మిగతా ఇరవైతొమ్మిది రోజులూ దిగాలుగా ఉండే మా మాష్టారిలాగ. రోజూ పనికిరాని చెత్తా, చెదారం, పాత గుడ్డలు—వాడి తీసి పారేసిన డ్రస్సింగ్సూ—పగిలిన మందు సీసాలు, అన్నీ ఆ కాలవలోకి గిరాటు పెడుతూంటారు ఆస్పత్రిలోంచి. సంవత్సరమంతా ఇలా పేరుకున్న పాప పంకిలమంతా ఎవరికన్నా రోత పుట్టి ఒక అగ్గిపుల్ల గీసి పడేస్తే తగలబడినంతవరకూ తగలబడుతుంది. లేకపోతే అదంతా వర్షాకాలంలో వరుణుడికి దయ కలిగి నాలుగు చినుకులెక్కువ పడితే అన్నీ కలిసి తేలి కొట్టుకుపోతూ కథల్లో వినే వైతరణిని గుర్తుకు తెస్తూంటయి.

కాలవలో ఎవరివో రోగులపాత మురికి గుడ్డలు తగలబడుతూన్న వార్తను గాలిలో తేలివచ్చే కమురు కంపు మోసుకొస్తున్నది. కాలవ కట్ట ఎక్కి వీధిలో కొచ్చాను.

వీధిలో రెండిళ్ళు దాటగానే మస్తాను మిషను చప్పుడు వినవడుతుంది. అది దాటి మరి నాలు గడుగులేస్తే ఎడమవైపున ఒక 'ఆంజనేయ ఆటో వర్క్ షాప్' ఉంటుంది. ఆ తర్వాత అన్నీ మామూలు కాపురాల ఇళ్ళు.

ఆటో వర్క్షాప్‌లో ఏదో వెల్డింగ్ చేస్తున్నాడు ఒకతను. మరోకతను 'నాగూర్‌వలి లారీ సర్వీసు' లారీకింద పడుక్కొని ఏదో రిపేర్ కాబోలు చేస్తున్నాడు.

ఆటోవర్క్‌షాప్ దాటగానే వీధి చివర మూల తిరుగుడునున్న అరుగుల పెంకుటిల్లు కన్పిస్తుంది. ఆ ఇంటి అరుగులమీద కూర్చుని రోజూలాగే ఆమె ఎదురు చూస్తున్నది.

రోజూ అక్కడ అదేవేళకి అరుగు మూలన గోడ కానుకుని—ఒక కాలు అరుగుమీద మడత వేసి రెండో కాలు గొంతుకూర్చున్నట్లుగా పెట్టి ఆ మోకాలుపైన కుడిచెయ్యి పెట్టుకొని అర చెయ్యి చెంప కాన్చుకొని కూర్చొనుంటుంది. పక్కనే ఒక పాత వెదురు కర్ర—తల అంతా పండిపోయి, బొమ్మ దేవుడికి వీచే నింజామరలాగ ఉండేది. నుదురు, ముఖం, అంతా ముడతలువడి నలిపేసిన

కాగితం లాగుంటుంది. ఆమె కట్టుకున్న ధోవతి మాసిపోయి చినుగులుపడి ఉంటుంది—మా స్కూలులో క్లాసుకీ క్లాసుకీ మధ్యనుండే తడికల్లాగా. ఆమె కళ్ళు లోతుకు పీక్కుపోయి—ఎక్కడో నూతి లోంచి చూస్తున్నట్లుండేది. నేను ఆటో వర్క్ షాప్ దాటి, నన్ను చూడగానే దీనంగా ఎండా కాలంలో ఎండిపోయిన నదుల్లాగుండే ఆమె కళ్ళు వర్షం పడగానే చిరునవ్వు నవ్వే ముత్యపు చిప్పల్లాగా—ఒక్కసారి వెలిగేవి.

ఆమె కన్పించగానే నేను అటే చూస్తూ నడుస్తాను, దారి సంగతి మర్చిపోయి. ఆవిడ నా వైపే చూస్తూంటుంది. నేను బాగా దగ్గరికి రాగానే పళ్ళూడటం వల్ల లోపలికి ముడుచుకున్న పెదిమలు మెల్లిగా సాగి చిరునవ్వు నవ్వే ప్రయత్నం చేస్తాయి. అప్పుడు ఆమె నుదుటిమీది గీతలు అడ్డంగా సాగుతాయ్. కణతల దగ్గర గీతలు ఎక్కువై లోతుగా పొడుగ్గా అవుతయ్. లోతుగా ఉన్న కళ్ళు కొద్దిగా ముందు కొచ్చినట్లుగా ఉండి భయం వేస్తుంది చూడటానికి. అప్పుడు నా కేదో కొంచెం బెరుగ్గా ఉంటుంది. గబగబా అడుగు లేస్తూ ఎదురుగ్గా సినిమా హాలుమీద జ్యోతి పట్టుకున్న అమ్మాయి బొమ్మకేసి చూస్తూ నడుస్తాను—వీధి మలుపు తిరిగేదాకా. సరిగ్గా వీధి మలుపు తిరగబొయ్యేముందు—ఎందుకో ఒక్కసారి వెనక్కు తిరిగి చూస్తాను. ఆమె ఇంకా నా వైపే చూస్తూంటుంది— పడమటి లోయ లోకి దిగుతూన్న సూర్యుణ్ణే ఆఖరు సారిగా చూసే పొద్దు తిరుగుడు పువ్వులాగా.

అంతే—ఆమె కను మరుగై పోతుంది.

రోజూ ఇది క్రమం తప్పకుండా జరిగే దిన చర్య.

మూల తిరగ్గానే బామ్మ అన్నంలోకి వెయ్యబోయే చామ దుంపల వేపుడూ— పెరుగూ— తల్చుకుంటూ ఇంటికి నడిచాను.

* * *

క్లాసులో మాష్టారు సిపాయిల తిరుగుబాటును గురించి చెబుతూంటే—నేను బయట చింత చెట్టు కింద ఇసుకలో ఆడుతున్న అమ్మాయిల్ని చూస్తున్నా. బేబీ పిన్ను పళ్ళమధ్య ఇరికించి, గాజులు మోచేతివైపు నెట్టుకుని, ఆట మొదలెట్టింది రేవతితో—పక్క క్లాసుల్లో ఎక్కడ్నుంచో సర్మా సుబ్బయ్య మాష్టారి గొంతు ఖంగుమంటోంది.

నా ఆలోచన్లు అనుకోకుండా—అరుగుల పెంకుటింటి ముందరి ముసలావిడ దగ్గరి కెళ్ళినై.

కళ్ళముందు ముడుతలు పడిన ఆమె ముఖమే కన్పిస్తోంది. రెండు రోజుల్నుంచీ ఆమె అరుగు మీద కన్పించటంలేదు. ఆమె ఎవరో నాకు తెలీదు. ఇన్నాళ్ళనుంచీ రోజూ చూస్తున్నానన్న మాటేగాని ఒక్క మాట మాట్లాడలేదు. రోజూ ఆటోవర్క్ షాప్ దాటగానే ఆవిడ అరుగుమీద కన్పించినప్పట్నుంచీ సినిమా హాలు దగ్గర వీధి మలుపు తిరిగే వరకూ ఆమె నా వైపూ, నేను ఆమెవైపూ చూడటం—అంతే మా పరిచయం. ఆమె నా వైపు ఎందుకలా చూస్తుందో నా కర్థంగాదు. పోనీ— నే నెందుకలా చూస్తానో నాకే తెలీదు. ఆమె అంటే— అదీ ఆమె బోసినోటి నవ్వు చూస్తే నా కేదో బెరుగ్గా ఉంటుంది. అలా అని ఆ దారి మానెయ్యా బుద్ధి పుట్టదు. ఆ దారి వదిలేసి నేను ఫొటో స్టూడియో మీదుగా ఇంటికి పోవచ్చు. ఊహూ సరిగ్గా స్కూలు వదిలే వేళకు అస్పత్రివైపు కాళ్ళు పరుగెత్తుతై నాకు తెలీకుండానే.

గత రెండు రోజుల్నుంచీ—స్కూలు వదిలి వీధిలోకి రాగానే నా కోసమే ఎదురు చూస్తున్నట్లుండే ఆమె, అరుగుమీద కన్పించటంలేదు. మొదటిరోజు ఆమె కన్పించకపోతే ఎందుకా అని ఆలోచిస్తూ ఇంటి కెళ్ళానుగాని— ఇంటి కెళ్ళగానే బాబాయి తెచ్చిన క్రికెట్ బాట్ చూస్తూ అంతా మర్చిపొయ్యాను. ఆ సాయంత్రం అంతా క్రికెట్‌లో మునిగితేలాను. కొత్త బ్యాటు భలే ఉంది. షాట్ కొడితే బాలు గింగిరాలు తిరుగుతూ పోతూంది తుపాకి గుండులాగు.

నిన్న స్కూలు నుంచి వస్తూంటే మళ్ళీ కన్పించలేదు ఆమె. ఏదో వెల్తి అన్పించింది. ఆయిల్లు దగ్గరి కొచ్చిన దాకా అటే చూస్తూ నడిచాను. ఆ యింటి ముందు ఒక్క నిమిషం ఆగాను. లోపలి కెళ్దామనిపించింది. మెట్టుగా ఉపయోగ పడుతున్న పగిలిన బండ మీదికెక్కి నుంచున్నాను. పగిలి బీటలు వారిన తలుపు దగ్గిరగా వేసుంది. అంతా నిశ్శబ్దంగా వుంది. లోపలికెళ్ళటానికి తలుపు మీద చెయ్యి వేశాను. నాకెందుకో భయం వేసింది—గిరుక్కున వెనక్కుతిరిగి ఇంటికి పరుగెత్తాను.

“అలా పరుగులుపెట్టక పోతే కొంచెం నిదానంగా రాకూడదట్రా నాయనా!”అన్నది బామ్మ వగరుస్తూ ఇంట్లోకెళ్ళిన నన్నుచూసి.

నిన్న అంతా ఆమే నాకళ్ళముందు కన్పిస్తోంది. పండిన జుత్తు— నలిపేసిన కాగితం లాగా ముడుతలు పడ్డ ముఖం—చీలికలూ పేలికలూ అయినధోవతి— నిన్నామొన్నా ఎందుక్కని ంచలేదో!

* * *

తొడ చుఱ్ఱుమనగానే ఉలిక్కిపడి పక్కకుతిరిగాను. వాసుగాడు తొడగిల్లాడు—వెధవాయ్! నాకు ఒళ్ళు మండి వాడి పని పట్టబోతుంటే— మాష్టారివైపు చూపించాడు డెస్కుకిందినుంచి. మాష్టారు నావైపే చూస్తున్నారు. క్లాసంతా గొల్లుమంది.

నేను లేచి నుంచున్నా.

“మాట్లాడవేం?” మాష్టారిగొంతు ఖంగుమంది.

నాకేంతెలుసు, ఏం మాట్లాడాలో? ‘ఏమిటండి మాష్టారూ’అన్నా. క్లాసంతా మరోసారి గొల్లుమంది.

“సైలెన్స్! సిపాయిల తిరుగుబాటు ఎప్పుడు జరిగింది?”

నాకెలా తెలుస్తుంది? గుడ్లప్పగించి చూస్తున్నా.

“ఏం?”

“... .. ..”

“ఏంటేగా తెలిసేందుకు, వెదవా! వెళ్ళు. బెంచెక్కు.”

నేను వెధవముఖం వేసుకుని వెనక్కెళ్ళి బెంచెక్కాను.

మాష్టారు పాఠం అందుకున్నారు—

చింత చెట్టుకింద బేబివాళ్ళు లేరు—

ఆమె ఇవాళైనా కనబడుతుందో లేదో—

* * *

స్కూలు వదలగానే నేను బెంచిదిగి వెళ్ళి బాగ్ చంకకు తగిలించుకొని వేణుని కలిశాను. వాడు మామూలు అలవాటు ప్రకారం పరుగెత్తబోయి నేను ఏదోరకంగా ఉండటం చూసి గాబోలు నిదానంగా నడిచాడు. ఇద్దరం ఏమీ మాట్లాడలేదు. అస్పత్రిలో వేపచెట్టుకింద—మంచం తిరగేసి ఎండ తగలకుండా గూడుకట్టి ఎవర్నో పడుకోబెట్టారు. మంచం పక్క ఒక ఆడామె ఇద్దరు మొగవాళ్ళు కూర్చొనున్నారు దిగులుగా—నిశ్శబ్దంగా నడిచాం ఇద్దరం. మొండి గోడదగ్గర వంటగదిముందర సైకిల్‌కట్టు రామ్మూర్తి డేగిసాలో పులుసు పోస్తున్నాడు. మొండి గోడ దాటగానే వేణు ఎడం పక్కకు తిరిగేడు. నేను కాలవ లోకి దిగాను. కుడి పక్కన ఎవరిదో కాలిప్లాస్టర్ తీసేశారు గాబోలు — పడున్నది. మూలన పోస్టుమార్టం గదిదగ్గర ఎవరో తిరుగుతున్నారు.

కాలవ కట్ట ఎక్కి వీధిలోకొచ్చాను. మస్తాను మిషన్ శబ్దం వినిపించడంలేదు. మిషన్ దగ్గరగా నేలమీద పరిచిన ఈతచాప మీద కూర్చొని అబ్దుల్లా చొక్కాకాజాలు కుడుతున్నాడు. వీధిలో నేను తప్ప మరెవరూ లేరు. ఆంజనేయ ఆటోవర్క్‌షాప్‌లో బోనెట్ పైకెత్తిన లారీ ఒకటి నోరు తెరిచిన భూతంలా ఉంది. అంతా నిశ్శబ్దం.

షాపు దాటగానే నాదృష్టి అరుగుల పెంకుటింటి మీదికి పోయింది. అరుగులు ఖాళీగా ఉన్నై. ఇవాళ కూడా ఆమె లేదు. నాకేదో వెల్తి అనిపించింది. అటేచూస్తూ నడిచాను. అడుగడుక్కీ ఆమె కన్పిస్తుందేమోనన్న ఆశతో. ఉన్నట్లుండి ఒక్కసారిగా అరుగుమీద ప్రత్యక్షం కాగూడదూ ఆమె! ఊహూ. ఆమె కన్పించలేదు.

ఇంటి దగ్గరి కొచ్చాను. అంతా నిశ్శబ్దం. వీధిలో ఆమూల సినిమాహాలు దగ్గర్నించి యీచివర అస్పత్రి దాకా ఎవరూలేరు. దూరాన సినిమాహాలు గోడ మీద జ్యోతి పట్టుకున్న అమ్మాయి బొమ్మ ఎండలో నల్లగా నిగనిగలాడుతూంది. మెట్టులాంటి పగిలిన బండమీద అడుగు పెట్టాను. పగిలి నెర్రెలు వాసిన వీధితలుపు ఓరగా తీసిఉంది. గొళ్ళెం ఒకటి పగులు లోంచి వదులుగా వేలాడుతోంది. ఏదో భయమేసింది. మళ్ళీ వీధి యీచివరనుంచి ఆచివర దాకాచూశాను. ఎవరూలేరు. ధైర్యంచేసి, పుస్తకాలనంచి గట్టిగా పట్టుకొని లోపలికడుగెట్టాను. కుడివైపున గిలక బావి. గిలక సగం పగిలిపోయి ఉంది. బావి అంచు ఒకమూల విరిగిపోయింది. ముళ్ళువేసిన కొబ్బరినార తాడు చివర సొట్టలుపడ్డ బొక్కెన. పెంకువసారా లోనుంచి గుమ్మం దగ్గరికి నడిచాను. లోపల్నించి సన్నని జీరగొంతుతో ఏవో మాటలు విన్పించాయి—

“ఏదో—కాలూ చెయ్యీ ఆడక—నా తాపత్రయమే కాని—ఏదో నా పిచ్చి—లేకపోతే నువ్వు ఇక్కడి కొస్తే ఏంగాను—నీ పరువు పాడైపోదూ— వద్దు—వద్దు—యీ కొట్టే ఎలాగో వెళ్ళిపోతుంది. దీనికోసం దిగులుపడకు—నువ్వు నాలుక్కాలాలు చల్లగా—ఉండటమే—అదే పదివేలు. ఏదో కన్న— తీపిగాని— ..... ”

నేను మెల్లిగా తలుపు నెట్టాను. కిర్రుమని ఏడుస్తూ తెరుచుకుంది తలుపు—లోపల కుక్కి మంచం ఒకటి జోలెలా వేలాడుతోంది. అందులో ఉండీ లేనట్టున్న దుప్పటిమీద ఆమె .!! తలక్రింద ఏదో పాత గుడ్డలమూట దిండుగా ఉపయోగ పడుతున్నది.

"నీవు కడుపున పడగానే ఆ మహారాజు దాటి పొయ్యారు. నీమీది ఆశతో— కళ్లలో ప్రాణాలుంచుకుని—నీకోసం—"

ఆయాసంవచ్చి ఆగింది—

మంచంకింద చిలుంపట్టిన కంచు చెంబూ—సొట్టలుపోయిన సత్తు కంచం—మూలన బూడిద నిండిన పొయ్యీ—పాత గిన్నెలు రెండు—అంచు పూర్తిగా విరిగిన ఇత్తడి బిందె

నేను దిక్కుతోచక అలాగే చూస్తూ నుంచున్నా

ఏదో తల్లి దయవల్ల నీకు—అక్షరం ముక్క అబ్బింది—అంతే ఆశతోనే—ఏనాటికైనా నా కష్టాలు — గట్టెక్కుతాయనే ఆశతో—బతికా నాయనా—నా ఖర్మ—లేకపోతే— కన్న కొడుకు ఇంతవాడివైతే—కనుచూపే కరువైంది నాకు—ఏజన్మలో ఏ పాపం చేశానో—ఏ తల్లీ కొడుకుల్ని విడదీశానో.

ఎండిపోయిన చెరువుల్లాంటి ఆమె కళ్లలోంచి కొసలగుండా కణతలమీదికి నీరు కారుతున్నది.

నల్ల కుక్కపిల్ల ఒకటి మంచం చుట్టూ తిరుగుతున్నది దిగులుగా—

నాకు దిగులేసింది—

"ఏమండీ !" అన్నా జీరపోయిన గొంతుతో—

"నీకు మాత్రం—యీ తల్లిని—చూడాల నుండకనా ! ఏదో నా వైరిగాని—నీ వుద్యోగం—సంసారం —ఎన్ని పనులో—ఎన్ని చికాకులో—నీకు తీరికగాని—"

దగ్గు తెర వచ్చింది.

"ఏమండీ !!" కొంచెం గట్టిగా అన్నా గొంతు పెగుల్చుకుని—

నెమ్మదిగా కళ్లు తెరిచింది ఒక్క క్షణం ఆగాక నన్ను పోల్చుకుంది గాబోలు లోపలికి ముడుచుకున్న పెదిమలు మెల్లిగా చిరునవ్వు నవ్వడానికి సాగేయి

కప్పులో పెంకులు రాలిపోయి— అక్కడక్కడా సూర్యరశ్మి గుండ్రంగా కత్తిరించిన సీనారేకు బిళ్లల్లా— నేలమీద పడి మెరుస్తోంది. ఒకమూల గోడనుంచి సున్నపు బెత్తిక రాలి పడింది—పాత కాగితంమీది సిరాచుక్కలాగ—

ఆమెను చూస్తూంటే స్కూలు లాబొరేటరీలో ఉన్న అస్థిపంజరానికి ఈ ధోవతి కట్టబెడితే ఇలాగే ఉంటుందనిపించింది.

ఇల్లు అంతా వాసన—

తెరిచిన కళ్లు మూసుకుపొయ్యాయి—

"అంతా నీలాగే—ఉండేవాడు—అవే కళ్లు—"

మళ్లీ దగ్గుతెర—మెలికలు తిరిగిపోతున్నది—

చెయ్యి నోటిదగ్గర పెట్టుకొని మంచినీళ్లన్నట్టుగా సైగ చేసింది.

పుస్తకాల బాగ్ కిందుంచి నేను చిలుం పట్టిన కంచు చెంబు తీసుకొని— బావి దగ్గరికి పరిగెత్తా ఆ బొక్కెన అంతా చిల్లులుపడి— పైకి వచ్చేసరికి సరిగా చెంబునిండా గూడా రాలేదు నీళ్లు— చెంబు తీసుకువచ్చేసరికి, దగ్గుతెర తగ్గిందేమో మళ్లీ తనలో తనే మాట్లాడుకుంటున్నది.

"నీకోసం గదూ— నే బతికింది— ఎవరెన్ని అంటేనేం— నీకు తెలీదూ— నేనేదో చేశానని అంటారుగాని— నా కన్నతండ్రిని—నీకోసం—నేనేం చేస్తే తప్పవుతుంది—"

మళ్లీ దగ్గుతెర— వూపిరాడకుండా ఈసారి. దగ్గుతూంటే బొళుక్కున నెత్తురుపడి గుడ్డంతా [illegible] అయింది.

అర్ధాంతరన్యాస

నాకు భయమేసింది— కంచుచెంబు అక్కడ పెట్టి—పుస్తకాల బాగ్ తీసుకు పరుగెత్తా.

ఇంటికివచ్చి బామ్మకు ఒక్క గుక్కలో అంతా ఏకరువు పెట్టాను.

"అబ్బబ్బ—అడ్డమైన కొంపలకూ తిరగడం ఎక్కడ అబ్బిందిరా నాయనా నీకూ! అమ్మా, నాన్నా దూరా నెక్కడో ఉన్నారుగదా అని ఇక్క డుంచితే —ఆ పాడుకొంప కెళ్లడానికేం ఖర్మ పట్టిందిరా నీకు ! ఎవరి ఖర్మాన వాళ్లు పోతారు. నువు రా కూటికి— చేసినపాపం వూరికే పోతుందా ! అనుభవించొద్దూ—నువ్వు పద—ఈసారి అటు మొహం చూపావంటే బాబాయికి చెప్పి తాట ఒలిపిస్తా— పద." అంటూ అన్నం దగ్గరికి లాక్కెళ్లింది.

* * *

అన్నం తిని స్కూలు కెళ్లినా—స్కూలు వదిలిందాకా నా మనసెలాగో ఉంది. స్కూలు వదలగానే వస్తూ బామ్మ చెప్పిందంతా గాలికి వదిలేసి— ఆ యింటిదగ్గరి కొచ్చేసరికి— కాళ్లు యాంత్రికంగా లోపలి కెళ్లాయి.

మధ్యాహ్నం నే నెలా వదిలానో అంతా అలాగే ఉంది. కంచుచెంబు దొర్లి— సగం నీళ్లు గచ్చుమీద ఆరిపోయినై. మంచం మీద ఆమె అలాగే కళ్లు సగం మూసి పడున్నది. ధోవతిమీది రక్తం ఇంకిపోయి ఈగలు వాలుతున్నై. సగం తెరుచుకున్న నల్లటి పెదిమలమీద ఈగ ఒకటి— నల్లటి బక్కచిక్కిన కుక్కపిల్ల ఎండిపోయిన ఆమె రొమ్ముమీద తల ఆన్చి కుయ్యోమని ఏడుస్తున్నది

నే నక్కడ నుంచోలేక పరిగెత్తా—

* * *

సాయంత్రం బామ్మ యిచ్చిన కాఫీ తాగి— వీధి గుమ్మం మెట్లమీద అరచేతుల్లో గడ్డం ఆన్చి కూర్చున్నా. మనసేమీ బాగోలేదు — ఆడుకోవాలని బుద్ధి వెయ్యలేదు.

ఎదురింటి రుక్మిణమ్మగారు "ఏరా కృష్ణా ! ఆడుకుందుకు వెళ్లలేదూ ?" అడిగిన ప్రశ్నకు సమాధానం చెప్పలేదు.

ఆవిడ శంకరస్తుతిలో మునిగిపోయింది.

చీకటి పడుతూంది వీధి దీపాలు వెలిగించారు.

నా ఎదురుగా నీడ పడేసరికి తలెత్తాను. వేణు—


బిక్కమొగం వేశాడు. "ఏమిట్రా యిది ?" అన్నా వాడి చెంప చూసి.

"మా నాన్న కొట్టాడు" అన్నాడు వాడు తలదించుకుని.

"ఎందుకు ?" నాకు వాళ్ల నాన్నమీద ఖలేకోపమొచ్చింది. ఈ పెద్దవాళ్ల కసలు బుద్ధిలేదు !

"పొద్దున నేను స్కూలునుంచి వెళ్తూంటే— ఎవరో "మునసబుగారి తల్లికి బలువుగా ఉందిటగా" —అనుకుంటున్నారు. నే నింటికి వెళ్లి మా నాన్న నడిగాను. మా నాన్న 'ఏడ్చావ్ వెధవా, నోర్మూయ్! అవ్వీ నీకే గావాలి ' అంటూ చెంపమీద కొట్టాడు."

వీధి దీపం వెల్తుర్లో తెల్లటి వాడి చెంపమీద నాలుగు వేళ్లు—నల్లగాకంది కాయల్లా మెరిసినై. ★





కనకదుర్గ

వేల్పులకైనా మార్పులు తప్పవు

మహేష్

(గత సంచిక తరువాయి)

లింగపురాణం

దక్షయాగమందు దగ్ధమైపోయిన సతీదేవి, పార్వతియై జన్మించి మరల శివుని భార్య అయినది. వ్యాసుడు తనకు వరుసగా ఏడురోజులు భిక్ష దొరకకపోవడంవలన కాశీ నగరాన్ని శపించబోవుచుండగా, అన్నపూర్ణాదేవి అతనని మందలించింది.

బ్రహ్మపురాణం

పరబ్రహ్మ తన వామ భాగమునుంచి ప్రకృతి అనే పరాశక్తిని సృష్టించి ఆమె సహాయముతో త్రిమూర్తులను సృష్టించెను.

శివపురాణం

ప్రకృతి పురుషులలో పురుషుడే అధికుడనే అహంభావం శివునకు కలగగా, పార్వతి యుక్తిచే ఆ అహంభావాన్ని పోగొట్టింది.

వామనపురాణం

పార్వతీ పరమేశ్వరుల విలాస సమయంలో దేవతలు సందడి చేయగా, పార్వతి కోపించి దేవతలను అనపత్యులు కావలసినదిగా శపించెను.

మత్స్యపురాణం

పరాశక్తితో కూడిన పరబ్రహ్మ త్రిమూర్తులకు ప్రత్యక్షమై వారికి కర్తవ్యం ఉపదేశించెను. పరదేవతా పూజాఫలం మొదలైనవి కూడా ఇందులో వర్ణింపబడ్డాయి.

బ్రహ్మాండపురాణం

జలమయమైన భూమిని ఉద్ధరించి పరాశక్తి బ్రహ్మను అనుగ్రహించినది. దక్షయజ్ఞంలో దగ్ధమైపోయిన సతీదేవి, పార్వతియై జన్మించగా ఈశ్వరుడు ఆమెను పెండ్లి చేసికొనుట, కుమారస్వామి జన్మించుట మొదలైనవి ఇందులో వర్ణింపబడినాయి.

నారసింహపురాణం

అంధకాసురుడు పార్వతీదేవిని చూచి మోహపరవశుడుకాగా ప్రహ్లాదుడు అతనికి దేవీ మహాత్మ్యమును విశదపరచి హితోపదేశం చేసేడు. మహిషాసుర సంహార వృత్తాంతం కూడా ఇందులో వర్ణింపబడింది.

బ్రహ్మవైవర్తపురాణం

పరబ్రహ్మకుగల స్త్రీ శక్తియే పరాశక్తియై లోక సృష్టికి కారణమైనది. ఆ పరాశక్తియే త్రిదేవుల రూపంతో త్రిమూర్తులకు భార్య అయినది. శంఖచూడుడు పార్వతిని మోహించి నశించుట మొదలైనవి ఇందులో వర్ణింపబడినాయి.

స్కాందపురాణం

దక్షయాగం, పార్వతీ పరిణయం, చిత్రరథుని పార్వతి శపించుట, పార్వతీ పరమేశ్వరులు కలహించుట మొదలైనవి ఇందులో వర్ణించబడ్డాయి.

దేవీభాగవతం

యోగ మాయారూపిణి అయిన దేవియొక్క సహాయంవలన విష్ణువు, హయగ్రీవ మధుకైటభ రాక్షసులను సంహరించడం, భువనేశ్వరీ మహాత్మ్యం, దేవీపూజాక్రమం, విద్యా, అవిద్యారూపిణి అయిన దేవి వర్ణన, మహిషాసురవధ, క్షామ సమయంలో దేవి శాకంభరియై అవతరించడం మొదలైనవి ఇందులో వర్ణింపబడ్డాయి.

మార్కండేయపురాణం

ఇందులో దేవియొక్క అవతారాలు వర్ణించబడినాయి. దేవి అవతారాలు (1) మాయాదేవి. ఈ అవతారంలో మధుకైటభ రాక్షసులను జయించుటలో విష్ణువునకు సహాయం చేసినది. (2) మహిషాసురమర్దని. ఈ అవతారంలో సింహవాహనయై మహిషాసురుని సంహరించినది. (3) కాళికాదేవి. ఈమె చండ, ముండ, శుంభ, నిశుంభాది రాక్షసులను సంహరించినది. (4) యోగమాయయై నందుని ఇంట జన్మించినది. (5) రక్తదంతి (6) శాకంభరి (7) దుర్గ (8) మాతంగి (9) భ్రామరి.

శక్తి

దేవీ పురాణంలో చెప్పబడిన అవతారాలు దుర్గ, శాకంభరి, వింధ్యవాసిని, కౌశికి, చాముండ, చండి. పార్వతి, వైష్ణవి, యోగనిద్రా, దాక్షాయణి అంబికా,

భవిష్యోత్తరపురాణం

మహాదేవి, యశోదా గర్భమున జన్మించి, తన పాదాన్ని కంస రాక్షసుని శిరస్సుమీద ఉంచి, అతనిని చంపివేసినది. వివిధావతారధారిణి అయిన ఆ దేవిని దేవ మానవగంధర్వ కిన్నెరాదులు భక్తితో సేవించెదరు.

దేవీపురాణం

జయ, విజయ, అజిత, అపరాజిత మొదలైన వారితో కూడిన దేవి, విష్ణువర గర్వితుడైన ఘోరాసురుని వింధ్య పర్వతంవద్ద సంహరించినది. దేవీ పూజా ఫలితం ఇందులో వర్ణించబడింది. సింహం, వానరం, వృషభం, హంస, మయూరం, గరుడుడు, మహిషం, గజం, పద్మం, మృతదేహం ఇవి దేవి వాహనాలుగా వర్ణింపబడినాయి. దేవికిగల వివిధ నామాల, అర్థాలు, పూజాక్రమం మొదలైనవి ఇందులో విపులంగా వివరించబడినాయి.

కాళికాపురాణం

బ్రహ్మచే ప్రార్థితులైన విష్ణు మాయ దక్షపుత్రిగా జన్మించి శివుని భార్య అయినది. దక్షయాగము, సతీదేవి పార్వతియై జన్మించడం మొదలైనవి వర్ణించబడినాయి.

మహాభాగవతపురాణం

సహస్ర బాహువులతో ప్రత్యక్షమైన దేవిని వ్యాసుడు స్తోత్రం చేయగా దేవి వ్యాసునకు ఈ పురాణాన్ని అనుగ్రహించింది. సతీదేవి దక్షయాగంలో దగ్ధం కావడం, పార్వతీదేవిగా జన్మించడం వర్ణింపబడినాయి. కాళీ, తారా ఛిన్న మస్తా, భువనేశ్వరీ, బగళా, ధూమావళి, త్రిపుర సుందరి మాతంగి షోడశి, భైరవి అనే దశ మహా విద్యారూపాల్ని దేవి ధరించినట్లు చెప్పబడింది. వశిష్టుడు రామ లక్ష్మణ భరత శత్రుఘ్నులకు దేవీ మంత్రం ఉపదేశం చేయడం రామ రావణ యుద్ధంలో అనేక విపత్సమయాల్లో రాముడు దేవిని ప్రార్థించి ఆమె అనుగ్రహం వలన రావణుని సంహరించడం వర్ణించబడింది.

బృహద్ధర్మపురాణం

పరాశక్తి, దక్షసుతగా జన్మించడం, సతీ శివుల పరిణయం, దక్షయాగం పార్వతీ పరిణయం, దేవియొక్క దశ మహా విద్యా రూపాలు ఇందులో వర్ణించబడ్డాయి.

నందికేశ్వర, బృహన్నందికేశ్వర, శారదా, వాయవీయ ఉప పురాణం మొదలైన వాటిలో దేవి మహాత్మ్యం వర్ణించబడినట్లు ఇతర గ్రంథాల్లో చెప్పబడింది. ఈ పురాణాలు ఎక్కడా దొరకడం లేదు. అర్జునుడు మొదలైనవారు విజయం కోసం దేవిని స్తోత్రం చేసినట్లు భారతంలో చెప్పబడింది. శక్తి హిమ వత్పుత్రియై జన్మించడం మొదలైనవి రామాయణంలో వర్ణించబడ్డాయి.

బహ్వృచోపనిషత్

దేవియే యీ జగత్తును సృష్టించినది. ఆమె వల్లనే బ్రహ్మ విష్ణు రుద్రులు సకల మరుద్గంధర్వాప్సర కిన్నరాదులు, స్థావర జంగమములు ఉద్భవించినవి. ఆమెయే కామకళ, శృంగారకళ అని పిలువబడుచున్నది. పంచ దశాక్షరీ విద్య, షోడశీ విద్య మొదలైనవాటిని గురించి కూడా ఇందులో చెప్పబడింది.

త్రిపురోపనిషత్

ముక్తికోసం శ్రీ చక్రారాధన మొదలైనవి యిందులో నిర్దేశించబడినాయి. ఈ ఉపనిషత్తు వామాచారాన్ని బోధిస్తున్నది అని కొంతమంది

అభిప్రాయం, కాని దీనికి బలమైన ఆధారాలు కన్పించవు.

దేవ్యుపనిషత్

దేవి నుంచియే ప్రకృతి పురుషాత్మకమైన జగత్తు, శూన్యాశూన్యములు ఉద్భవించుచున్నవి. ఆమెయే ఆనందా నానందములు. ఆమెయే విజ్ఞానా విజ్ఞానములు. శ్రీ మహావిద్యా ప్రభావం మొదలైనవి కూడా ఇందులో వర్ణింపబడినాయి.

రుద్రహృదయోపనిషత్

జగత్కారణమైన పుల్లింగము శంకరుడు కాగా, స్త్రీలింగము ఉమ అగుచున్నది. ఉమాశంకర యోగమే విష్ణువు. ఉమారూపము వ్యక్తము. మహేశ్వర రూపము అవ్యక్తము.

భావనోపనిషత్

నవరంధ్ర రూపమైన దేహానికీ, నవశక్తి మయమైన శ్రీ చక్రానికీ ఇందులో సమన్వయం సాధించబడింది. ఇందులో శ్రీ చక్ర తత్వము, ఆరాధనా క్రమం మొదలైనవి వివరంగా వర్ణింపబడ్డాయి.

త్రిపుర తాపిన్యుపనిషత్

శివశక్త్యాత్మకమైనదే పరబ్రహ్మ. శ్రీ చక్ర తత్వము, ఆరాధన క్రమము మొదలైనవి ఇందులో కూడా వర్ణింపబడినాయి.

నిర్ణయ సింధువులలో దేవీ పూజాక్రమం చెప్పబడింది. బెంగాల్, మిధిలా ప్రాంత వాసులు నిబంధాలను అనుసరించి దేవిని పూజిస్తారు. దేవీ పూజా విధానాన్ని చెప్పిన గ్రంధాల్లో రూప నారాయణుడు రచించిన దుర్గోత్సవ పద్ధతి, విద్యాపతి యొక్క దుర్గా భక్తి తరంగిణి ముఖ్యమైనవి.

సాధకుడు దీక్షావ్రతుడై త్రిపురసుందరీదేవిని ఆరాధించవలెను. ఈ దీక్ష మూడు విధాలు. (1) మహాపద్మవనంలో శివుని తొడమీద శుద్ధ సత్వాత్మక మూర్తియై యున్న దేవిని యేకాగ్రచిత్తంతో ధ్యానించుట. (2) శ్రీ చక్రపూజ. (3) దేవీ తత్వ జ్ఞానము. శక్త్యారాధన మార్గం రెండు విధాలు.

వేల్పులకైనా మార్పులు

(1) కులమార్గం. (2) సమయమార్గం. ఇందులో కులమార్గం వామాచారానికి సంబంధించినది. దేవిపూజలో పాల్గొంటున్న జనులు ఏ కులానికి చెందినా, పూజా సమయంలో బ్రాహ్మణత్వాన్ని పొందుచున్నారు. పూజానంతరము తిరిగి వారివారి కులాలను పొందగలరు అని శాక్తేయుల అభిప్రాయం. దేవ్యారాధకులకు దేవీ నవరాత్రులు చాలా ముఖ్యమైనవి.

శాంభవ దర్శనం

శివుడు, శక్తియే జగత్కారణము. శివుడు తేజోరూపుడై శక్తియందు ప్రవేశించగా బిందువు ఉద్భవించుచున్నది. శక్తి శివునియందు ప్రవేశించగా బిందువు వృద్ధిచెంది నాదం ఉద్భవించుచున్నది. తుదకు నాదబిందు సంయోగమువల్లనే జగత్తు ఉద్భవించుచున్నది. సృష్టికి పురుషుని ఆవశ్యకతను గుర్తించినా, శాక్తేయులు శక్తికే ప్రాధాన్యతను యిస్తారు. శక్తితో తాదాత్మ్యాన్ని పొందడమే శాక్తేయుల లక్ష్యం. జగత్కారణమైన శక్తి స్త్రీయే కాబట్టి ప్రపంచమంతా స్త్రీత్వాన్ని పొందడమే లక్ష్యమని శాంభవ దర్శనం యొక్క అభిమతం.

తంత్ర గ్రంధాల్లో దేవి, లలిత, త్రిపురసుందరి, ఆనందభైరవి అనే పేర్లతో వర్ణించబడింది. అమృత సముద్రంలో మధ్యనున్న కదంబ వనంలో రత్నఖచితమైన మండపం ఉంది. ఆ దివ్య మండపంలో చింతామణి మయమైన భవనంలో ఆనంద భైరవీదేవి నివశిస్తుంది. బ్రహ్మ, విష్ణువు, రుద్రుడు, ఈశ్వరుడు ఆమె సింహాసనం యొక్క కాళ్ళు. శివుడే ఆనందభైరవుడు, మహాభైరవుడనే పేర్లతో ఆమె మనోహరుడు అగుచున్నాడు. ఇందులో మహాభైరవి సృష్టికి, మహాభైరవుడు సంహారానికి కర్తలు.

తంత్ర గ్రంధాల్లో చెప్పబడిన త్రిపురసుందరికి, బౌద్ధ గ్రంధాల్లో వర్ణింపబడిన, అవలోకితేశ్వరుని శక్తియైన తారాదేవికి, జైన గ్రంధాల్లో వర్ణింపబడిన శాసన దేవతకు చాలా పోలికలు ఉన్నాయి.

దేవి విగ్రహాలను సౌమ్యరూప విగ్రహాలనీ, ఉగ్రరూప విగ్రహాలనీ రెండు విభాగాలుగా విభజించవచ్చును. ఉమ, పార్వతి, గౌరి, లలిత, అన్నపూర్ణ మొదలైన విగ్రహాలు సౌమ్య విగ్రహాలు. దుర్గ, చాముండి, కాళి మొదలైన విగ్రహాలు ఉగ్రరూప విగ్రహాలు. నవదుర్గలలో కూడా కొన్ని సౌమ్య రూపాలు ఉన్నాయి అని కొందరి అభిప్రాయం. వీరిమతంలో నవదుర్గల పేర్లు (1) శైలపుత్రి (2) బ్రహ్మచారిణి (3) చండఘంట (4) కూష్మాండ (5) స్కందమాత (6) కాత్యాయని (7) కాళరాత్రి (8) మహాగౌరి (9) సిద్ధిధాత్రి.

నవదుర్గలు పూర్తిగా ఉగ్రరూపాలే అని మరికొందరి అభిప్రాయం. వీరి అభిప్రాయానుసారం నవదుర్గల పేర్లు : (1) ఉగ్రచండ, (2) ప్రచండ, (3) చండోగ్ర, (4) చండనాయిక (5) చండ (6) చండవతి, (7) చండరూప (8) అతిచండిక, (9) రుద్రచండ. ఈ పేర్లే దేవి రూపాన్ని వ్యక్తం చేస్తున్నాయి.


సాధారణంగా శక్తి విగ్రహాలు శైవ చిహ్నాలనే ధరించి ఉంటాయి కాని అక్కడక్కడ వైష్ణవ చిహ్నాలను ధరించిన విగ్రహాలు కూడా ఉన్నాయి. ఇందులో భద్ర అనే రూపంలో దేవి విష్ణు సహోదరిగా వర్ణింపబడుతుంది. శక్తి విగ్రహాల్లో మహిషాసురమర్దని విగ్రహం ప్రసిద్ధమైనది. మార్కండేయ పురాణంలో ఉన్న దుర్గా సప్తశతిలోని దేవి వర్ణనను అనుసరించి యీ విగ్రహాలు చెక్కబడుతుంటాయి. ఉదయగిరి, మహాబలిపురం, భేటా మొదలైన చోట్ల ఉన్న దేవి విగ్రహాలు ప్రసిద్ధమైనవి. మొట్టమొదట ఉండిన సప్త మాతృకలే, దేవి అవతారాలుగా మారేయి అని కొందరి అభిప్రాయం.

రాక్షసులను సంహరించే సమయంలో దేవిని సింహవాహనగా వర్ణించడానికి కారణం ఆమె అవక్ర పరాక్రమమే కారణం అని కొందరి అభిప్రాయం. దేవి సింహవాహనానికి ఆకాశమందు ఉన్న నక్షత్రాలకు సంబంధం ఉన్నదని మరి కొందరి అభిప్రాయం. ఈ విషయం తారల తమాషాలు అనే ప్రత్యేక వ్యాసంలో వివరించబడుతుంది.

జరతుష్ట్ర మతంలో "పార్వతల్" అనే పేరుతో వ్యవహరింపబడుచున్న శుక్ర గ్రహమే పార్వతీదేవిగా భావింపబడుతుంది. దేవికి గల అనేక నామాల్లో 'ఉమ' ప్రసిద్ధమైనది. దీని పోలికలు బాబిలోనియా మాతృదేవత అయిన "ఉమ్మ" సిధియన్ దేవత "ఒమ్మో" ఆర్కేడియన్ దేవత "ఉమ్మి" ద్రవిడ దేవత అయిన "అమ్మన్" అనే పేర్లలో కన్పిస్తుంది. హవిష్కుడి కాలంలో ఉమ "ఒమ్మో" గా వ్యవహరించబడింది

త్రిదేవులలో సరస్వతి జ్ఞానానికి, లక్ష్మి సంపత్తునకు అధిదేవతలు కాగా పార్వతి సౌభాగ్యానికి అధిదేవత అయి సర్వమంగళ అయినది. అటువంటి సర్వమంగళ ఆంధ్ర సచిత్ర వార పత్రిక పాఠకులకు సర్వ మంగళముల నొసగి సర్వదా సంరక్షించుగాక!

వచ్చేవారం - విష్ణువు



ఆశ్చర్యకరమైన క్రొత్త ఫార్ములా



పెప్సోడెంట్ యొక్క అద్భుతమైన నురుగు మీ పళ్లను మెరిసేలా తెల్లగా చేస్తుంది

ఎలా అంటే: క్రొత్త ఫార్ములా ప్రకారము తయారైన పెప్సోడెంట్‌లో మాత్రమే అద్భుతమైన నురుగును యిచ్చే 'ఇరియమ్-ప్లస్' చేర్చబడినది. ఈ అద్భుతమైన నురుగు పళ్లను పాడుచేసే పసుపు వచ్చని పొరను తొలగిస్తుంది. మీ పళ్లు సహజమైన తెల్లదనముతో మెరుస్తూ ఉంటాయి... మీ నోరు పెప్పర్‌మింట్ రుచితో పరిశుభ్రముగా ఉంటుంది.



హిందూస్థాన్ లీవర్ లిమిటెడ్ వారిచే భారతదేశములో తయారుచేయబడుచున్నది

JWT-HDL-3469

అపస్వరం

మూలం: త్రివేణి

అనువాదం: శర్వాణి

జరిగిన కథ

తల్లిదండ్రులిద్దరూ పోయి అనాథ అయిన మీరను పెదనాన్న శ్రీ కృష్ణయ్యగారు చేరదీస్తారు. చదువులోనూ, ఇతర విషయాల్లోనూ ఎంతో చురుకుగా ఉన్న మీరకు పెదతల్లి ఆటంకం చేస్తూ ఉంటుంది. కొన్నేళ్లు గడుస్తాయి. మీర అన్న గోపి డాక్టర్ పూర్తి చేస్తాడు. మీర కూడా కాలేజిలో చేర్తుంది. తను కూడా డాక్టర్ చదవాలనుకుంటుంది. రాధ, గోపాలం దంపతులవుతారు. శాము, మీరలు పరస్పరం ఆకర్షించుకొంటారు. శాముతో మీరకు వివాహం జరిగిపోతుంది. మీర అత్తవారింటికి వెళ్తుంది. కాని లోలోపల డాక్టరవ్వాలనే కోరిక బలవత్తరమవుతుంటుంది.

7

పల్లె సమీపానికి రాగానే, చుట్టూవున్న తమ పరిచేలను, మీరకు చూపించసాగాడు శాము. పొలాల్లో పని చేస్తున్న రైతులు, పని మానేసి కొత్త అమ్మగారి దర్శనార్థం బండి వెనుకనే నడవసాగారు. మీర సిగ్గుతో కుంచించుకపోయింది.

పల్లె చేరేసరికి మధ్యాహ్నం పదకొండు గంట అయింది.

ఆ పల్లెకంతా శాము ఇల్లే పెద్దది. ఆ పెద్ద భవంతికి కాంపౌండుకు మారుగా ముళ్ళ తీగెను ఇంటి చుట్టూ అల్లారు. పారిజాతాలు, సన్నజాజులు, మల్లె, చేమంతి చెట్లు పుష్పాలు తమ యజమానురాలికి సౌరభపు కానుకను అర్పిస్తూ, స్వాగతమిచ్చాయి.

ఇంటిముందు ఆడవారు పిల్లలు పెద్ద గుంపుగా చేరారు. బండి రాగానే శాము భార్యను చూడాలన్న కుతూహలంతో అందరూ ముందుకొచ్చారు.

బండిలోనుండే అంతమందిని చూసి, పూ—

"అబ్బో ఎంతమంది! బయటికి ఎలా రాను! సిగ్గేస్తోంది నాకు" అంది.

"సిగ్గెందుకూ? ఊరంతా వచ్చింది నిన్ను చూట్టానికే మరి."

"నేనేమి జూలో జంతువునా అలా చూడటానికి?"

"ఇప్పటికంతే అనుకోవాలి మరి."

శాము క్రిందికి ఉరికాడు. పండు ముత్తయిదువ ఒకామె,

"కులాసానా శామన్నా?" అనడిగింది.

"ఇదిగో ఇలా ఉన్నానవ్వా"

"నీ భార్యను చూపించు నాయనా, అందుకే కాచుకున్నాం."

మీర తను వేసుకున్న మఖమల్ స్లిప్పర్సు తీసి, కింద వదలేసింది. కొంగు నడుముకు బిగించి దేముడిమీద భారం వేసి, క్రిందికి దూకింది. మీర దిగగానే అందరూ ఆమెను చుట్టుముట్టారు.

"అత్తింటి నగలు ఏవి?"

"పుట్టింటివారు ఏం పెట్టారు?"

"కట్టుకున్న చీర ధర ఎంత?" అని ప్రశ్నల వర్షం కురిపించారు అమ్మలక్కలు.

అవధానిగారమ్మాయి, వెంకూ, అర్చకులమ్మాయి శారద మీరకు హారతిచ్చారు. ఇంకొకామె కొబ్బరికాయ దిష్టితీసి పగలగొట్టారు.

అవధానిగారి భార్య సాకమ్మగారు,

"ఎంతయినా బస్తీపిల్ల పీలగానే ఉంది" అన్నారు.

"అయితే మాత్రమేం సాతక్కా, ఆ రంగు చూడు. మొహంలో కళ చూడు. బంగారు బొమ్మలా ఉంది."

"సర్లే పనీ పాటా లేక ఇంట్లో అలాగే ఉంటుంది మరి. మనాళ్లో చెరువునుండి నీళ్ళు మోయటం పొలాలకు తిరగటం చెయ్యనీ! అప్పుడు అసలు రంగు బయటపడుతుంది."

"చాల్లే ఆమెందుకు నీళ్ళు మోస్తుంది? రాజాలాటి భర్త శామన్న. నీళ్ళు మోయనిస్తాడా? రాణీలా చూసుకుంటాడు."

మీర నెమ్మదిగా అందరిని తప్పించుకొని ఇంట్లోకి అడుగు పెట్టింది. అంత పెద్ద భవంతిని ఆశ్చర్యంతో చూడసాగింది. వెళ్ళగానే పెద్ద వరాండా. రెండు వేపులా రెండు గదులు. సుమారు రెండు వందలమంది భోజనాలు చేయదగ్గ విశాలమయిన హాలు. దానికి రెండువేపులా వరసగా గదులు. మండువా వెనుక లోగిలిలో ఎనిమిది స్తంభాలు అటువేపున నుయ్యి. గుడ్డలుతికేరాయి. లోగిలి దాటి వెడితే విశాలమైన భోజనాల గది, దేవుని గది, వంట గదులు. ఇంటి వెనుక భాగంలో పశువులపాక. అందులో కామధేనువుల్లాటి ఆవులు, దూడలు, గేదెలు ఒక వేపున వంద బస్తాలు పట్టే నాలుగు పాతరలు......

మీర మైసూరులో నాజూగ్గావున్న ఇళ్ళనే చూసిందిగాని ఇలాటి పెద్ద ఇళ్ళని చూసి ఎరుగదు.

సందడి తగ్గేదాకా మీర వంటగదిలో కూర్చుంది. శాము హాల్లో కూర్చుని అందరి ప్రశ్నలకూ సమాధానం చెపుతూ, అవధానిగారి చిన్న కుర్రాడిని ముద్దులాడుతున్నాడు. అందరూ ఇళ్ళకు వెళ్ళిపోయాక వెంకమ్మగారు,

"చేతులు కాళ్ళూ కడుగుకొని దేవునికి నేతిదీపం వెలిగించి దండం పెట్టమ్మా" అన్నారు.

మీర చేతులు, కాళ్ళు కడుక్కొని వచ్చేసరికి వెంకమ్మగారు వెండి ప్రమిదల్లో నెయ్యి వత్తులు వేసి సిద్ధంగా ఉంచారు. దేవుని గది అంద చందాలు చూసి, ఆశ్చర్యపోయింది మీర. ఎంత కలత చెందిన మనసునయినా, శాంతపరచే ప్రశాంతత ఉందక్కడ. రకరకాల పూల వాసన, అగరవత్తులూ, కర్పూరాల పరిమళ మిళితమయిన సౌరభం మనసుకు ఆహ్లాదాన్నిచ్చాయి. మీర దీపాలు వెలిగించి కొంగును మెడ చుట్టూ వేసుకొని నమస్కరించింది.

"ఇక భోజనానికి లేవండి. శామణ్ణనూ పిలు తల్లి."

మీర దేవుని గదినుండి బయటికివచ్చి చూసింది. శాము ఎక్కడా కనుపించలా.

"ఆయనెక్కడా కనిపించటంలేదే?"

"ఇంకెక్కడికి పోతాడు? దూడలతో కబుర్లు చెపుతూంటాడు, పాకలో"

మీర వెనుకవేపునుండి పశువుల పాకలోకి వెళ్ళింది. శాము మనుష్యులతో మాట్లాడినట్టుగానే, ముద్దొచ్చే తెల్లటి దూడతో మాట్లాడుతున్నాడు. మీర దూరంగానే నుంచొని, ఆ సుందర దృశ్యాన్ని చూస్తోంది.

దూడ, తన నల్లటి మెరుస్తున్న కళ్ళతో చూస్తూ కూర్చున్న శాము జబ్బమీద మెడ సాచింది. కొమ్ములులేని దాని తల నిమురుతూ :

"ఏం కావాలమ్మా, ఏం కావాలి?" అంటున్నాడు శాము. దూడ చెప్పేదేదో అతనికి అర్థమవుతూన్నట్టే ఉంది. తెల్లటి ముద్దొచ్చే దూడను చూస్తూ ముందుకు వచ్చింది, మీర. కాళ్ళకింద చల్లగా, మెత్తగా తగిలినట్టయి, బెదిరి క్రిందికి చూసింది. క్రింద పడిన పేడమీద ఆమె అడుగుల గుర్తు స్పష్టంగా కనుపించాయి. చుట్టూ చూసింది.

అక్కడక్కడ పడిన పేడరాశిని ఈగలు ముసురుతున్నాయి. పేడ, గడ్డి, వీటితో మురికి వాసన వేస్తోంది. ఆ వాసన మురికి; ఈగలు వీటినిచూసి అసహ్యించుకుంటూ దూరంగానేనుంచుంది. కాని శాము మాత్రం వీటన్నిటిని గమనించకుండానే, ఆ మురికి మధ్యలోనే కూర్చొని, ఆ దూడను తన బిడ్డను ముద్దులాడినట్టు ముద్దులాడుతున్నాడు. అతని రెండు వేపులా పేడ రాశి పడి ఉంది. వాటికి ముసురుకున్న ఈగలు అప్పుడప్పుడూ అతనిమీద కూడా వాలుతున్నాయి. ఆ మురికివల్ల అందంగా ఉన్న దూడ కూడా అసహ్యంగా కనిపించింది మీరకు.

దూరంగా నుంచుని, "భోజనానికి" రండి అంది.

శాము తలెత్తి, సంతోషంతో, "ఇలా రా మీరా ఎంత బావుందో చూద్దువుగాని రా" అన్నాడు.

"నాకు అసహ్యం వేస్తోంది. లోపలికి రాలేను. మీరేరండి."

శాము ఆశ్చర్యపోయాడు. ఎంత రాతి గుండె. పాల నురుగులాటి చర్మంగల చక్కటి దూడను చూస్తే ఇంత అసహ్యమా?

"లోపలికి ఎందుకు రాలేవు?"

మీర చుట్టూ చూపిస్తూ, "ఎంచేతనో చూడండి. పశువుల పాక ఇంటినుండి దూరంగా ఉంటే ఇంటికి క్షేమం."

శాము ఉక్కులాటి తన జబ్బలను చూపిస్తూ

"ఇప్పుడయినా, పశువుల పాకనుండి అపాయం లేదని గ్రహించు" అన్నాడు.

"అది వేరే సంగతి. మొత్తంమీద దీనివల్ల అనారోగ్యం కలుగుతుంది."

శాము దూడను చేతులతో ఎత్తుకుని, బయటకివచ్చి, "ఎంత బావుందో చూడు" అంటూ మీర కివ్వబోయాడు. దూడ అందానికి మురిసిపోతూ మీర చేతులు చాచింది. కాని దాని కాళ్ళ మీదున్న పేడ తోక, ప్రక్కలకు అంటుకున్న పంచతం దానివంటినుండి వస్తున్న జిగురు వాసనలను గమనించి అసహ్యంతో చేతులు వెనుక్కి తీసుకుంది. అలా చేతులు వెనక్కి తీసుకోవటంవలన దూడ క్రింద పడింది. దూడ క్రింద పడటంచూసి అపశకునంగా భావించాడు శాము.

"మీరా......"

అనుకోకుండానే అతనికంఠంలో కాఠిన్యం ధ్వనించింది.

వంగి దూడను రెండు చేతులతోను ఎత్తుకుని, "అక్కర్లేకపోతే ఊరికే ఉండలేకపోయావా?" అని కసురుకున్నాడు.

"దూడ అలా మురిగ్గా ఉంటుందనుకోలేదు నేను."

"మురికెక్కడుంది?"

"దాని కాళ్ళు, ప్రక్కలు చూడండి."

"నీ బిడ్డే అయితే అసహ్యించుకునే దానివా? ఈమాత్రం సహించలేనిదానివి, నీదేలాటి మనసు!" అంటూ దూడను క్రిందకి దింపాడు. దూడ చెంగు చెంగున ఎగురుతూ పారిపోయింది.

ఇంట్లో అడుగు పెట్టిన మరుక్షణంలోనే భర్తనుండి మాట పడాల్సిన సంఘటనతో మీర కళ్ళలో గిర్రున నీరు తిరిగింది. అసలు ఒకరినుండి మాటపడే అలవాటులేని మీర అభిమానం దెబ్బతింది. మీర కళ్ళల్లో నీరు తిరగటం గమనించి శాము మెత్తపడ్డాడు. తను అంత కఠినంగా మాట్లాడి ఉండకూడదనుకున్నాడు.

"మీరా ఏమనుకోకు. కోపంలో ఏదో అన్నాను." అంటూ దగ్గరగావచ్చి ఆమె చేతులను పట్టుకోబోయాడు. మీర రెండడుగులు వెనక్కివేసి,

"మీ చేతులు మురికిగా ఉన్నాయి. నన్ను ముట్టుకోకండి" అంది.

దారితప్పి తన గూటిలో ప్రవేశించిన [illegible] చిలుక తాను, అనిపించింది మీరకు. భర్త లోకమంతా, పాడి పంట, భూమి, పుత్రా అయితే, తన లోకమేవేరు. ఇవి రెండూ కలవటం సాధ్యమా?

మీర కను మరుగవగానే, శాము మురిగ్గా ఉన్న తన చేతుల నోమారు చూసుకుని, మీర వెళ్ళిన వైపే చూస్తూ నిట్టూర్చాడు.

వెంకమ్మగారు దంపతు లిద్దరికీ, అగ్గవు అరిటాకులువేసి ముగ్గు పెట్టారు. భోజనానికి వచ్చేటప్పటి కింకా మీర కళ్ళల్లోని ఎరుపు అలాగే ఉంది. భోజనంచేస్తూ శాము అడిగాడు.

"అత్తయ్యా, నా భార్య ఎలా ఉంది?"

కూర వడ్డిస్తున్న వెంకమ్మగారు తలవంచుకుని కూర్చున్న మీరవైపు చూసి,

"లక్ష్మిలా ఉంది నాయనా."

"మీరు చూసేదాకా తృప్తిలేదు, నాకు. మీరు ఆశీర్వదించాలి మమ్మల్ని."

"అంతకన్నా నాకేం కావాలి నాయనా? నూరేళ్ళ చల్లగా బతకాలి మీరు. మీకు నామీదున్న విశ్వాసం వల్ల అంటున్నావుగాని......"



"మీమీదకాకపోతే ఎవరిమీద విశ్వాసముంచాలో చెప్పండి. తల్లిలేని నన్ను పెంచి పెద్ద చేసిందే మీరు? మీ తొడమీద పెరిగిన బిడ్డ నేను. నామీద మీకున్న ప్రీతి విశ్వాసాలు, మీ మంచితనాన్ని నిరూపిస్తాయి. ఎన్ని జన్మలెత్తితేమాత్రం మీ రుణం తీర్చుకోగలము?"

చనిపోయిన శాము తల్లిని తలచుకొని వెంకమ్మగారి కొంగుతో కళ్ళుద్దుకుని మాట మార్చారు.

భోజనా లవగానే, శాము హాలులోవున్న ఉయ్యాల మీద కూర్చొని,

"మీరా, తమలపాకులు పట్రా" అన్నాడు.

మీర తెచ్చిన కొద్దిపాటి ఆకులను చూసి,

"ఉహూ ఇవి చాలవు" అన్నాడు.

"మైసూరులో కొద్దిగానే వేసుకొనేవారుగా?"

"కాకపోతే అత్తవారింట్లో కట్ట తమలపాకులు కావాలని అడగమంటావా?" అంటూ లేచి వెళ్ళి ఓ కట్ట తమలపాకులు వక్కలు తెచ్చుకొని, పది నిముషాల్లో వేసుకోవడం పూర్తి చేశాడు.

"నువ్వు వేసుకో మీరా"

"ఉహూ, నాకు సయించదు."

"పోనీ తమలపాకులు వేసుకున్నవారు నచ్చుతారుగా?"

మీర బదులు చెప్పకుండా లోపలికి వెళ్ళిపోయింది.

సాయంత్రం ఏం చేయటానికి తోచలేదు మీరకు. వంటా వార్పూ వెంకమ్మగారు చేసుకుంటున్నారు. గిన్నెలు తోమటం, ఇల్లు వూడవటం, పనులూ, పనిమనిషి చేస్తుంది. ఏమీ తోచక మీర 'సెవిలియన్ ఆఫ్ వుమన్' చేతికి తీసుకుంది. చదువుతూ, చదువుతూ, అందులోనే లీనమయింది.

విస్వారం

చేతిలోని పుస్తకం ఎవరో లాక్కున్నప్పుడే ఈ లోకంలో పడింది.

శాము పుస్తకం బల్ల మీద పడేసి "లే, మీరా" అన్నాడు.

"ఎక్కడికండీ?" ఇంకా పుస్తక ప్రపంచంలో విహరిస్తున్న మీర విసుగ్గా అడిగింది.

"మా పల్లె అంతా చూపిస్తాను. పద సాయంత్రం హాయిగా తిరిగిరాక, పుస్తకం పట్టుకుని కూర్చుంటూరా?"

"నేను రాను"

"అలా అంటే వినేవాడిని కాను. ఇంక అయిదు నిముషాలలో తయారుగా ఉండు అంటూ" వెళ్ళిపోయాడు శాము.

"ఈ పల్లెలో ఏముంటాయి చూడ్డానికి?" అని గొణుక్కుంది, మీర. తన మాట వినకుండా పుస్తకం లాగి పారవేసినందుకు కోపంగావుందామెకు. కాని బదులు చెప్పటానికి ఇష్టంలేక లేచి తల దువ్వుకుంది. వెంకమ్మగారు గుచ్చివుంచిన దండ తల్లో పెట్టుకుంది. చేతికి వాచి కట్టుకుని శాము ముందు నుంచుని "రెడీ" అంది.

ఇద్దరూ బయల్దేరారు. ఇంటినుండి సుమారు రెండుమైళ్ళు నడిచాక వాళ్ళ వరిచేలు వరసగా కనుపించసాగాయి. తరువాత చెరుకుతోటలు అన్నీ చూపించాడు. చేలల్లో రైతులు పని చేసుకుంటున్నారు. కొంతమంది నీళ్ళు వదులుతున్నారు. కొంతమంది కలుపు తీస్తున్నారు. తమ యజమాని, అమ్మగారు రావటంచూసి వాళ్ళంతా పనులు ఆపేసి వారివేపే చూడసాగారు. మీర సిగ్గుపడింది.

"ఇక వెడదాం రండి. వాళ్ళంతా ఎలా చూస్తున్నారో?"

"తమ కొత్త అమ్మగారిని చూడాలని కుతూహలం వాళ్ళకి."

"కాని నాకు ఏదోగా ఉంది. పదండి."

ఇద్దరూ వెనుతిరిగారు.

మట్టి ఇళ్ళ మధ్యనుండి వూళ్ళోకి వెళ్ళేటప్పుడు ఇళ్ళలోని వాళ్ళంతా కిటికీలగుండా నూతన దంపతులను చూడసాగారు.

"వాళ్ళంతా ఎందుకలా చూడాలి?" అని విసుక్కుంది మీర.

"నీలాటి అందగత్తెను చూసి వాళ్ళ కళ్ళను సార్థక పరచుకుంటున్నారు"

"ఇహ చాలు వూరుకోండి. ఎవరైనా వింటే నవ్విపోతారు."

అవధాన్లగారి అమ్మాయి వెంకు తలుపు దగ్గర నుంచుంది. వీరిని చూడగానే చెయ్యి తట్టి,

"శామణ్ణా అమ్మ రమ్మంటుంది" అంటూ పిలచింది.

శాము మీరవేపు తిరిగి "రా వెడదాం" అన్నాడు.

అవధానిగారిఇంటి మట్టి గోడలకు వెల్ల వేశారు. అంత ఎత్తులేని తలుపులు, ఆ పెంకుటింటినిచూసి, "ఈ ఇంటిలో మనుష్యులు ఎలా నివసిస్తారా" అనుకుంది మీర. చిన్న చిన్న కిటికీలు, గోడలనిండా రవివర్మవి, లక్ష్మి, సరస్వతి, శకుంతల, మోహిని, చిత్రపటాలు వేలాడదీశారు. వెంకు చాప పరచి, "కూర్చోండి" అని లోపలికి వెళ్ళింది. అవధానిగారి భార్య, సీతక్క, గ్లాసులో కాచిన పాలు, రాగిపిండి రొట్టె తెచ్చి వాళ్ళముందుంచారు.

"బీదవాళ్ళ ఆతిధ్యం కాస్త తీసుకోండి"

"వద్దు సీతక్కా. మధ్యాహ్నం ఫలహారంచేసి బయలుదేరాం."

"ఫరవాలేదు. కాస్త పుచ్చుకుంటే మాకు సంతోషం"

"తీసుకో మీరా" అని శాము సంకోచం లేకుండా రొట్టె తినటానికి ప్రారంభించాడు. మీర ఎప్పుడూ రాగి రొట్టె తిని ఎరుగదు. అతి ప్రయాసతో కొద్ది కొద్దిగా తినసాగింది.

వెంకు తన చిన్నతమ్ముడిని చంకలో వేసుకుని, బయటికి వచ్చింది. శాము వెంకూని ఏడ్పించాలని,

"సీతక్కా. వెంకూ పెళ్ళెప్పుడు?" అన్నాడు.

"అవునయ్యా. ఎక్కడైన సంబంధం వుంటే చెబుదూ. అప్పుడే పదేళ్ళు దానికి" అన్నారు సీతక్క.

శాముకు వెంకూ అంటే ఎంతో అక్కర. చిన్నప్పటినుండి అతను ఎత్తుకుని ఆడించిన పిల్ల వెంకు.

"సంబంధాల గురించి మీకన్న ఎక్కువగా నాకేం తెలుసు. సీతక్కా?"

"తెలీకేం. అంతా తెలుసు. నువ్వు ఎన్నుకుని పెళ్ళి చేసుకున్న పిల్లను చూస్తే తెలీటంలా?"

వాళ్ళు మాట్లాడుకున్న విషయాల్లో మీరకు ఏ మాత్రమూ ఆసక్తి కలుగలేదు. ఒక గంటయ్యాక ఇక వెడదామని శాము పైకి లేచినప్పుడు ప్రాణం లేచి వచ్చిందామెకు.

ఇంటికి వచ్చేసరికి బాగా చీకటి పడింది. బోరడు లాంతర్లు తుడిచి, నూనె పోసి వెలిగించాడు. ఇంత వరకు విద్యుద్దీపాల వెలుతురుకు అలవాటు పడ్డ



మీర కళ్ళు, మసకబారినట్లనిపించింది. ఇల్లు చేరగానే సగంలో ఆపిన కథ పూర్తి చేయాలని మనసులోనే అనుకుంటూన్న మీరకు లాంతర్ల గుడ్డి వెల్తురు చూసి, నిరాశే అయింది. కాని తప్పదు. ఆమె పల్లెటూరి వాతావరణానికి అలవాటు పడక తప్పదు.

పల్లెటూరిలో ఒకవారం గడిచేసరికి, విసుగు పుట్టి పెరిగి, జుగుప్సగా మారిపోయిం దామెకు. ఆమె చురుకుదనం, ధైర్యం, అసాధారణమయిన తెలివి పల్లెటూరి నీరస వాతావరణాన్ని అలవరచుకోలేకపోయాయి. ఆకలిగొన్న ఏనుగు, చెరుకు గడలను చీల్చటానికి ఆతురత పడినట్లు మీర ఆకలిగొన్న నిరుద్యోగి బుద్ధి తగినంత పని లేక కలవరించింది. "నాకేదైనా పని చెప్పు" అని ఆమె మనసు ఆమెను వేధించసాగింది. తానుంటూన్న సన్నివేశానికి విరుద్ధంగా తిరగబడుతున్న మనస్సునూ బుద్ధినీ తన అధీనంలో ఉంచుకోవటానికి విశ్వ ప్రయత్నం చేసింది మీర.

పనిలేక హాయిగా మంచంమీద పడుకొన్నప్పుడు విచార ప్రవాహంలో కొట్టుకపోయే దామె మనస్సు

"నాకేం తక్కువయింది? ప్రేమించే భర్త, కావాలనుకున్న వస్తువును పొందగల స్తోమత అన్నీ ఉన్నాయి. కానీ మనసుకు శాంతిలేదే? ఎంచేతా?" అని తనని తానే ప్రశ్నించుకునేది. కాని దానికి సమాధానం దొరికేదికాదు.

ఉదయంలేచి కాఫీ టిఫిను తీసుకొని స్నానం చేసి డ్రస్సు చేసుకుని కూర్చొనేది. శాము పొలాల వేపు వెళ్ళి తిరిగి రావటానికి ఒంటిగంటయ్యేది. మీర ఒక్కోరోజు వెంకమ్మగారితో కబుర్లు చెపుతూ కూర్చొనేది. రోజూ ఆమెతో ఏం కబుర్లు చెప్పగలదు? శాము ఎప్పటికి వస్తాడా అని అరగంట ముందునుండి తలుపు దగ్గర మంచాన్ని, ఎదురు తెన్నులు చూసేది. అసలే ఎర్రగాఉన్న శాము మొహం ఎండకి కందిపోగా, దూరంనుండే మీరను చూసి, నడక వేగం హెచ్చించి, గబ గబా నడచి వచ్చేవాడు. "నా రాణికి ఏం తోచటంలేదు కదూ?" అనడిగేవాడు అప్యాయంగా.

ఇక గదిలో కూర్చొని కబుర్లలో పడ్డారంటే వెంకమ్మగారు హెచ్చరించేదాకా లేచేవారు కారు.

"శామన్నా పొద్దుపోయింది లే నాయనా. వంటంతా చల్లారిపోతోంది."

శాము లేచి మీరతో కలిసి భోంచేసి తమలపాకులో మోదు పట్టించి, బలవంతంగా మీరకూ రెండాకులు తినిపించి, పడుకునేవాడు. మీరకు మధ్యాహ్నం నిద్ర అలవాటులేదు. శాము చేతిమీద తల పెట్టి పడుకొని, శూన్య దృష్టితో పైకప్పుకేసి చూస్తూ ఉండేది. రక రకాల ఆలోచనలు ఆమె మెదడును అల్లకల్లోల పరచేవి. బంధిత పక్షిలాగా ఆమె మనసు విలవిలలాడిపోయేది. 'నాకిది అక్కర్లేదు. నాకు కావలసినది వేరు. నాకు కావాలసినది దొరకలేదు. దొరికింది నా కక్కర్లేదు' అని ఆమె మనసు మొండికేసేది. ఈ పోరాటంలో అలసిపోయేది మీర.

మళ్ళీ అయిదింటికి లేచేవాడు శాము. మొహం కడుక్కొని కాఫీ టిఫిన్ తీసుకుని బయటికి వెళ్ళేవాడు. మొదటి కొద్దిరోజులు బలవంతాన మీరను కూడ తోలుక్కు వెళ్ళేవాడు. కొత్తలో పల్లెను చూడాలన్న కుతూహలంతో మీర అతనివెంట వెళ్ళినా, రాను రాను ఆ ఆసక్తి తగ్గిపోయింది. బయటికి వెడితే తననే వెంబడించే చూపులకు తట్టుకోలేక ఇంట్లోనే ఉండిపోయేది. సాయంత్రం ఆరింటికి నౌకరు లాంతర్లు వెలిగించేవాడు. రాత్రి శాము వచ్చే సరికి ఎనిమి దయ్యేది. ఇది రోజువారి కార్యక్రమం.

ఆమె రోజూ చేస్తున్న పెద్ద పనల్లా తోటంతా తిరిగి పూలుకోయటం, రక రకాలుగా మాలలు కట్టి మార్చి మార్చి పెట్టుకోవటం.

ఎప్పుడూ పని చేస్తున్న "పిశాచి" ఒక్క పనవగానే యజమాని దగ్గరకు వచ్చి, "ఇంకేం చేయనూ?" అంటున్నట్లు ఆమె మనస్సు అస్తమానం "తరువాత?" "ఇంకేమిటి?" అని ప్రశ్నిస్తూ ఉండేది. పిశాచికి కుక్కతోక వంకరను సరిదిద్దే పని అప్పజెప్పినట్లు మీర తన మహత్వాకాంక్షను గురించి పగటి కలలు కనే పని అప్పజెప్పింది. కాని కల నుండి మేలుకొన్న ఆమె మనస్సు, నిరాశతో కృంగిపోయేది. హృదయం బరువెక్కేది. ఈ మనోవిప్లవంలో నలిగిపోతోంది మీర.

తీరం వదలిన నావ తన గమ్యస్థానాన్ని చేరుకుంటే దాని లక్ష్యం సిద్ధించినట్టే. కాని తుఫానుకు చిక్కి, తను వెళ్ళాల్సిన చోటుకుకాక ఏదో అపరిచితమయిన ప్రదేశంలో వచ్చి పడిన ఏకాకి బెదిరిన మనసులా మీర మనసు కలవరం చెందింది.

ఒకడు : ఒరే! నాతో స్నేహం చేయరా నిన్ను లక్షాధికారిని చేస్తా ?

మరొకడు : వద్దురా బాబు నేను కోటీశ్వరున్ని.

యస్. వి. యస్. రెడ్డి (మద్రాసు)

'నా కింకా ఏం కావాలి?' 'ఈ సంసారాన్ని దిద్దుకుంటూ గడపటమే నా కర్తవ్యం' అని మనసుకు నచ్చచెప్పటానికి ప్రయత్నించేది.

"ఉహూ. నా చోటిదికాదు. నా కర్తవ్యంవేరు. నే నుండాల్సిన చోటు వేరు' అని ఆమె మనసు మొండి కేసేది. ప్రతిరోజూ మనసుతో యుద్ధం చేయక తప్పేదికాదు.

తన అంతరంగంలో జరిగే పోరాటాన్ని గురించి భర్తకు చెప్పటంలో ఉపయోగం లేదని మీరకు తెలుసు. అతనితో చెప్తే "నీ కింకా ఏం కావాలి, పిచ్చిపిల్లా? ఇదొక్కటే నీకు కావలసినది" అంటూ ప్రేమగా ముద్దు పెట్టుకుని మాట మార్చేస్తాడని మీరకు బాగా తెలుసు.

తన మనస్సు తీరును భర్త అర్థం చేసుకోకపోవటంలో మీరకు ఆశ్చర్యమేమీకలుగలేదు. స్త్రీకి ఇంతకన్నా కావలసి దేమున్నది? తనను దేవిలా ఆరాధించే భర్త, కావలసినంత ధనం రూపం అన్నీ ఉండి కూడా, అశాంతితో బాధపడే తన మనస్తత్వానికి మీరకు తనమీదే విసుగు పుట్టేది.

ఎప్పుడూ చురుగ్గా ఉండే మనసుకు కావలసినంత పని లేకపోవటంవల్ల ఇలా ఉందేమో అనుకుని ఏదో పని కల్పించుకుని చేయసాగింది.

ఉదయం లేవగానే పూలుకోసి మాల కట్టేది. తీరికగా ఓ గంట దేవుని పూజ చేసి, తరువాత వెంకమ్మగారికి టిఫిన్ చేయటంలో సాయపడేది. ఒక్కోరోజు కాఫీ, టిఫిన్ తనే చేసుకొని వంట పని మాత్రం వెంకమ్మగారికి అప్పజెప్పేది.

ఇక పుస్తకాలు చదవటం ఉండనే ఉంది.

సాయంత్రం భర్త బయటికి వెళ్ళగానే పూల చెట్లకు పాదులు చేసేది. గోపాలకృష్ణ దేవాలయానికి వెళ్ళి వచ్చేది. ఇదేదీ వద్దనిపించిన రోజున అవధానిగారి కూతురు వెంకుతో కబుర్లు చెపుతూ గడిపేది. కాని ఆ పదేళ్ళ పిల్లతో ఎంతసేపని మాట్లాడగలదు?

ఓరోజు శాము ఇంటికి రాగానే కొన్ని పుస్తకాల పేర్లు రాసిన కాగితం అతని చేతి కిచ్చి "మైసూరునుండి ఈపుస్తకాలను తెప్పించిపెట్టండి" అంది.

"అబ్బా! ఇన్ని పుస్తకాలే! మొన్న తెప్పించిన వన్నీ చదివేశావా అప్పుడే?"

మీర అభిమానం దెబ్బతింది.

"మొన్న నెప్పుడు తెప్పించుకున్నా నేమిటి పుస్తకాలు?"

"ఎలా చదువుతున్నావబ్బా ఇన్ని పుస్తకాలు? జీవం లేని ఆ పుస్తకాలు నిన్నెలా ఆకర్షిస్తున్నాయో తెలియటంలేదు"

మీర సహనం కోల్పోయింది.

"అస్తమానం పొలం పుట్రా అని తిరగటానికి మీకు విసుగనిపించటం లేదూ?"

శాము కనుబొమ్మలు ముడివేసి,

"అదేంమాట? రోజూ చూస్తాకదా అని సూర్యుడంటే విసుగొస్తుందా? భూమాత పవిత్ర స్నేహంలో నా మనసు ఐక్యమైంది. తల్లి అంటే విసుగు చెందే పిల్లలుంటారా? ఆమె సౌందర్యం నిత్య నూతనం. ఆమె స్నేహం అమరమూను. ఆమె సేవలోనున్న తృప్తి, ఆనందాలు నీ పుస్తకాలవల్ల కలుగగలవా?" అన్నాడు.

"మీకు భూమాత సహవాసం ఎలా నిత్య నూతనమో నాకు పుస్తకాలవల్ల కలిగే శాంతి కూడ అపరిమితం. మీరు సాహిత్యంలో ఎలా సౌందర్యాన్ని చూడలేరో, అలాగే భూదేవిలో అందం కనిపించదు నాకు. నిద్రాహారాలకన్నా, పుస్తకాల అవశ్యకత ఎక్కువ నాకు. ఆకలి తీరడానికి, అన్నం కావలసి వచ్చినట్టే హృదయపు టాకలి తీరడానికి పుస్తకాలు కావాలి నాకు."

"మేము భూదేవి సేవ చేస్తున్నాము గనుకనే ప్రజలందరూ హాయిగా తిని తిరుగుతున్నారు. రైతు కూడా నాగలి వదిలేసి పుస్తకం చేబడితే ప్రపంచం గతేమిటి? నీ సాహిత్యం ఏం సాధిస్తుంది?"


"సాహిత్యంవల్ల బుద్ధి వికసిస్తుంది. జ్ఞానార్జన కలుగుతుంది."

"నువ్వు జ్ఞానాన్ని ఆర్జించి, ఏ రాజ్యాన్ని ఏలాలో చెప్పు? నా హృదయ రాజ్యాన్ని ఏలుకోవటానికి ఈ జీవంలేని పుస్తకాలు అనవసరం. మరులు గొలిపే నీ కళ్ళు, బంధించే చేతులూ అన్ని అడ్డంకులనూ ఒక్క ముద్దుతో దూరంచేసే నీ పెదవులు ఇవి చాలు ఈ రాజ్యానికి."

(సశేషం)

భారీయెత్తున దేశరక్షణకు
ప్రణాళికాబద్ధమైన అభివృద్ధి అవసరం





సాధనవల్లన

మా ఇల్లు చాలా విశాలమయినదే. దొడ్డి కూడా కావలసినంత ఉంది. కాని మొక్కలు పెంచటం లేదు బద్ధకం చేత. ఆ పని అంటూ ప్రారంభిస్తే చచ్చే చాకిరి చెయ్యాలని భయం. రోజూ కలుపు తీయటం, నీళ్లు పోయటం మొదలైనవన్నీ చెయ్యాలంటే చిరాకు.

దొడ్లో మొలకలైతే లేవలేదుగానీ నా మనస్సులో ఈ మధ్యనే కొన్ని ఆశలు చిగురించాయి. ఏమంటే సంగీతానికి మొక్కలు బాగా పెరుగుతాయట. ఎలాగో రోజూ సంగీత సాధన చేస్తూ ఉంటాను కదా. కొన్ని మొక్కలు పెట్టి వాటిమధ్య కూర్చునే సాధన సాగిస్తే — ఒకే దెబ్బకి రెండు పిట్టలు అటు మొక్కలు ఇటు సంగీతం కదా అని.

ఓ సెలవురోజు అనుకున్నట్టుగానే కొన్ని విత్తనాలు తెచ్చాను. ఇంటింటికీ తిరిగి రక రకాల మొక్కలు పట్టుకు వచ్చాను. నేలంతా పదును చేసి మొక్కలు విత్తనాలను నాటేసరికి తల ప్రాణం తోకకు వచ్చింది. ఆ రోజుకు మాత్రం నీళ్లవరకే పోశాను. సంగీతం వినిపించలేదు— ఓపిక లేదు. ఎలాగూ వేళ్ళు నాటుకోలేదుగదా సంగీత మాధుర్యాన్ని ఏం ఆస్వాదిస్తాయిలే అని.

మర్నాటినుంచి కార్యక్రమం ఏర్పరుచుకొన్నాను. నీళ్ళు ఇంట్లో వాళ్లెవరో ఒకరు పోసేట్టు, నేను సంగీత సాధన సాయంత్రం ఓ గంటపాటు చేసేట్టు. ఎంతైనా నీళ్ళు పోస్తూ పని చేస్తూ పాడితే పాట శృతిలో రాకపోవచ్చు— మొక్కలూ పెరక్కపోవచ్చు.

నాకు గులాబీ పూలంటే చాలా ఇష్టం. అందుకని గులాబీ మొక్కల దగ్గరే ఎక్కువసేపు సాధన చేయాలని, వాటికి మరీ దగ్గరగా కూర్చుని, వాటికి సంగీతం వీలైనంత పెద్దగా వినపడేలా చేయాలని నిర్ణయించుకున్నాను.

సంగీతం పాడటం ప్రారంభించాను.

మా ఇంటిచుట్టూరా నాల్గయిదు మేడలున్నాయి. నా గాన మాధుర్యాన్ని విని కాబోలు— వేళకాని వేళ ఇదేమిటి బాబూ అనుకుంటూ బయటకు వచ్చారు. నేనైతే చూసీ చూడనట్టు ఊరుకున్నాను. ఇటువంటి చిన్న అభ్యంతరాలన్నీ పెట్టుకుంటే ఇరక మొక్క చిగర్చాల్సిందే!

నీళ్ళ, సంగీతాల కొదవలేకుండా ఒక వారం రోజులు గడిచాయి. వారం రోజులైతే ఒక వాక్యంలో గడిచి పోయాయి కానీ ఎన్నెన్ని విశేషాలు జరిగాయో చెప్పటానికి వారాతలు చాలవు.

చుట్టు పక్కల వాళ్ళు మొదట రెండురోజులు సహించారుకానీ, ఆ తరువాత ఇక నా సంగీతాలన్నీ భరించలేమన్నారు. మొక్కలకి వసాళానికి అంటాలనే ఉద్దేశంతో గట్టిగా పాడుతూంటం వల వాళ్లకి రేడియో వినిపించడం లేదట. ఇంకా కొంత మంది న్యూసెన్సు కేసు పెడ్తామని బెదిరించేదాకా వచ్చారు.

ఇంట్లో మా వాళ్ళు కూడా నాల్కు రోజులు నీళ్ళు పోసిన తరువాత మావల్లన్ని పాడవుతున్నాయి. నువ్వే నీళ్ళు పోసుకో, సంగీతం ఆ తర్వాత పాడుకో వచ్చులే అన్నారు. నాకైతే బలేమండింది. మళ్లా పూలు విరగబూస్తే పెట్టుకునేది వాళ్ళే! వింతగా తోచి ఆకతాయిలు పిల్లలంతా వస్తున్నారు. ఆపలేక చస్తున్నాం, నీ సంగీతం ఆపు అనేవారు కూడా.

నాటిన రోజునుంచీ చూస్తూనే ఉన్నాను. మొక్కల్లో కాని విత్తనాల్లో కానీ ఏదైనా ఎదుగు బొదుగు ఉంటుందేమోనని. వారం తిరిగాకి కూడా ఏమీ మార్పు కనిపించలేదు. గడ్డి మాత్రం దట్టంగా పెరిగింది. నా సంగీతానికి అది పెరిగినా చాలని సంతోషించాను.

ఐతే కొన్ని విత్తనాలు అప్పుడే విచ్చుకుని మొలకలు పైకి రావటం లీలగా కనిపించింది. గులాబి ఆకులన్నీ రాలిపోతే బాధ పడ్డాను కానీ, ఆ రాలిపోవటం కొత్త చిగుళ్ళకి నాంది అని వారం రోజులగ్గానీ తెలీలేదు. ఈ చిన్న మార్పులన్నీ చూసి— నా ఉత్సాహం ఇనుమడించిందే కాని— చుట్టూ గల పోడు వలన ఏ మాత్రం తగ్గలేదు.

తిట్టుకుంటూనే అయినా నీళ్ళ పోస్తూనే ఉన్నారు. నేను సంగీతం మరింతసేపు వినిపించటం మొదలు పెట్టాను. ఆఖరికి ఒక రాత్రి కల కూడా కన్నాను మా దొడ్డి నందనవనంలాగా తయారయినట్టు.

ఇంకో పది రోజులు గడిచాయి— నీళ్ళే ఎక్కువయ్యాయో, సంగీతమే ఎక్కువయిందో— పుట్టిన చిగుళ్ళు రంగు మారటం మొదలు పెట్టింది— అంటే నల్లగా మాడిపోవటం మొదలు పెట్టాయన్నమాట. మొలకెత్తిన విత్తనాలు పది రోజులైనా కూడా భూమికి జానెడుకంటే లేవలేదు. ఎక్కడి ఆకులు అక్కడ చుట్ట చుట్టుకోవటం మొదలు పెట్టాయి. నా ఉత్సాహానికి, సాధనకి తగ్గ జవాబు లేకపోయేసరికి నేను చాలా నొచ్చుకున్నాను. దాంతోపాటే తోటపట్ల నా శ్రద్ధా తగ్గిపోయింది.

పోతే గులాబీ చెట్టుకి అతిశ్రద్ధగా బిగ్గరగా వినిపించిన సంగీతం మాత్రం వృధా కాలేదు. అది బాగా చిగిర్చి మొగ్గ కూడా తొడిగింది. దానికి మాత్రం నేనే శ్రద్ధగా నీళ్ళు పోస్తూ రోజూ దాని దగ్గర కూర్చుని సన్నగా రాగాలు తీసేవాణ్ణి. ఎందుకైనా మంచిదని హిందూస్తానీ శాస్త్రీయ సంగీతాలూ అప్పుడప్పుడూ వాద్య సంగీతం కూడా వినిపించాను.


ఒక శుభ ముహూర్తాన గులాబీ ఒక గడ్డి పువ్వు పూసింది.

—ఆర్. బి. శాస్త్రి

ఋతుక్రమం ఆలస్యమైతే?

విచారపడవద్దు ప్రఖ్యాతిగాంచిన "దేవిపిల్సు" వాడండి

పూర్తికోర్సు ప్యాకెట్టు 28 మాత్రలు వెల రు.11/-
సగం కోర్సు ప్యాకెట్టు 14 మాత్రలు వెల రు. 6/50
వి.పి. అదనము
ప్రతిచోటదొరకును



'దేవిపిల్సు' ముఖ్యంగా ఆలస్యమైన, క్రమముగాకాక పోయిన, బాధతో కూడిన, లేక ఆగిపోయిన బహిష్టుకు దేవిపిల్సు బాగుగ గుణమిచ్చును

1 అన్ని సందర్భములలోను శీఘ్రముగాను, అమోఘముగాను పనిచేయును ..
2 ఏస్థితిలోను ఆరోగ్యమునకు ఎట్టిహాని కలిగింపదు.

MFRS :- SEENU & CO., MADRAS-21

స్టాకిస్టులు: సిటీ ఫార్మ డిస్ట్రిబ్యూటర్స్, రాంగోపాల్ వీధి, విజయవాడ-1.

ఉచితము ! ఉచితము !!

తెల్లమచ్చలు

మా ప్రఖ్యాతివహించిన 'డాగ్‌సాఫా' ప్రత్యేక ఔషధము తెల్లమచ్చలను సులభముగ పోగొట్టుటలో 1925 సం॥ నుండి ప్రఖ్యాతి వహించియున్నది. మూడురోజులు వాడినంతనే మచ్చల తెలుపుదనం ఆపైన కొన్ని రోజుల్లోనే పూర్తిగా బాగుచేయు శక్తి గలదు. ఉచితంగ ఒక పాకెట్ మందు ఇవ్వబడును. నకలును చూచి మోసపోకండి.

Ashoka Treatment Centre,
P. O. Katri Sarai (Gaya)



కండ్ల
అందానికి
రక్షణకు

దర్‌బార్ కాజల్

కాటుక (రిజిష్టర్డు)

తయారుచేయువారు :-
రాంబీర్ కంపెని, బొంబాయి-4.

పాదాలలో ఆనెలు

పాదాలలో ఆనెలు, కండలు పెరిగి, వ్రేళ్ళు పాతుకుపోయి పాదములు నేలపై బెట్టలేక రాళ్ళు తగిలిన త్రుళ్ళిపడు వారు పైపూతగా వాడిన వ్రేళ్ళతో సహా మాయంచేయ గల సంజీవి. వెల పోస్టు ఖర్చులతో రు.5-50న.పై.

కొక్కోకము చిత్రపటములు గలది.	రు. 1-50
దాంపత్య రహస్యములు ...	రు. 3-00
తెలుగు హిందీ స్వయంశిక్ష	రు. 4-50
తెలుగు-ఆంగ్ల భాషాబోధిని	రు. 5-00

పోస్టు ఖర్చులు ప్రత్యేకము.

ప్రభ అండ్ కో.
3, మలయ పెరుమాళ్ వీధి, మద్రాసు-1.

చర్మం మంట పుట్టకుండా బాధా నివారణ



ఏ ఔషధం చర్మానికి ఎక్కువ మంట పుట్టిస్తే, ఆ ఔషధం వల్ల అత్యంత శీఘ్రంగా గుణం కలుగుతుందనే అపోహ చాలా మందికి వుంది. నిజానికి "లిటిల్స్ ఓరియంటల్ బామ్" వంటి అంజానానికి ఇతర గట్టి ఔషధాల కంటె యెక్కువ కాదనుకున్నా, కనీసం వాటితో సమంగా బాధను నివారించే గుణం వుంది.


నమ్మకంగా, వెంటనే బాధను పోగొడుతూ, స్థిరంగా హాయి కలిగించే "లిటిల్స్ ఓరియంటల్ బామ్" లోని గుణప్రదమైన వివిధ దినుసులూ, దాని తయారీకి యెంత జాగ్రత్తగా గైకొనబడినవో పరిశీలిద్దాం. ముఖ్యంగా పనిచేసే దినుసు మిథైల్ సాలిసిలేట్, చర్మంలోకి చొచ్చుకొని, చర్మానికి సంబంధించిన నరాలమీద సూటిగా పనిచేస్తుంది. ఈ క్రియకు కాజిపట్, అయిల్ థైమ్ తోడ్పడుతవి. మెంథాల్, కర్పూరం, థైమాల్ సమ్మిశ్రమ క్రియవల్ల అంజనం సున్నితమైన చర్మాలకు కూడా నిరపాయకరంగా పనిచేస్తుంది.

అందుచేతనే, "లిటిల్స్ ఓరియంటల్ బామ్" చిరకాలంగా ప్రసిద్ధి కెక్కింది. వెంటనే గుణమిస్తుందని, ఆ గుణం నిలకడగా వుంటుందని పేరు వడసింది. సాధ్యమైనంత తక్కువ నొప్పి కలిగిస్తుంది ఈ అంజనం. ఇది సున్నితమైన పరిమళం గలది. దుస్తుల మీద మరక పడదు.

"లిటిల్స్ ఓరియంటల్ బామ్" కొన్ని పర్యాయాలు ప్రయోగించగానే కీళ్ళ నొప్పులు, గాయాల నొప్పులు, స్వరపేటిక నొప్పి, దగ్గు, జలుబు—వీటికి త్వరితంగా గుణం ఇస్తుంది.

<u>గమనిక</u>: జబ్బు లక్షణం మొండిగా ఉంటే వెంటనే వైద్యునితో సంప్రతించండి.

<u>మా ఇతర వస్తువులు</u>: అపాయాన్ని నివారిస్తూ గుణమిచ్చే జర్మెక్స్, శిశువులకు ఉపశాంతినిచ్చే గ్రైప్ మిక్చర్, లిటిల్స్ గ్రైప్ వాటర్, బిగిసుకు పోయిన ముక్కును తప్పించే లిటిల్స్ ఇన్‌హేలర్ — మొదలైనవి.



మడమ
పగుళ్ళు?



లిచెన్‌సా

వాడండి

DZ 1613 ATG



వర్ధమాన నటి రత్న పరిచయం

ఏమిటీ కష్టమైన ప్రశ్న ?

"పాపచేత వేషం వేయించాలనుకుంటున్నాం"

ఈ మాట వినగానే పాప మాట అటుంచి ఆ పాప తల్లి విస్తుబోయింది. సన్నగా, రివటలా ఉండే తన బిడ్డ సినిమాలలో వేషం వేస్తుందా? పసిపిల్ల. అదేం చేయగలదు? దానికేం వచ్చుని?..... అంటూ ఆలోచిస్తూ ఉండిపోయింది. ఆశ్చర్యంతో మ్రాన్పడిపోయింది.

ఆమె స్థితి గమనించి ఎదుటనున్న గంభీర మూర్తి పెదవులపై సన్నగా చిరునవ్వు వెల్లివిరిసింది.

"వేషం అంటే మామూలుదికాదు, హీరోయిన్ వేషం వేయిస్తాం!" అన్నా రాయన ఓ నిర్ణయానికి వచ్చి.

పాప తల్లికి మరింత ఆశ్చర్యమయినది. అసలు దానిచేత వేషం వేయిస్తా ననడమే విచిత్రంగా ఉంటే—హీరోయిన్ భూమిక ఇస్తాననడం మరీ విచిత్రంగా వినిపించింది ఆమె కర్ణపుటాలకు. తన బిడ్డ రూపసి అయిన మాట నిజమేగాని, బొత్తిగా వళ్ళులేని పధ్నాలుగేళ్ళ పసిపిల్ల—హీరోయిన్‌గా ఏం చేస్తుంది అనే సంశయం ఆ తల్లిని ఆవహించినది.

"మీ బిడ్డపై మీకు నమ్మకంలేక పోవచ్చు. మాకు ఉన్నది. ఇపుడు మేము తీసే చిత్రంలో పాప హీరోయిన్!" అన్నారు తమ నిర్ణయానికి తిరుగు లేదన్నట్లు—ఆ మహా నటుడు.

ఆమె ఆయనను చూస్తూ అలా ఉండిపోయింది. బొమ్మలా నిలుచుండి పోయింది.

పై మాటలన్నవ్యక్తి తెలుగు చిత్రరంగంలో నటి సుప్రసిద్ధ హీరో శ్రీ [illegible] రావు. ఆ పిల్లతల్లి—ప్రఖ్యాత నటి జి. వరలక్ష్మి సోదరి శ్రీమతి జి. సుందరమ్మ. ఆ పాప అప్పటి నాగరత్నం! ఇప్పటి రత్న.....రామారావుగారి నిర్ణయాలు ఒక్కోసారి చాలా గమ్మత్తుగా ఉంటవి. ఎదుటి వారికి అర్థం కావు. ఎంతో పరిశీలన చేస్తే కాని, ఒక అభిప్రాయానికి రారు ఆయన. వచ్చా [illegible] నటికి రాదనుకున్న రత్న, కన్నతల్లికే రాణిస్తుం దని నమ్మకంలేని ఆ పాపను హీరోయిన్‌గా మేటి నటనలో తీర్చి దిద్దిన రామారావుగారి ప్రతిభా విశేషాలు వేరే చెప్పవలసిన పనేమున్నది?..... రత్న వెండి తెర జీవితం అలా గులేబకావళి చిత్రంతో ఆరంభమయినది.




పత్రికా పఠనం (ఫొటోలు: ప్రభాకర్)

నటి రత్న పరిచయం

రత్న 1947 ఆగస్టు 19న తెనాలి తాలూకా శిరిపి గ్రామంలో జన్మించింది. ఆమె బాల్యదశలో ఉండగానే—వ్యాపార నిమిత్తమయి తల్లిదండ్రులు మద్రాసుకు వచ్చారు. మూడో యేడు మీద పడేప్పటికి పిల్లను త్యాగరాయనగర్‌లోని హోలీ ఏంజెల్స్ కాన్వెంట్‌లో వేశారు తల్లి సుందరమ్మ.

చిన్న తనంనుంచి రత్నలో చురుకు పాలు ఎక్కువ. ఆడుతూ, పాడుతూ అప్పుడే అభినయిస్తూండేది. హోలీ ఏంజెల్స్‌లో సిక్స్త్ స్టాండర్డ్ పూర్తి చేసి, శాంథోమ్‌లోని రోజరీ మెట్రిక్యులేషన్ స్కూల్‌లో చేరింది.



ఏవో ఆలోచనలు......

సిస్టర్స్ చెప్పేవి శ్రద్ధగా వింటూ, పరీక్షలో కూచుని జాగ్రత్తగా వ్రాసేది. మంచి మార్కులు తెచ్చుకుంటూ, ఉపాధ్యాయునులచేత ప్రశంస లందుకుంటూ ఉండేది రత్న. ఆ కాన్వెంట్‌లో ప్రదర్శించే ఆంగ్ల నాటకాల్లో పాల్గొని—ఎంతో ఉత్సాహంతో పాత్రపోషణ చేసేది.

చదువుకుంటున్నప్పుడే ఎం. ఎస్. శైలావాగారి వద్దచేరి భరతనాట్యం అభ్యసించినది. అటుపిమ్మట కొంతకాలం నృత్య దర్శకులు వేదాంతం జగన్నాథ శర్మగారివద్ద కూచిపూడి నాట్యం నేర్చుకున్నది కుమారి రత్న.

భరతనాట్యంలోనూ, కూచిపూడిలోనూ ప్రవీణురాలు అయ్యేప్పటికి ఆమె వయసు పదమూడు మాత్రమే! ఆ లేత వయసులో అనన్య సాధారణమయిన అభినయం చేస్తూంటే చూసేవారంతా ఆశ్చర్యం వెలిబుచ్చకుండా ఉండలేకపోయేవారు.

నృత్యాల ధ్యాసలోపడి, చదువును వదలుకొనలేదు రత్న. చదువంటే ఆమెకి ప్రాణం. మనసు పెట్టి చదువుతూ ఉండేది. ఆమె ఉత్సాహాన్ని, కృషిని ప్రోత్సహిస్తూ ఉండేవారు సిస్టర్స్. మెట్రిక్యులేషన్ పరీక్షలు వ్రాసి, ఉత్తీర్ణురాలయినది.

మొదట్లో రత్నకు తెలుగు అంత సవ్యంగా మాట్లాడడం వచ్చేదికాదు. బాల్యంనుంచీ ఆంగ్ల, తమిళ, హిందీ భాషలతోనే ఎక్కువగా సంబంధం ఉండడంవల్ల—తెలుగు అంతగా మాట్లాడలేక పోయేది. ఇది గమనించి తల్లి సుందరమ్మగారు కోప్పడి, మాతృభాష తెలుగు దగ్గరుండి శ్రద్ధగా రోజూ చెప్తూ ఉండేవారు. తల్లి కృషివల్లా, తన పట్టుదలవల్లా తెలుగు స్పష్టంగా మాట్లాడడం, వ్రాయడం నేర్చుకున్నది రత్న.

ఆటుతర్వాత ఓ ఏడాదిపాటు చలన చిత్ర నృత్య దర్శకులు చిన్ని—సంపత్ లవద్ద వెస్టర్న్, భాంగ్రా మొదలయిన నృత్యాలను కూడ అభ్యసించినది. భరతనాట్యం, కూచిపూడి, కథాకళి, కథక్, ఓరియంటల్, మణిపురి, ఫోక్, వెస్టర్న్ భాంగ్రా నృత్యాలన్నిటినీ—ఇప్పుడు రత్న చేస్తుంది.

మెట్రిక్ పాసయినాక రామారావుగారు ఈ పసిదానిలోని ప్రజ్ఞను గుర్తించి "గులేబకావళి" చిత్రంలో కథానాయికగా తీసుకోవడం జరిగింది. తను సినిమాలలో రాణించగలనా అని రత్న కూడా ఆశ్చర్యపోయినది అపుడు, తల్లితోపాటు. రామారావుగారిలాంటి మహా నటుని ప్రక్కన నటించేందుకు, సెట్‌మీదకు వచ్చిన తొలిరోజు భయపడ్డది రత్న. ఆయన గుర్తించి, ప్రోత్సాహకరంగా మాట్లాడి, ఉషారునిచ్చి—రత్నలోని భయాన్ని తొలగించారు.

రత్న చలన చిత్ర జీవితానికి గులేబకావళి తొలి సోపానం. ఆ చిత్రమే ఆమెను నటిగా తీర్చిదిద్దినది. తరువాత 'అనుబంధాలు' చిత్రంలో వాంప్ భూమిక పోషించినది. కథానాయికవేషం ఒక ఎత్తూ, వాంప్ వేషం వేయడం మరొక ఎత్తూను. అయినా రత్న ఈ రెండు పాత్రల స్వభావాలను క్షుణ్ణంగా ఆకళింపు చేసుకుని, వైవిధ్యాన్ని సుస్పష్టంగా చూపగలిగింది. చూపరుల దృష్టిని ఆకర్షించగలిగింది.


ప్రస్తుతం తమిళ చిత్రాలలో ఎం. జి. ఆర్. ప్రక్కన నాయకిగా నటిస్తూ, తమిళ ప్రేక్షకుల ఆదరాభిమానాలను పొందుతున్నది. 'ట్రిప్ టు మూన్' అనే హిందీ చిత్రంలో కూడ రత్న నటిస్తున్నది.

రత్నకు ఇపుడు పదిహేడవ సంవత్సరం నడుస్తున్నది. వయసు విరిసినది, మనసు ఎదిగినది, అందం అభివృద్ధి అయినది, నటనలో నవ్యతను సాధిస్తున్నది.

తీరిక వేళల్లో ఎక్కువగా పుస్తకాలు చదువుతుంది. మొదటినుంచీ ఇంగ్లీషు అంటే మక్కువ అవడం చేతనేమో, ఆ భాషా సాహిత్యం అంటే రత్నకు ఎక్కువ మోజు. టేబుల్ టెన్నిస్, కేరమ్స్ ఇష్టపడి ఆడుతుంది. సినిమాలువస్తే మంచివి విడువకుండా చూస్తుంది. సంగీతం అంటే తగని అభిమానం. స్నేహితులతో కాలక్షేపం చేయడం అన్నా, గార్డెనింగ్ అన్నా మరీ ఇష్టం.


ప్రసిద్ధ తమిళ నటుడు ఎం. జి. ఆర్. ఆదరణతో తమిళ చిత్రరంగంలో ధ్రువతారగా వెలుగుతున్న తెలుగు ఓడ్డు కుమారి రత్నకు—తెలుగు పరిశ్రమలో స్థానం లేకపోవడం ఆలోచించదగినది.

—మోహన్ కుమార్ ★



అమూల్ వెన్నతో ఇంటి వంటలు అతి రుచికరం.





అమూల్ వెన్నతో మీరు ఎన్నో పిండివంటలు చేయవచ్చునని తెలుసు కొన్నప్పుడు ఆనందపరవశులౌతారు. అమూల్ వెన్నతో వండు నప్పుడు కలిగే కమ్మని సువాసనను ఆనందంగా ఆస్వాదించండి— అమూల్ వెన్నతో కేకులను, బిస్కట్లను తయారు చేయండి మరియు సాస్ ద్వారా, పూరీ దోశ్లా వండండి. జ్ఞాపకముంచుకోండి, అమూల్ వెన్నతో వండిన ప్రతి పదార్థమూ అధిక పుష్టికరం కూడా. శుద్ధమైన, తాజా మీగడతో గూడిన అమూల్ వెన్న ఆయిదుగంటలలోనే పాలు దిత్త నుండి వెన్న ప్యాకెట్‌గా డైరీ యందు ఎటికి తయారు చేయబడినది. శక్తిదాయకమైనది—పెరిగే పిల్లలకు చాలా ముఖ్యమైన ఎ, డి, వస్సైన్ విటమిన్‌లను గలిగియున్నది.

డైరీలో అపుడే... తయారైన శుద్ధ క్రీమ్...

అమూల్ వెన్న

అమూల్ మీ ఆహారమం తటికీ అమూల్యమైన అధిక పుష్టికరమగు మంచి ఫలిత మును కలిగించుచున్నది.

కైరా కో-ఆప్. ఉత్పత్తి—అమూల్యమైనది.

కైరా డిస్ట్రిక్టు కో-ఆపరేటివ్ మిల్కు ప్రొడ్యూసర్స్ యూనియన్ లిమిటెడ్, ఆనంద్.

CAS/KMP.32 TEL

CAS/KMP. 32 TEL



సుకన్య, సంధ్యారాణి.



రాంమోహన్, కృష్ణ.

కొత్త తా(వా)రల (సం)చలనచిత్రం తేనెమనసులు

అంతా కొత్తవారితో చిత్రం నిర్మించబూనడం నిజంగా సాహసం. అదీ రంగుల్లో తీయడం మరింత సాహసం. అందుకు ఎంతో గుండె ధైర్యం కావాలి. ఆత్మవిశ్వాసం వుండాలి. ఆ రెండింటినీ తనలో దృఢంగా నిల్పుకుని, సాహసవంతమైన అలాంటి ప్రయత్నం తెలుగులో మేధావంతుడయిన ఒక యువకుడు చేశాడు. నిగర్వి, నిరాడంబరుడు అయిన ఆ యువకుని పేరు అఖిలాంధ్ర ప్రేక్షకులకు సుపరిచితమయినది. ఆయనే ప్రఖ్యాత దర్శకుడు శ్రీ ఆదుర్తి సుబ్బారావు.

"తేనెమనసులు" చిత్రం అంతా కొత్తతారలతోనే నిర్మించుతానని ఆయన ప్రకటించినప్పుడు కొత్తవాళ్ళతో చిత్ర నిర్మాణమా?— అని ఆశ్చర్యపోయినవాళ్ళూ, ఆయనను నిరుత్సాహ పరచ చూసిన వాళ్ళూ కూడా లేక పోలేదు. శ్రీ ఆదుర్తి ఉత్సాహవంతుడు. పట్టుదల, కార్యదీక్ష గల వ్యక్తి. లక్ష్య సాధన కోసం ఆత్మవిశ్వాసాన్ని కూడ గట్టుకుని విశేషమయిన కృషి చేశారు ఆయన. దాని ఫలితంగా రూపొందినదే ఇవాళ శ్రీ ఆదుర్తి తీసినదీ, రేపు మీరు చూడబోతున్నదీ—"తేనెమనసులు" చిత్రం.

శ్రీ ఆదుర్తి సుబ్బారావు సినిమా రంగానికి వచ్చి ఇరవై ఏళ్ళు దాటినా ఇరవై అయిదు చిత్రాలకుపైగా ఆయన దర్శకత్వం వహించినా ఎప్పుడూ సెట్స్‌లోనే తారలకు మూవ్‌మెంట్స్ చెప్పి, నటింప చేయించుకునేవారు. తేనెమనసులు నిర్మాణంలో ఆయన అవలంబించిన విధానం అందుకు పూర్తిగా భిన్నమయినది. ఇందులో నటించిన వారందరినీ ఒకచోట చేర్చి ఒక కుటుంబంలా కలిపారు. తనూ ఆ కుటుంబంలో సభ్యుడై, ఆడుతూ పాడుతూ వారితో ఉషారుగా ఉంటూ, పూతా, ఉత్సాహమూ యిచ్చారు ఆయన. ఉదయం నాలుగు గంటలకులేపి, రిహార్సల్స్ చేయిస్తూ చక్కని శిక్షణ ఇచ్చారు—కొత్త తారలకు. నటనలో వారిని సుశిక్షితులను చేశారు. ఇవన్నీచూస్తే సుబ్బారావు గారు కొత్త తారలపట్ల తీసుకున్న శ్రద్ధాశక్తులు ఎలాంటివో అర్థమవుతవి. చిత్రంలోని ఏ షాట్‌లో



దర్శకుడు
ఆదుర్తి సుబ్బారావు.

అయినా తనకి కావలసిన ఎఫెక్ట్ రాకపోతే, రాలేదని విసుగు చెందరు. ఆ ఎఫెక్ట్ పెర్ఫెక్ట్‌గా వచ్చేంత దాకా శ్రమించుతారు. అది దర్శకుడిగా ఆయన లోని వోర్పును, మేధా సంపన్నతను సూచిస్తుంది.

ఈ చిత్రం తాలూకు అవుట్‌డోర్ షూటింగ్ ఫిబ్రవరి 2, 3, 4 తేదీలలో మైసూరు బృందావన్ గార్డెన్స్‌లోను, 5, 6 తేదీలలో వూటీలోను, దానికి సమీపంలోను జరిపారు. వూటీలో నాలుగు పాటల చిత్రీకరణ. కొన్ని ప్రణయ దృశ్యాలు చిత్రీకరించారు.

వూటీకి సమీపాన కల్హటీ రోడ్‌లో క్లయిమాక్సు దృశ్యాలు చిత్రీకరించుతుండగా భయంకరమయిన సంఘటన ఒకటి జరిగింది. చిత్రంలో నాయకిని విలన్ కారులో తీసుకుపోతుంటాడు. తప్పించుకుందుకు అతనితో పెనగులాడుతుంది ఆ అమ్మాయి. ఆ పెనుగులాటలో కారు రామ్మోహన్ వశం తప్పి అనుకోనివిధంగా యాక్సిడెంటు అయింది. పధ్నాలుగువేల రూపాయల విలువగల హెరాల్డ్ కారు పనికి రాకుండా పోయింది. కారులోవున్న నటీ నటులు సుకన్య, రామ్మోహన్‌లు చైతన్య విహీనులయిపడిపోయారు. సుబ్బారావుగారు కంగారుపడి, రామ్మోహన్ కనురెప్పలు బలవంతంగా విడదీసేందుకు ప్రయత్నించినా విడలేదు అవి. అక్కడున్న మిగతావారంతా ఆశ్చర్యంగాను, భయంతోను చూస్తూ ఉండిపోయారు. వారి ప్రాణాలు పోయాయని అంతా అనుకున్నారు. కాని, సుబ్బారావుగారు అధైర్యపడలేదు. లేచి, ఊటిలోవున్న డాక్టర్‌ని అర్జంట్‌గా పిలుచుకురమ్మని కారుయిచ్చి



'మంగమ్మ శపథం'లో ఎన్. టి. రామారావు, తదితరులు

మనిషిని పంపించారు. డాక్టరు వచ్చి చికిత్స చేసిన అరగంటకుగాని సుకన్య, రామ్మోహన్‌లు చైతన్య స్థితికి రాలేదు. గంట గడిచాక సుబ్బారావుగారు రామ్మోహన్‌ని నిశితంగాచూస్తూ, 'మోహన్, టేక్ చేద్దామా? అన్నారు. "ఎస్ సార్. రెడీ!" అంటూ ఉత్సాహంగా లేచాడు రామ్మోహన్. ప్రాణాపాయ కరమయిన సంఘటన సంభవించినా కూడ నటీ నటుల్లో ఉత్సాహం కొరవడలేదు. అందుకు కారణం దర్శకుడిగా శ్రీ ఆదుర్తి సుబ్బారావు వారికి ఇచ్చిన శిక్షణ. అది రేపటికోసం వారికి కల్పించిన రక్షణ.

"తేనె మనసులు చిత్ర నిర్మాణం శుభప్రదంగా ముగిసింది. ఇందులో పాల్గొన్న పన్నెండుమంది కొత్త తారలూ శ్రమించి నాతో సహకరించారు. ఈ చిత్రాన్ని ఏవిధంగా తీయాలనుకున్నానో,

చిత్రలహరి

ఏ యే ఎఫెక్ట్సు రావాలనుకున్నానో, ఆర్టిస్ట్స్, సాంగ్స్ పిక్చరైజేషన్, టేకింగ్స్—అన్నీ ఆవిధంగా వచ్చినవి. నాకు సంతృప్తినిచ్చేవిధంగా ఈ చిత్రం తీశాను. ప్రేక్షకులను ఇది బాగా ఆకర్షిస్తుందనే నమ్మకం నాకున్నది'' అన్నారు నవ్వుతూ శ్రీ ఆదుర్తి సుబ్బారావు—ఇటీవల వారిని కలుసుకున్నప్పుడు.

ఏప్రిల్ నెలలో విడుదల కాబోతున్న ఈ చిత్రంలో సుకన్య, సంధ్యారాణి, బేబీ రోజారాణి, పుష్పకుమారి, వాణిబాల, రాధాకుమారి, కృష్ణ, రామ్మోహన్, జి. యస్. ఆర్. మూర్తి, కోనేశ్వరరావు, ఎం. వి. చలపతిరావు, పి. వెంకటేశ్వరరావు నటించారు.

ఆదుర్తి, ఆత్రేయ, ముళ్ళపూడి వెంకటరమణ కలసి రూపొందించిన కథకు ఆత్రేయ సంభాషణలు సమకూర్చారు. గీతాలు : ఆత్రేయ, దాశరథి, సంగీతం : కె. వి. మహదేవన్, నృత్యాలు : హీరాలాల్, కళ : జి. వి. సుబ్బారావు, కెమెరా : పి. ఎన్. సెల్వరాజు, ఎడిటింగ్ : టి. కృష్ణ, అసోసియేట్ డైరెక్టర్ : కె. విశ్వనాథ్, నిర్మాత : సి. సుందరం. ఆంధ్రలో ఇది శ్రీఫిలింస్‌వారి ద్వారా విడుదల అవుతుంది.

దేవత

రేఖా అండ్ మురళీ ఆర్ట్స్‌వారి "దేవత" సాంఘిక చిత్రానికి జనవరి 22 న ముహూర్తం జరిపిన సంగతి పాఠకులకు విదితమే. ఓపెనింగ్ షాట్ ఇంటి సెట్టులో తీశారు. ముందు హాలు, దానికి ఆనుకుని పడకగది ఉన్నది.

"రెడీయా?" అడిగారు ఎన్. టి. ఆర్.

"రెడీసర్!" అన్నారు హేమాంబరధరరావు.

'సైలెన్స్, సైలెన్స్' అన్నా రెవరో బిగ్గరగా. రణగొణ ధ్వనితో నిండివున్న ఫ్లోర్ అంతా ఒక్కసారిగా నిశ్శబ్దమయిపోయింది.

"యాక్షన్!" అన్నారు దర్శకులు.

"సీతా, సెకండ్ షో సినిమాకి వెళదాం!"

"సినిమాకా?" అడిగింది సీత, భర్త వెనకాలే గదిలోకి వచ్చి.

"అవును. టిక్కెట్లు కూడ రిజర్వేషన్ చేశాను. తొమ్మిది గంటలకల్లా సిద్ధంగా ఉండాలి" అన్నా డతను కోటు తీసి భార్యకు అందిస్తూ.

"అలాగే" అన్నది సీత. సన్నగా నవ్వింది.

అద్దంలో చూసుకుంటూ టై విప్పుకోబోతున్న వాడల్లా ఆగి, సీత కళ్లల్లోకి అలాగే చూస్తూ ఉండిపోయాడు.

తొలి షాట్‌లో చిత్రీకరించిన దృశ్యమిది. కాకర్ల వెంకటేశ్వరరావు (వాణీఫిలిమ్స్) కెమెరా స్విచ్ ఆన్ చేశారు. ఈ షాట్‌లో ఎన్. టి. ఆర్, సావిత్రి నటించారు.

షాట్ కాగానే "బెస్ట్ ఆఫ్ లక్" అన్నది నటి సావిత్రి.

"బెస్ట్ ఆఫ్ బిజినెస్ సార్!" అన్నారు ఎన్. టి. ఆర్. కాకర్ల వెంకటేశ్వరరావుగారితో.

సెట్‌లో ఉన్నవారంతా ఘొల్లుమని నవ్వారు.


అనంతలక్ష్మి ఫిలిమ్స్

"ఒకే అమ్మ పిల్లలం, ఒకే కొమ్మ పువ్వులం
వింగినీరు నేలలకు ఒకటే మనమందరం"

—మానవుల్లోని సమైక్యతను, మమతను సరళమైన భాషలో చక్కగా చెప్పినది యువకవి రాజశ్రీ. దానిని మధురగళంతో మనోజ్ఞంగా పాడినది సుశీల. ఆ గీతాన్ని అందమైన బాణీలోమలచి, వీనులవిందు కూర్చే వరుస చేసినది సంగీత దర్శకుడు టి. వి. రాజు. అనంతలక్ష్మీ ఫిలిమ్స్‌వారి తెలుగు చిత్రానికిగాను ఈ గీతం ఫిబ్రవరి మొదటి తేదీన గోల్డెన్ స్టూడియోలో రికార్డు చేశారు.

"నవుకద దీప" అనే ప్రఖ్యాత కన్నడ నవల ఆధారంగా నిర్మించబడుతున్న ఈ సాంఘికచిత్రం మార్చి మధ్యభాగం నుంచి సెట్స్‌కు వెళ్లనున్నది. నిర్మాత, దర్శకుడు : జి. వి. అయ్యర్.

—మోహన్‌కుమార్ ★



'ప్రేమించిచూడు'లో నాగేశ్వరరావు, రాజశ్రీ, కాంచన

'ఆంధ్రసచిత్ర వారపత్రిక'లో ప్రచురణకు ఇండియన్ ఇంక్‌తో వేసిన కార్టూనులు మాత్రమే పంపాలి. సాధారణంగా 4" × 2", 4" × 4" చిత్రాలు పత్రికలో పడుతూ ఉంటాయి. సం॥

అవీ - ఇవీ - అన్నీ

నేషనల్ ఎక్కో మానేజర్‌కి కొత్త పదవి

నేషనల్ ఎక్కో రేడియో ఎండ్ ఎంజినీరింగ్ కంపెనీ లిమిటెడ్, జనరల్ మానేజర్ (వర్క్స్) అయిన శ్రీ జి. ఆర్. రావు 'ది రేడియో మాను ఫాక్చరర్స్ ఎసోసియేషన్ ఆఫ్ ఇండియా' కి 1965 అధ్యక్షులుగా ఎన్నిక అయ్యారు.

శ్రీ రావు 1940 లో మైసూరు విశ్వవిద్యాలయంలో బి. ఎస్. సి. ఆనర్సు పట్టభద్రులు అయి తరువాత ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్సులో పరిశోధనలు జరిపారు. ఇంకా, బీహార్, కాశ్మీరులలో తరిఫీదు పొందారు. అతర్వాత హిందూస్థాన్ రేడియోస్‌లో చేరారు. ఈ కంపెనీ క్రమేణ ప్రస్తుతం తాతా సంస్థలలో ఒకటయిన నేషనల్ ఎక్కో రేడియో ఎండ్ ఎంజినీరింగ్ కంపెనీగా మారిపోయింది. శ్రీ రావు ఇంగ్లండ్‌లోని ఇ. కె. కోల్ కంపెనీ లిమిటెడ్‌లో తరిఫీదు పొందారు. తిరిగి వచ్చిన తర్వాత జనరల్ మానేజర్ (వర్క్స్ గా నియమించబడ్డారు. శ్రీ రావు ఎన్నో విదేశాలు పర్యటించారు. రేడియో ఉత్పత్తి వర్గాలలో వీరి పేరు బాగా సుపరిచితమే. వీరు ఎన్నో జాతీయ సంస్థలలో సభ్యులు.

* * *


ఇటీవలనే గుంతకల్లు రైల్వే కళాసమితి యాజమాన్యమున జరుపబడిన నాటక పోటీల ప్రారంభోత్సవమునకు, బహుమతి ప్రధానోత్సవమునకు విచ్చేసిన కుమారి కృష్ణకుమారి, శ్రీమతి అంజలీదేవి, సంగీత దర్శకులు శ్రీ ఆదినారాయణరావు, నాట్యకళ గౌరవ సంపాదకులు శ్రీ పోతుకూచి సాంబశివరావుల గౌరవార్థము ఎస్. డి. కార్యాలయంలో శ్రీ ఎ. బలరాము సత్కారం ఏర్పాటు చేశారు. మొదటిరోజు కుమారి కృష్ణకుమారి గౌరవార్థము జరిగిన సభకు స్థానిక రోటరీ క్లబ్ ఉపాధ్యక్షులు శ్రీ వంకదారి రామకృష్ణయ్య అధ్యక్షత వహించారు. శ్రీమతి అంజలీదేవి గౌరవార్థము జరిగిన సభకు స్థానిక పురపాలక సంఘ స్పెషల్ ఆఫీసర్ శ్రీ వరప్రసాదరావు అధ్యక్షత వహించారు. ఆహ్వానితులను స్థానిక గ్రంథాలయాధికారి శ్రీ ఎ. గోపీనాధ్ పరిచయము చేశారు.

* * *


ఖర్గపూర్ ఆపరేటింగ్ కల్చరల్ యూనిట్‌వారు తమ సంస్థ ఆరవ వార్షికోత్సవ సందర్భము పురస్కరించుకుని శ్రీ రావికొండలరావు రచించిన 'నాలుగిళ్ల చావిడి' నాటకాన్ని ఇటీవలనే రవీంద్ర ఇన్‌స్టిట్యూట్‌లో ప్రదర్శించారు.

నాటకంలో భీమ శంకరంగా శ్రీ బి. వి. విశ్వేశ్వరరావు, రాఘవయ్యగా శ్రీ బి. సాంబశివరావు, చంద్రశేఖరంగా శ్రీ టి. వెంకటరావు, మాష్టారుగా శ్రీ బి. వి. రత్నం, జగన్నాధంగా శ్రీ బి. జె. శాస్త్రి, రంగడుగా మాష్టర్ యస్. ధర్మారావు, దుర్గమ్మగా శ్రీమతి టి. పార్వతీకుమారి, రత్నంగా శ్రీమతి కె. రత్నపాప నటించారు. ★

Edited, Printed and Published by S. Radhakrishna at the Andhra Patrika Press; 6&7 Thambuchetty Street Madras-1. Phone: 29766 & 23713. Chief Editor S. Sambhu Prasad.



"చంద్రహాస" లో హరనాథ్, కృష్ణకుమారి



చంద్రకాంత